
శతారుణ గీతాంజలి
రూ|| 180/-
పేజీలు: 180



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

కూల్చివేతలు ఆపండి 04
హైడ్రాకు హైకోర్టు ఉత్తర్వులు

సంపుటి 28, సంచిక: 290 | మంగళవారం | 14-04-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00



## జనాభా ఆధారంగా జిడిపిలో రాష్ట్రాల వాటా ప్రకారం సగం

### హైబ్రిడ్ విధానంలో డీలిమిటేషన్ : కేంద్రానికి సిఎం రేవంత్‌రెడ్డి సూచన

- కొత్తగా పెంచే సీట్లలో 136 సీట్లు జిడిపి వృద్ధి ఆధారంగా మరో 136 జనాభా ప్రాతిపదికన పెంచాలి
- దేశానికి ఆదాయం ఇస్తున్న రాష్ట్రాలను గౌరవించాలి
- నియోజకవర్గాల పునర్విభజనపై అఖిలపక్షంతో పాటు అన్ని సంస్థలతో సంప్రదింపులు చేపట్టాలి
- నిపుణులతో కమిటీ ఏర్పాటు చేయాలి
- అన్ని అసెంబ్లీలలో చర్చించి పార్లమెంటులో ఆమోదించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలి

ప్రజాపక్షం/హైదరాబాద్

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను హైబ్రీడ్ విధానంతో చేపట్టాలని, కేంద్ర ప్రభుత్వం పెంచాలనుకుంటున్న 50 శాతం 272 సీట్లలో 136 సీట్లు ప్రొరేటా విధానం ప్రకారం, మరో 136 సీట్లు జిడిపి (స్థూల జాతీయోత్పత్తి)లో అత్యధింకంగా వాటా ఇస్తున్న రాష్ట్రలకు జిఎస్‌డిపి (రాష్ట్ర స్థూల ఉత్పత్తి) పెరుగుదల ప్రకారం పునర్విభజన చేపట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంపై అఖిలపక్ష సమావేశంతో పాటు అన్ని సంస్థలతో సంప్రదింపులు చేపట్టాలని, నిపుణలతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని, అన్ని అసెంబ్లీలలో చర్చించి, పార్లమెంటులో ఆమోదించిన తర్వాతనే నిర్ణయం తీసుకోవాలని సిఎం కోరారు. 2028 మార్చి వరకు ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చని, ఈ బిల్లు వల్ల దక్షిణాది రాష్ట్రాలు, చిన్న రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయన్నారు. కేంద్రం హడావుడి చేసి దేశంలో దక్షిణ, ఉత్తరాది రాష్ట్రాల మధ్య అగాధాన్ని పెంచొద్దని సూచించారు. ఈ నెల 16 నుంచి జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టే మహిళా బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని, అయితే అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల పునర్విభజన బిల్లును మాత్రం పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సచివాలయంలో సోమవారం మంత్రులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల పునర్విభజనపై మోదికి పలు ప్రతిపాదనలు సూచించారు. దక్షిణ భారతదేశం దేశానికి ఆదాయాన్ని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నదని, తరువాయి 2లో

### బిల్లును ఎలా ఆమోదిస్తారో చూస్తాం

దక్షిణాది రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలను కూడా ఐక్యం చేస్తామని, పార్లమెంట్‌లో నియోజకవర్గాల బిల్లును ఎలా ఆమోదిస్తారో చూస్తామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. అన్ని దక్షణాది రాష్ట్రాలతో పాటు ఢిల్లీ, పంజాబ్ లాంటి చిన్న రాష్ట్రాలకు దీనిపైన లేఖ రాస్తానని తెలిపారు. తెలంగాణ ఎంపిలు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని, ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజనపై కూడా పోరాడుతారన్నారు. సీట్ల పునర్విభజనలో పర్సంటేజీలు కాదు నెంబర్ ముఖ్యమని సిఎం అన్నారు. రాజకీయాల్లో నెంబర్ ముఖ్యమని, వాజ్‌పేయి ప్రభుత్వం ఒక్క ఓటుతో పడిపోయిందని, నెంబర్ లేకుండా రాజకీయాల్లో ఎవరూ ఎవరితోనూ చర్చలు చేయరన్నారు. యాభై శాతంతో సీట్ల పునర్విభజన జరిగితే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు మోదీ ఇంటి ముందు బంట్రోతులుగా నిలబడాల్సి వస్తుందని, వాళ్ల అవసరం ఇక ముందు మోదీకి ఉండదని సిఎం వ్యాఖ్యానించారు.

## హోర్ముజ్ జలసంధి దిగ్బంధించిన అమెరికా

- పరస్పర హెచ్చరికల మధ్య యుద్ధ భయం-ఉత్కంఠ
- జలసంధి దాటే ఇరాన్ నౌకలను ధ్వంసం చేస్తాం: ట్రంప్
- సైనిక నౌకలొస్తే తీవ్ర పరిణామాలు : ఐఆర్‌జిసి
- గల్ఫ్ దేశాల్లో ఏ రేవుకీ భద్రత ఉండదు : ఇరాన్
- నౌకల దిగ్బంధం సముద్ర దొంగతనమే : యుసిఐఎఫ్
- అమెరికాకు బ్లాకేడ్ మద్దతు తిరస్కరించిన నాటో దేశాలు
- భారత్,చైనా,జపాన్ సహా పలు దేశాలకు చమురు కష్టాలు
- మళ్ళీ 100 డాలర్లు దాటిన బ్యారెల్ ధర
- గల్ఫ్ రేవులను మూసేస్తామని ఇరాన్ హెచ్చరిక



**వాషింగ్టన్:** హోర్ముజ్ జలసంధి దిగ్బంధనం (బ్లాకేడ్)పై అమెరికా సెంట్రల్ కమాండ్, ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జిసి) పరస్పర హెచ్చరికలతో తీవ్ర ఉత్కంఠ పరిస్థితి నెలకుంది. మళ్ళీ యుద్ధ పరిస్థితులు నెలకొన్న భారత కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం 6.46 గంటల నుండి ట్రంప్ ఆదేశించిన విధంగా హోర్ముజ్ జలసంధిలో తమ దళాలు ఇరాన్ ఓడ రేవుల నుండి నౌకలు రాకపోకలు చేయకుండా దిగ్బంధనాన్ని అమలులోకి తెచ్చినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ అధికారికంగా రాత్రి ధృవీకరించింది. దిగ్బంధనాన్ని ఉల్లంఘించి జలసంధిని దాటే ప్రయత్నం చేసే ఇరాన్ నౌకలను ధ్వంసం చేస్తామని మరోవైపు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. శాటలైట్ ద్వారా ఈ కదలికలను గమనిస్తున్నారు. అదే సమయంలో ఐఆర్‌జిసి ఒక ప్రకటన చేస్తూ, హోర్ముజ్ జలసంధి సమీపంలోకి ఏ సైనిక నౌక వచ్చినాగానీ కాల్పుల విరమణ ఉల్లంఘనగా భావిస్తామని, చాలా తీవ్రంగా ప్రతిస్పందిస్తామని హెచ్చరించింది. అంతర్జాతీయ జలాలలో నౌకల రాకపోకలపై దిగ్బంధనం "సముద్రపు దొంగతనం" అవుతుందని, అమెరికా చర్య అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని ఇరాన్ సాయుధ దళాల యూనిఫైడ్ కమాండ్ అధికార ప్రతినిధి హెచ్చరించారు. ఒకవైపు ఉద్రిక్తతలు కొనసాగుతుండగా మరోవైపు వాగ్వాదం కూడా జరుగుతోంది. ఇరాన్ తన అణుశుద్ధి, అణ్వాయుధ ఆశయాలను వదులుకోకపోవడంవల్లనే చర్చలు విఫలమయ్యాయని ట్రంప్ విమర్శించగా, అమెరికా తన లక్ష్యాలను మార్చుకోవడంవల్లనే చర్చలు విఫలమయ్యాయని ఇరాన్ విదేశీ వ్యవహారాలమంత్రి అబ్బాస్ అరాఘ్చి అన్నారు. ఒప్పందానికి కొద్ది అంగుళాల దూరంలో ఉన్న సమయంలో పరిస్థితిని తారుమారు చేసి చర్చలను కుప్పకూల్చారని ఆయన విమర్శించారు. కాగా బెదిరింపులకు ఇరాన్ లొంగిపోదని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాఘెర్ ఘాలిబాఫ్ హెచ్చరించారు. "ఇరాన్ నౌకా దళాన్ని తుడిచిపెట్టాం, కానీ శరవేగంగా వెళ్ళే నౌకలను ముప్పుగా పరిగణించలేదు, అందువల్ల వాటిపై దాడి చేయకుండా వదిలిపెట్టాం, కానీ ఆ ఫాస్ట్ ట్రాక్ షిప్పులు పరిధిదాటి దిగ్బంధన ప్రాంతం వైపు వస్తే వెంటనే ధ్వంసం చేస్తాం, ఇరాన్ యుద్ధ నౌకలు,పడవలు మా బ్లాకేడ్ ప్రాంతానికి దగ్గరగా వస్తే, మాదక ద్రవ్యాల ముఠాలకు చెందిన పడవలను ధ్వంసం చేసేందుకు మేం ఉపయోగించే శక్తిమంతమైన వ్యవస్థలను ఉపయోగించి తక్షణం వాటిని తునాతునకలుగా పేల్చేస్తాం" అని సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ప్రకటించారు. ఈ సందర్భంలో లెబనాన్ నుండి హెజ్బొల్లా ఉత్తర ఇజ్రాయెల్‌లోకి దాడులు చేసింది. హోర్ముజ్ జలసంధి ఇప్పటికీ పూర్తిగా తమ తరువాయి 2లో

## 15 నుంచి టెట్ దరఖాస్తులు

### జూన్ 15 నుంచి 30 వరకు పరీక్షలు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టిజి టెట్ 2026) దరఖాస్తులను ఈ నెల 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఈ మేరకు విద్యా శాఖ డైరక్టర్ డాక్టర్ ఈ.నవీన్ నికోలస్ సోమవారం నోటిఫికేషన్‌ను జారీ చేశారు. జూన్ 9వ తేదీ నుంచి టెట్ హాల్ టికెట్లు జారీ చేయనున్నారు. జూన్ 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించగా, జూలై 28వ తేదీ నుంచి 31వ తేదీ లోపు టెట్ ఫలితాలు విడుదల చేస్తారు. కాగా ఏడాదికి రెండు సార్లు (జూన్, డిసెంబర్) టెట్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగనే ఈ సారి జూన్‌లో పరీక్షలు నిర్వహించనుంది.




### అమెరికా-భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం

## తక్షణమే రద్దు

### ముక్తకంఠంతో డిమాండ్ చేసిన సంయుక్త కిసాన్ మోర్చా నేతలు

- ఒప్పందం కొనసాగిస్తే వ్యవసాయ ఉత్పత్తుల ధరలు క్షీణించి రైతుల జీవితాలు చీకటి మయమవుతాయని ఆందోళన
- ఒప్పందం రద్దు చేసేంత వరకూ మరో రైతు మహోద్యమాన్ని చేపడతామని కేంద్రానికి హెచ్చరిక
- ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఎస్‌కెఎం ధర్నా

ప్రజాపక్షం/హైదరాబాద్

విదేశీ, స్వదేశీ కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చడమే లక్ష్యంగా చేసుకున్న అమెరికా–భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నేతలు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఈ ఒప్పందం ఇదేవిధంగా కొనసాగిస్తే దేశ వ్యాప్తంగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు క్షీణించి అన్నదాతల జీవితాలు పూర్తిగా చీకటిమయం కానున్నాయని వారు పేర్కొన్నారు. ఈ ఒప్పందం రద్దు చేసేంత వరకు అవసరమైతే మరో రైతు మహోద్యమాన్ని చేపడుతామని కేంద్ర ప్రభుత్వాన్ని తరువాయి 2లో

## కనీస వేతనాలు అమలు చేయాలి

- నోయిడాలో రోడ్డెక్కిన కార్మికులు
- హింసాత్మకంగా మారిన నిరసనలు
- వాహనాలకు నిప్పు, ఆస్తులు ధ్వంసం
- నిరసనలతో స్తంభించిన ట్రాఫిక్



**నోయిడా/ న్యూఢిల్లీ :** వేతనాల పెంపు కోసం ఫ్యాక్టరీ కార్మికులు చేపట్టిన నిరసనలు హింసాత్మకంగా మారింది. సోమవారం నోయిడాలోని ఫేజ్ 2, సెక్టార్ 60 ప్రాంతాలలో వాహనాలకు నిప్పు పెట్టడం, ఆస్తులను ధ్వంసం చేయడం, రాళ్ల దాడి వంటి ఘటనలు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు. ఈ నిరసనల కారణంగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఉదయం రద్దీ సమయంలో ఢిల్లీకి వెళ్లే వివిధ రహదారులపై వేలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. ఢిల్లీ–నోయిడా సరిహద్దు వద్ద అనేక కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. అధికారుల ప్రకారం, వివిధ పారిశ్రామిక యూనిట్లకు చెందిన పెద్ద సంఖ్యలో కార్మికులు తమ చిరకాల తరువాయి 12లో




## దోస్త్ నోటిఫికేషన్ విడుదల

- ఈ నెల15 నుంచి మే 7 వరకు మొదటి దశ రిజిస్ట్రేషన్
- రాష్ట్ర వ్యాప్తంగా మూడు దశల్లో డిగ్రీ సీట్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

ప్రజాపక్షం/హైదరాబాద్

డిగ్రీ ఆన్‌లైన్ సేవలు తెలంగాణ (దోస్త్ 2026) మొదటి దశ రిజిస్ట్రేషన్ పక్రియ ఈ నెల15వ తేదీ నుంచి మే 7వ తేదీ వరకు జరగనుంది. మొత్తం మూడు దశలలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డిగ్రీ కోర్సులలో రిజిస్ట్రేషన్ల పక్రియ కొనసాగనుంది. జూలై 1వ తేదీ నుంచి డిగ్రీ మొదటి సెమిస్టర్ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి 'దోస్త్' నోటిఫికేషన్‌ను సోమవారం విడుదల చేశారు. ఏప్రిల్ 30 నుంచి మే 8 వరకు వెబ్ ఆప్షన్లు ఉంటాయి. మే 14న తొలి విడత సీట్ల కేటాయింపు ఉంటుంది. మే15 నుంచి మే 23వ తేదీ లోపు విద్యార్థులు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. రెండవ తరువాయి 2లో




## కెసిఆర్‌కు సీతక్క లీగల్ నోటీసు

### 48గంటల్లో నిరాధార పోస్టును తొలిగించాలని డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

అంగన్‌వాడీ మొబైల్ ఫోన్ల కొనుగోలు విషయంలో నిరాధార ఆరోపణలు చేస్తూ తన ప్రతిష్టను దెబ్బతీసే విధంగా బిఆర్‌ఎస్ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ బిఆర్‌ఎస్ అధ్యక్షుడు తరువాయి 12లో

## టిజిఎస్ ఆర్‌టిసిలో 22 నుంచి సమ్మె

- విలీనం సహా 32 డిమాండ్లు పరిష్కరించాలి
- కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
- టిఎస్ ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిఎస్ ఆర్‌టిసి)లో సమ్మె సైరన్ మోగింది. తమ డిమాండ్‌ల పరిష్కారంపై ప్రభుత్వం, యాజమాన్యం నుంచి ఆశించిన స్పంద న రాకపోవడంతో ఈనెల 22వ తేదీ (ఏప్రిల్ 21 అర్ధరాత్రి మొదటి డ్యూటీ నుం చి) సమ్మెకు వెళ్తున్నట్లు ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న ప్రకటించారు. తాము కొత్త కోరికలేవీ కోరడం లేదని, ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలనే అమలు చేయమని అడుగుతున్నామని తెలిపారు. హైదరాబాద్ ఆర్‌టిసి క్రాస్ రోడ్స్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో కార్మిక శాఖ కమిషనర్‌తో సో మవారం జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్ రెడ్డి, కోకన్వీనర్‌లు కత్తుల యాద య్య, మౌలాన, యాదగిరి తదితర ప్రతినిధులు చర్చలు జరిపారు. ఆర్‌టిసి యాజమాన్యం ఎవ రూ రాకపోవడం గమనర్హం. దీంతో కార్మిక శాఖ కమిషనర్‌తో జెఎసి ప్రతినిధులు జరిపిన చర్చలు విఫలమాయ్యాయి.



చర్చల అనంతరం ఈదురు వెంకన్న మాట్లాడుతూ గత నెల 13న సమ్మె నోటీ సు ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, యాజమా న్యం నుంచి చర్చలకు పిలవకపోవడాన్ని ఈదు రు వెంకన్న తప్పుబట్టారు. యాజమాన్యమే కార్మికులను సమ్మె చేసేలా ప్రోత్సహిస్తున్నట్లు ఉందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో తరువాయి 2లో



## 20న జగిత్యాలలో కెసిఆర్ సభ

ప్రజాపక్షం/జగిత్యాల

జగిత్యాల నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి నాంది పలుకుతామని మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆరోపించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 20న నిర్వహించనున్న కెసిఆర్ బహిరంగ సభ సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని తరువాయి 12లో

## చరిత్రలో మొట్టమొదటిసారి ఆస్ట్రేలియా ఆర్మీకి మహిళా నాయకత్వం



**కాన్‌బెర్రా:** ఆస్ట్రేలియా చరిత్రలో మొదటిసారి ఒక మహిళకు సైనిక బలగాల నాయకత్వాన్ని అప్పగించారు. లెఫ్టినెంట్ జనరల్ సూసన్ కోయిల్ రాబోయే జులై నెలలో ఆస్ట్రేలియా సాయుధ బలగాల ప్రధానాధిపతిగా బాధ్యతలు స్వీకరిస్తారు. దేశ రక్షణ దళాల నాయకత్వంలో జరుగుతున్న పునర్వ్యవస్థీకరణ చర్యల్లో భాగంగా ఈ మార్పు జరిగింది. ప్రధానమంత్రి ఆంటోనీ ఆల్బెనీస్, రక్షణమంత్రి రిచర్డ్ మార్లెస్ ఆమెకు అభినందనలు తెలియజేశారు. దీనిని ఒక చారిత్రక ఘట్టంగా పేర్కొన్నారు. 125 సంవత్సరాల ఆస్ట్రేలియా సైనిక చరిత్రలో ఒక మహిళ సర్వసైన్యాధిపతి బాధ్యతలు చేపట్టడం ఇదే మొదటిసారి. సూసన్ కోయిల్ ప్రస్తుతం జాయింట్ క్యాపబిలిటీస్ ప్రధానాధిపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2022లో సైనిక దళాల ప్రధానాధిపతిగా బాధ్యతలు చేపట్టిన సైమన్ స్టువర్ట్ పదవీకాలం మరో మూడు నెలల్లో జులైతో ముగుస్తుంది. కొత్త నాయకురాలు కోయిల్ నాలుగు దశాబ్దాలుగా సైనిక బలగాల్లో పనిచేస్తూ వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. పలు ఉన్నతస్థాయి కమాండ్ పదవులు నిర్వహించిన కోయిల్ అఫ్గానిస్థాన్,పశ్చిమాసియాలలో అనేక కార్యకలాపాల్లో పాల్గొన్నారు. ఆస్ట్రేలియా సైన్యంలో మహిళా అధికారులు,మహిళా సైన్యం సంఖ్య పెంచాలని ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో ఆమె నియామకం జరిగింది. వ్యవస్థాగతంగా సైన్యంలో వివక్ష, లైంగిక వేధింపుల ఆరోపణలు కొనసాగుతున్నాయి.

# లెబనాన్‌లో 160 మంది హెజ్బొల్లా ఫైటర్స్ మృతి



### మిలిటరీ స్థావరాలపై ఐడిఎఫ్ దాడులు
### రెడ్‌క్రాస్ కార్యాలయాలపై డ్రోన్లు

**సనా:** లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు ఆగకుండా కొనసాగుతున్నాయి. 160 మంది హెజ్బొల్లా ఫైటర్స్‌ను హతమార్చినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. గడచిన శుక్రవారం నుండి జరిగిన దాడులలోవీరు మరణించారు. దీనిపై హెజ్బొల్లా వెంటనే స్పందించలేదు. దక్షిణ లెబనాన్‌లోని మొరౌబ్ పట్టణంలో ఐ.డి.ఎఫ్ సైనికులు చేసిన దాడుల్లో నలగురు మరణించారు. అంతకుముందు పదిమంది దాడుల్లో మరణించారు. లెబనాన్‌లో గడచిన 40 రోజులుగా జరుగుతున్న యుద్ధంలో మృతులసంఖ్య 2,055కి చేరింది. వేలసంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. అనేక భవంతులు నేలమట్టమయ్యాయి. పిల్లలు,స్త్రీలు, అమాయకులు మరణిస్తున్నారు. వ్యూహాత్మకమైన బింట్ జెబైల్ పట్టణంలో ఇజ్రాయెల్ దళాలు భూతల దాడులు చేస్తూ హెజ్బొల్లా మిలిటరీ మౌలిక సదుపాయాలను చుట్టుముట్టామని, ఈ దాడుల్లో 100 మంది హెజ్బొల్లా ఫైటర్లు మరణించారని ఐడిఎఫ్ ప్రకటించింది. పట్టణ శివార్లలో ఐదుసార్లు ఐడిఎఫ్‌పై దాడులు చేసినట్లు ముందురోజు ఆదివారం హెజ్బొల్లా ప్రకటించింది. అదేవిధంగా టైర్‌లోని లెబనాన్ రెడ్‌క్రాస్ కార్యాలయాలపై కూడా సోమవారం డ్రోన్ దాడులు జరిగాయి. ఈ దాడుల్లో ఒకరు మరణించారు. వాహనాలు ధ్వంసమయ్యాయి. కాగా బెయిట్ యాహౌన్‌లో ఆదివారం దాడుల్లో మరణించిన రెడ్‌క్రాస్ వాలంటీర్‌కు సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఇరాన్ ప్రతిపాదించిన పది అంశాల ప్రణాళికను అంగీకరించి ఏప్రిల్ ఎనిమిదో తేదీన ట్రంప్ కాల్పుల విరమణకు అంగీకరించిన వెంటనే భారీస్థాయిలో లెబనాన్‌పై దాడులు చేసి వందలమందిని ఇజ్రాయెల్ హతమార్చింది. దీంతో ఇరాన్,హెజ్బొల్లా, ఐక్యరాజ్యసమితి సహా ప్రపంచ దేశాలు ఈ చర్యను ఖండించాయి. దీని వల్ల వాషింగ్టన్‌లో చర్చలకు కూడా విఘాతం కలిగింది. ఈ నేపథ్యంలో హెజ్బొల్లాను నిరాయుధులను చేసి నిర్మూలించే వరకూ తమ యుద్ధం ఆగదని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ సోమవారం మరోసారి స్పష్టం చేశారు. ఇదే తరుణంలో ఇజ్రాయెల్–లెబనాన్ మధ్య వాషింగ్టన్‌లో నిర్ణీత ప్రకారం తలపెట్టిన మంగళవారంనాటి చర్చలను హెజ్బొల్లా తిరస్కరించింది. ఈ చర్చల ఆలోచనను తీవ్రంగా విమర్శించింది.

**'మొస్సాద్' అధిపతిగా గోఫ్‌మన్:** ఇజ్రాయెల్ విదేశీ గూఢచారి సంస్థ ''మొస్సాద్'' అధిపతిగా రోమన్ గోఫ్‌మన్ (50) ను నెతన్యాహూ నియమించారు. గూఢచారి రంగంలో ఎలాంటి అనుభవంలేని ఒక వసైనిక అధికారిని తీసుకువచ్చి మొస్సాద్ అధిపతిగా నియమించడం ఒక అసాధారణ నిర్ణయంగా మారింది. ఐతే కరడుగట్టిన జియోనిస్టు భావజాలం నింపుకున్న గోఫ్‌మన్ నెతన్యాహూ జాతీయవాద భావాలకు అనుగుణంగా ప్రవర్తిస్తారు. సైనిక కార్యకలాపాలకు అనుగుణంగా సమన్వయం చేసుకుంటూ గూఢచారి కార్యకలాపాలు చేయడ, వివిధ కీలక ఏజన్సీలను సమీకృతం చేయడం, ప్రాంతీయ దేశాలలో ఇజ్రాయెల్ చురకైన పాత్రకు ఊతాన్ని ఇవ్వడం గోఫ్‌మన్ ప్రధాన లక్ష్యాలు.

ప్రస్తుత మొస్సాద్ అధిపతి డేవిడ్ బార్నియా ఐదేళ్ళ పదవీకాలం ముగిసిన తర్వాత జూన్ రెండో తేదీన గోఫ్‌మన్ కొత్త బాధ్యతలు తీసుకుంటారు. పొరుగుదేశాలలో ఉన్న ఇరాన్ అనుబంధ ఉగ్రవాదసంస్థల నాయకులను అంతం చేయడంలో మొస్సా ద్ ఆరితేరిన కళలు ప్రదర్శిస్తూవస్తోంది. ఐతే ఈ సంస్థ కు అమెరికా అంతరిక్ష ఉపగ్రహాల ద్వారా కూడా సహాయ సహకారాలు అందుతున్నట్లు ఇప్పటికే వార్తలు వె లువడ్డాయి. బెలారస్‌లో జన్మించిన గోఫ్‌మన్ 14 ఏళ్ళ వయసులో ఇజ్రాయెల్‌కు వలస వెళ్ళి అక్కడి సైన్యంలో చేరారు.

## 22 నుంచి సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

గత్యంతరం లేని పరిస్థితిలో సమ్మెలోకి వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడం సహా మొత్తం 32 డిమాండ్‌లను ప్రభుత్వం ముందు ఉంచామని, వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు కల్పించడం వంటి అంశాలు తమ ప్రధాన డిమాండ్‌లని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పలు సమస్యలను ప్రస్తావించినప్పటికీ పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. సమ్మె నోటీసు ఇచ్చి నెల రోజులు గడిచినా స్పందన లేకపోవడం బాధాకరమన్నారు.

ఆర్‌టిసి యాజమాన్యం కూడా కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే ఆసక్తి చూపడం లేదన్నారు. ఆర్‌టిసి విలీనం, యూనియన్ ఎన్నికల కోసం కమిటీని వేశామని మంత్రి చెబుతున్నారని, అయితే ఆ కమిటీకి ఛైర్మన్, సభ్యులు ఎవరో తెలియజేస్తూ ఉత్తర్వులను బహిర్గతం చేయాలని ఈదురు వెంకన్న డిమాండ్ చేశారు.

ఏప్రిల్ 22 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. జెఎసి వెనుక 39500 మంది కార్మికులు ఉన్నారని చెప్పారు. తమ అడుగుజాడల్లోనే అందరూ నడుస్తారన్నారు. అన్ని కేటగిరీల ఖాళీలను భర్తీ చేయాలని, కార్మికులను వారి పని స్థానాల్లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 21 అర్ధరాత్రి తర్వాత మొదటి డ్యూటీ నుంచి సమ్మె ప్రారంభమవుతుందని ఈదురు వెంకన్న స్పషం చేశారు. తమ చేపట్టే సమ్మెకు ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు తెలపాలని కోరారు. థామస్ రెడ్డి మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న విధానాలను ఖండించారు. కార్మికుల న్యాయమైన హక్కులు సాధించుకునేందుకు ప్రభుత్వంతో చావో రేవో తెల్చుకుంటామని హెచ్చరించారు. దశలవారిగా ఆర్‌టిసిని ప్రైవేటీకరించడంలో భాగంగా ఈవి బస్సులను ప్రవేశపెడుతున్నారని, బస్సు భవన్‌ను సెల్ ట్యాక్స్ శాఖకు కేటాయించిందని, దాన్ని తాము అడ్డుకున్నామని తెలిపారు.

సంస్థను ప్రభుత్వంలో విలీనం, ట్రేడ్‌యూనియన్‌ల పునరుద్ధరణ అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నాయని యాజమాన్యం తప్పించుకుందన్నారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం కనీస శ్రద్ధను చూపడం లేదని విమర్శించారు. విధిలేని పరిస్థితుల్లో సమ్మెలోకి వెళ్లుతున్నామని, ఈ సమ్మెకు ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతు ఇవ్వాలని కోరా రు.

**ప్రేరేపిత సమ్మెలకు వెళ్ళవద్దు : మంత్రి పొన్నం**

ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే అంశం కమిటీ వద్ద ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రెండు సమస్యల మినహా మిగతా అంశాలపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపా రు. సిబ్బందికి సంబధించిన అంశాలు పరిష్కరిస్తామని, ప్రేరేపిత సమ్మెలకు వెళ్ళవద్దని సూచించారు. ఇప్పటికే పెండింగ్ డిఎ ఇచ్చామని, పిఆర్‌సిపై ఆలోచన చేస్తున్నామని మంత్రి వెల్లడించారు.

## ఒప్పందం తక్షణమే రద్దు

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. అమెరికా భారత్ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌కెఎం ఆధ్వర్యంలో సోమవారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించా రు. ఎస్‌కెఎం నాయకులు కె.సూర్యనారాయణ, సుదర్శన్, దేవారా మ్, కోటేశ్వరరావు,ఇంద్రసేనా, తుకారామ్ నాయక్, సనప పొమ్మయ్య, సదా నందం అధ్యక్షత వహించారు.

ధర్నాను ఉద్దేశించి ఎస్‌కెఎం రాష్ట్ర కన్వీనర్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ ప్రసంగిస్తూ వ్యవసాయ ఆధారితమైన ఈ దేశ జనాభాలో (50 శాతం మంది) సుమారు 14 కోట్ల రైతు కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న నేపథ్యంలో 2023 ఫిబ్రవరి 10వ తేదీన కేంద్ర ప్రభుత్వం అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడం రైతాంగానికి తీవ్రమైన ముప్పుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మనదేశం నుంచి అమెరికా లాంటి విదేశాలకు వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేస్తే 30 శాతం నుంచి 150 శాతం మేరకు సుంకాలు ఉండేవని, ఈ ఒప్పందంతో మొత్తం ఎత్తివేశారన్నారు. దీంతో రైతులు పండిస్తున్న వరి, గోధుమ, మొక్కజొన్న, పత్తి, సోయాబీన్, పసుపు మిర్చి, నూనె గింజలతో సహా అన్ని రకాల పంటకు కనీస మద్దతు ధర కూడా రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో దేశ రైతాంగమంతా తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే పరిస్థితి వచ్చిందని ఆమె పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో రైతుల జీవితాలతో చెలగాటమాడే ఒప్పందాలను చేసుకునే హక్కును కేంద్ర ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. ఇప్పటికే నూతన వ్యవసాయ మార్కెట్ విధానాలు, విత్తన, విద్యుత్ సంస్కరణల పేరుతో రైతులను మరింత కష్టాల్లోకి నెట్టే ప్రయత్నం జరుగుతుండగా మరోవైపు ఈ ఒప్పందం రైతులకు మరింత గుదిబండగా మారునుందని, దీనిని రద్దు చేసేవరకు రైతాంగం విశ్రమించబోదని పశ్యపద్మ పేర్కొన్నారు. ఎస్‌కెఎం రాష్ట్ర కన్వీనర్ టి.సాగర్ మాట్లాడుతూ భారత్, అమెరికా మధ్య జరిగిన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి ముందు 2024 జనవరి నవంబర్ మధ్య 190.30 మిలియన్ డాలర్ల విలువైన పత్తి దిగుమతి కాగా, 2025 అదే కాలంలో ఇది 377.90 మిలియన్ డాలర్లకు పెరిగిందన్నారు. దీంతో గతంలో పత్తి రైతులు క్వింటాల్ పత్తిని మద్దతు ధరకు మించి రూ.10వేలకు పైగా అమ్మగా, ఒప్పందం కారణంగా దిగుమతులు పెరగడం కనీస మద్దతు ధర కనీస మద్దతు ధర రూ.7710 నుంచి రూ.8110 ఉండగా ధర మాత్రం రూ.5 వేలకు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయడంతో స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం (సి2+50 శాతం) పాటు మద్దతు ధరల చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. బి.రాము, బిక్షపతి, జంకుల వెంకటయ్య, ఎన్‌రెడ్డి హంసారెడ్డి, బి.వెంకటేశ్వర్లు, వి.నాగిరెడ్డి, ఎ.సాయన్నలు మాట్లాడుతూ అధునిక వ్యవసాయంలో పూర్తిగా వెనకబడి ఉన్న మన దేశాన్ని ఈ ఒప్పందం ఏవిధంగాను న్యాయం చేయదని పేర్కొన్నారు. భారతదేశంలో మన దేశంలో 86 శాతం మంది చిన్న, సన్నకారు రైతులు ఉండగా సగటు భూమి పరిమాణం 2.67 ఎకరాలు మాత్రమేనని, అదే అమెరికాలో అది సుమారు 469 ఎకరాలన్నారు. అమెరికాలో కేవలం 18.65 లక్షల మంది మాత్రమే వ్యవసాయం చేస్తుండగా, భారత్‌లో 14 కోట్ల కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని, అక్కడ ఒక్కో రైతుకు సుమారు రూ.21 లక్షల వరకు సబ్సిడీలు లభిస్తుంటే, భారతదేశంలో కేవలం రూ.6000 మాత్రమేనని వారు వివరించారు. రైతు బతికితేనే దేశం బతుకుతుందని, ఈ ఒప్పందాన్ని రద్దు చేయాల్సిందేనని వారు డిమాండ్ చేశారు.

## దోస్త్ నోటిఫికేషన్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

దశ రిజిస్ట్రేషన్లు మే 15 నుంచి 25 వరకు, మూడో దశ రిజిస్ట్రేషన్లు మే 31 నుండి జూన్ 15వరకు ఉండనున్నట్లు తెలంగాణ ఉన్నత విద్యా మండలి వెల్లడించింది. మరిన్ని వివరాల కోసం https://dos t.cgg .gov.in వెబ్ సైట్‌లో చూడాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి సూచించింది.

**ఉపాధి ఆధారిత కొత్త కోర్సులు : ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి**

డిగ్రీలో ప్రవేశాల పట్ల ఆసక్తి పెంచేందుకు ఉపాధి ఆధారిత కొత్త కోర్సులను ఈ ఏడాది నుంచి ప్రవేశపెడుతున్నామని తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. ప్రస్తుతం దోస్త్ లో కొత్త కోర్సులను కూడా చేరుస్తున్నామని, ఈ కోర్సు లు 52 కళాశాలలో అందుబాటులో ఉన్నాయని, మరో 69 కళాశాలలో పాత కోర్సుల స్థానంలో కొత్త కోర్సులను మార్చుకున్నారని ఆయన వివరించారు. ఎక్కడ ఉద్యోగాలు ఉంటాయో, ఏ రంగాల్లో ఖాళీలు ఉన్నాయో వాటికి సంబంధించిన కోర్సులను నూతనంగా అందిస్తున్నామన్నారు.

గత ఏడాది దోస్త్ లో 969 కాలేజీల్లో 4,40,107 సీట్లు ఉండగా, అందులో 2,05,140 సీట్లు,రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీల్లో 23 వేల సీట్లకు గాను 11,387 సీట్లు భర్తీ అయ్యాయని ఆయన వివరించారు. గత ఏడాది 54 కళాశాలలో జిరో అడ్మిషన్లు వచ్చాయని, ఫీజు రీయంబర్స్ మెంట్‌తో పాటు పలు విషయాలను ఇప్పటికే తాము ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈ సమావేశంలో ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

**దోస్త్ నోటిఫికేషన్**

**'దోస్త్' మొదటి దశ రిజిస్ట్రేషన్** (ఫీజు రూ.200లు)ఏప్రిల్ 15 నుంచి మే 7 వరకు.
వెబ్‌ఆప్షన్స్ ఏప్రిల్ 30 నుంచి మే 8 వరకు..
సీట్ల కేటాయింపు మే 14న ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్‌మే 15 నుంచి 23 వరకు
**రెండవ దశ రిజిస్ట్రేషన్** (ఫీజు రూ.400లు)
మే 15 నుంచి 25 వరకు..
వెబ్ ఆప్షన్స్ మే 15 నుంచి మే 26 వరకు..
సీట్ల కేటాయింపు
మే 30న ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్
మే 31 నుంచి జూన్ 5 వతేదీ వరకు
......
**మూడవ దశ రిజిస్ట్రేషన్**
మే 31 నుంచి జూన్ 15 వరకు
వెబ్ ఆప్షన్
మే 31 నుంచి జూన్ 16 వరకు
సీట్ల కేటాయింపు జూన్ 20 వరకు
ఆన్‌లైన్ రిపోర్టింగ్
జూన్ 20 నుంచి జూన్ 25 వరకు
(మొదటి, రెండవ, మూడవ దశలో సీట్లు పొంది న విద్యార్థులు జూన్ 20 నుంచి 27 వరకు రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది)
'సెమిస్టర్1' తరగతులు ప్రారంభం జూలై 1వ తేదీ నుంచి ప్రారంభం.

## వాటా ప్రకారం సగం

(మొదటి పేజీ తరువాయి)

అలాంటి రాష్ట్రాలను ఎలా శిక్షిస్తారని సిఎం ప్రశ్నించారు. విద్య, ఉద్యోగ అవకాశాల్లో యాభై శాతం రిజర్వేషన్లు, 50 శాతం మెరిట్‌తో చేయాలని ఇదివరకే సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని, అందుకే రిజర్వేషన్లు 50 శాతానికి మించలేదని గుర్తు చేశారు. స్థూల ఉత్పత్తిలో అత్యధికంగా భాగస్వామ్యమైన రాష్ట్రాలకు అవకాశం కల్పించాలని, ఈశాన్య రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జనాభా ప్రాతిపదికన సీట్లు లేవని, వంద శాతం జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు జరగలేదని, ప్రాతినిధ్యం కోసమే ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎంపి సీట్లు ఇచ్చారని రేవంత్ రెడ్డి వివరించారు.

**దక్షిణాది ద్వితీయ శ్రేణి రాష్ట్రాలుగా మార్చడానికి ప్రయత్నాలు**

దక్షిణాది రాష్ట్రాలను రాజకీయంగా ద్వితీయ శ్రేణి రాష్ట్రాలుగా మార్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, చిన్న రాష్ట్రాలకు కూడా సమస్య ఉండబోతుందని, ఢిల్లీ, పంజాబ్ వంటి రాష్ట్రాలు రాజకీయ మనుగడను కోల్పోతాయమని సిఎం ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా ప్రతిపాదికన 50 శాతం సీట్ల పెంపు అంశం దక్షిణాది రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలకు తీరని విఘాతమని విమర్శించారు. ఏ ప్రాతిపదకన సీట్లు పెంచాలో మొదట చర్చించాలన్నారు. రాజకీయ అవసరాల కోసం 50 శాతం సీట్లు పెంపు దేశ మనుగడకు మంచిదికాదని సూచించారు. ఇది రాజకీయ పార్టీలకు సంబంధించిన అంశం కాదని, ప్రజలకు సంబంధించిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు, నక్సలైట్లు లాంటి సమస్యలు వివక్ష వల్లనే వచ్చాయన్నారు. వివక్షను ఇంకా పెంచడానికి బిజెపి ప్రయత్నం చేస్తోందని, మహిళా బిల్లు ముసుగులో అడ్డ పడుతున్నారని, తక్షణమే మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల్లో మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. తప్పుడు ప్రచారం చేస్తున్న కేంద్రం నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లు అంశంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంటు సమావేశాలను నిర్వహించి హడావుడి చేస్తోందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనను రెండింటినీ ఒకటిగా చూపించి ప్రతిపక్షాలు సహకరించడంలేదని తప్పుడు ప్రచారం చేస్తోందని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు అంశాలు ఒకదానికి మరొకటి సంబం ధం లేనివని, రెండింటిని విడదీసి, వేర్వేరుగా చర్చించాలని సూచించారు. రాజ్యాంగంలో పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించిందే కాంగ్రెస్ పార్టీ అని, ప్రపంచంలోని చాలా దేశాల్లో మహిళలకు ఓటు హక్కు లేదని సిఎం గుర్తు చేశారు.

**రాజకీయ పావుగా వాడుకుంటున్న ప్రధాని మోదీ**

నియోజకవర్గాల పునర్విభజనను ప్రధాని మోదీ రాజకీయ పావుగా, ప్రమాదకరంగా వాడుకుంటున్నారని సిఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. పార్లమెంట్ నియోజకవర్గాలను 1967లో 520 సీట్లకు పెంచారని, 1976లో 542 సీట్లకు పెంచారని, ఆ తర్వాత సిక్కిం నుంచి ఒక సీటు పెరిగి ఆ సంఖ్య 543కు పెరిగిందని గుర్తు చేశారు. దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ పకడ్బందీగా అమలు చేయడం వల్ల జనాభా తగ్గిందని, ఉత్తరాదిలో కుటుంబ నియంత్రణ అమలు కాకపోవడంతో జనాభా విపరీతంగా పెరిగిందన్నారు. ఇందిరాగాంధీ ఈ విషయాన్ని గమనించే లోక్‌సభ సీట్ల ప్రకారమే నియోజకవర్గాల పునర్విభజన చేయాలని నిర్ణయించిందన్నారు. 25 ఏళ్ల వరకు సీట్ల పెంపునను ఇందిరాగాంధీ నిషేధించారన్నారు. జనాభా ప్రాతి పదికన సీట్ల పునర్విభజన జరగొద్దనే సీట్లను నియంత్రించారని, 2001లో వాజ్ పేయ్ పునర్విభజనపై చట్ట సవరణ చేశారని, తద్వారా 2009లో తెలంగాణకు 17 ఎంపి సీట్లు , ఆంధ్రాకు 25 ఎంపి సీట్లు వచ్చాయని, తెలంగాణకు 119 అసెంబ్లీ సీట్లు, ఏపికి 175 శాసనసభ సీట్లు పెరిగాయని అన్నా రు.

**జనాభా ప్రతిపాదికన సీట్లను ఒప్పుకోం:** జనాభా ప్రాతిపదికన సీట్ల పునర్విభజనకు ఒప్పుకోబోమని దక్షిణాది రాష్ట్రాలు నిరసన వ్యక్తం చేస్తూ ప్రధానికి లేఖ రాశాయన్నారు. 50 శాతం తం సీట్లు పెంచితే 20 సీట్లు ఉన్న కేరళకు, 80 సీట్లు ఉన్న యుపికి ఉన్న అంతరం ప్రస్తుతం 60 సీట్లు మాత్రమేనని, కానీ 50 శాతం పెంచితే 90 సీట్ల వరకు తేడా పెరుగుతుందని, అలాగే తెలంగాణకు, యుపికి 94 సీట్ల అంతరం పెరుగుతుందని వివరించారు.

దక్షిణాదిలో 130 సీట్లు ఉన్నాయని, 50 శాతం పెరిగితే 195 వరకు పెరుగుతాయని, కానీ ఉత్తరాదిలో 413 సీట్ల నుంచి 621 సీట్ల వరకు పెరుగుతాయని తెలిపారు. దీంతో దక్షిణాది, ఉత్తరాది మధ్య అంతరం 620 సీట్లకు పెరుగుతుందని, దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని సిఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ లెక్కల ప్రకారం ఇక రాష్ట్రపతి నుంచి కీలకమైన ఏ పదవినైనా దక్షిణాది రాష్ట్రాలకు ఇవ్వలేరని, బలహీనులు, బలవంతుల మధ్య చర్చలు జరగబోవని, సమాన స్థాయి ఉన్న వారి మధ్య చర్చలు ఉంటాయని సిఎం అన్నారు.

**కాంగ్రెస్ పార్టీ పురుషులతో పాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించింది**

కాంగ్రెస్ పార్టీ పురుషులతో పాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించిందని సిఎం చెప్పారు. దేశ ప్రధానిగా, రాష్ట్రపతిగా, లోక్‌సభ స్పీకర్‌గా, ముఖ్యమంత్రులుగా, గవర్నర్లు గా చాలా రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో మహిళలకు కాంగ్రెస్ పార్టీ అనేక అవకాశాలను కల్పించిందన్నారు. నాడు సోనియా గాంధీ నాయకత్వంలో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెడితే,బిజెపి సహకరించకపోవడంతో లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందలేదని ఆరోపించారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో 543 లోక్ సభ సభ్యుల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తే 181 మహిళలు ఎన్నికయ్యేందుకు అవకాశం ఉండేదన్నారు. 2023 లో మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని, 2026 తర్వాత జనాభా లెక్కల తర్వాత గెజిట్ ఆధారంగా మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తామని చట్టం చేశారని గుర్తు చేశారు. 2026 జనభా లెక్కలు పూర్తి చేసి అమలు చేయకుండా 2011 జనాభా లెక్కల ఆధారంగా చట్టం ముందుకు తెస్తున్నారని, 2026 జనాభా లెక్కల ప్రకారం నిబంధనను సవరించుకుంటే 2029 లోక్ సభతో పాటు వివిధ రాష్ట్రాల జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలు చేయవచ్చన్నారు. మహిళా రిజర్వేషన్లు, పునర్విభజనను కలపడం వెనుక రాజకీయ కుట్ర ఉందన్నారు. 2026 జనాభా లెక్కల ప్రకారం మహిళా రిజర్వేషన్ల బిల్లు తీసుకొస్తే కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇవ్వడానికి కట్టుబడి ఉంటామని, మహిళల రాజకీయ సాధికారితకు కాంగ్రెస్ మొదటి నుంచి కట్టుబడి ఉందన్నారు.

**బిజెపి మహిళకు అవకాశం ఇచ్చిందా?**

బిజెపి ఏర్పడిన 46 ఏళ్లలో జాతీయ అధ్యక్షురాలిగా ఎప్పుడైనా ఒక మహిళకు అవకాశం కల్పించారా? లేదా ఇతర ముఖ్యమైన పదవులలో మహిళా నాయకురాలిని నియమించారా? అనే విషయంపై ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి బండి సంజయ్‌లను సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తద్వారా బిజెపికి మహిళ పట్ల గౌరవం, చిత్తశుద్ధి ఉందో అర్థమౌతుందన్నారు. ఇందిరా గాంధీ, సోనియా గాంధీ నాయకత్వంలో అతి ఎక్కువ కాలం పనిచేసిన పార్టీ కాంగ్రెస్ మహిళలకు అన్యాయం చేస్తుందా? అని ప్రశ్నించారు. బిజెపి మహిళను అధ్యక్షురాలిగా నియమించుకున్న తర్వాత బండి సంజయ్ మాట్లాడాలన్నారు. బండి సంజయ్ వ్యాఖ్యలు దక్షణాది రాష్ట్రాల్లోని ఎస్సీ,ఎస్టీ, మహిళలకు వ్యతిరేకమైనవన్నారు. మహిళలను చిన్న చూపు చూడటమే బిజెపి లక్షణమని, ద్వితీయ శ్రేణి పౌరులుగా మహిళలను చూస్తు న్నారన్నారు. స్వాతం త్ర్యం తెచ్చింది, రాజ్యాంగాన్ని ఇచ్చింది, రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ పార్టీ అని ఇప్పుడు దేశాన్ని కాపాడుకునే బాధ్యత కూడా కాంగ్రెస్‌దేనని సిఎం అన్నారు.

## దిగ్బంధించిన అమెరికా

(మొదటి పేజీ తరువాయి)

నియంత్రణలోనే ఉందని, ఈ జలసంధిని శాశ్వత ప్రాతిపదికపై నియంత్రించేందుకు వీలుగా ఖచ్చితమైన నిబంధనలను ఇరాన్ అమలు చేస్తుందని ఆయన ప్రకటించారు. తమ ఓడ రేవుల భద్రతకు, ఎగుమతులకు నష్టం కలిగితే గల్ఫ్ ప్రాంతంలో ఏ దేశంలోని ఓడరేవులకూ రక్షణ లేకుండా చేస్తామని, ప్రాంతీయంగా ఉన్న సముద్ర జలాల్లో పూర్తి స్థాయిలో రక్షణ కొరవడుతుందని ఇరాన్ హెచ్చరించిన నేపథ్యంలో ఐఆర్‌జిసి ఏ విధంగా స్పందిస్తుందో అని అంతా గమనిస్తున్నారు.హోర్ముజ్ జలసంధిలో కాల్పు ల విరమణ ఉల్లంఘన–యుద్ధ ఉద్రిక్తత పరిస్థితిపై ఉత్కంఠ కొనసాగుతోంది తప్ప ఎలాంటి దాడులూ నౌకలపై జరిగినట్లు సోమవారం రాత్రి నాటికి కడపటి వార్తలు అందలేదు.

హోర్ముజ్‌కు వచ్చిన శత్రు మూకలు తమ ట్రాప్‌లో చిక్కుకుపోతారని, తమ జోలికి వస్తే ఎవరికీ భద్రతలేకుండా చేస్తామని స్పష్టం చేసింది. కాగా ఇరాన్‌కు సుంకాలు చెల్లించి హోర్ముజ్‌ను దాటి వెళ్ళే నౌకలను వెతికి వెతికి అడ్డుకోవాలని అమెరికా సైనిక బలగాలకు ట్రంప్ సోమవారం ఆదేశం జారీ చేయడంతో ప్రపంచవ్యాప్తంగా మళ్ళీ చమురు సమస్య అతి ప్రధానాంశంగా అజెండాలోకి వచ్చింది. అత్యధికంగా 120 డాలర్లు (బ్యారెల్)కు చేరిన చమురు ధర, ఇస్లామాబాద్ చర్చల ప్రకటనతో ఏప్రిల్ 8వ తేదీ నుండీ 95 డాలర్లకు దిగి వచ్చింది. కానీ చర్చలు విఫలం కావడంతో చమురు ధరలు మళ్ళీ ఒక్కసారిగా 100 డాలర్లకు పైగా పెరిగింది. ఇతర దేశాల నౌకల జోలికి వెళ్ళబోమని, ఇరాన్ ఓడ రేవుల నుండి వెళ్ళే నౌకలను, వారికి సుంకాలు చెల్లించి వెళ్ళే నౌకలను లక్ష్యంగా చేసుకుంటామని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించినప్పటికీ చమురు ధరలు భారీగా పెరిగాయి.

ఇదిలా ఉండగా, బ్లాకేడ్‌కు సహకరించేందుకు ట్రంప్‌కు మద్దతు ఇచ్చేందుకు నాటో మిత్రదేశాలు తిరస్కరించాయి.బ్రిటన్ సహా పలు దేశాలు ఈ బ్లాకేడ్‌లో పాల్గొంటాయని చర్చలు విఫలమైన తర్వాత ట్రంప్ ప్రకటించారు. కానీ ఈ బ్లాకేడ్‌కు సహకరించేదిలేదని బ్రిటన్ ప్రధానమంత్రి కీవ్ స్టార్మర్ పార్లమెంటు సమావేశంలో చెప్పారు .అమెరికా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఆయన స్వాగతిస్తూ, ఇందులో లెబనాన్‌ను కూడా చేర్చాలని కోరా రు. ఈ వారం చివరిలో డజన్లకొద్దీ దేశాలు ఒక శిఖరాగ్ర సమావేశం నిర్వహిస్తాయ చెప్పారు. కాగా అమెరికా దిగ్బంధనాన్ని ఎదుర్కొనేందుకు నౌకలు సిద్ధంగా ఉండాలని బ్రిటన్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ (యుకెఎంటిఓ) హెచ్చరించింది. ఇరాన్ చమురు ఎగుమతులకు అవకాశం లేకుండా నౌకలను దిగ్బంధనం చేయడం ద్వారా ఆ దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేందుకు ట్రంప్ వ్యూహం పన్నారు. ప్రధానంగా ఇరాన్ చమురు ఖర్గ్ ద్వీపంలోని నిల్వ కేంద్రం ద్వారా జరుగుతుంది. తొలుత ఇరాన్ ప్రకటించిన వ్యూహాన్నే ట్రంప్ కాపీక్యాట్ చేశారు. అమెరికా,ఇజ్రాయెల్ శత్రుదేశాల నౌకలు తప్ప అన్ని దేశాల నౌకలకూ హోర్ముజ్ నుండి అనుమతులు ఉంటాయని మొదటి నుండీ ఐఆర్‌జిసి ప్రకటిస్తూ వచ్చింది. ట్రంప్ బ్లాకేడ్ విధానం ద్వారా ఇరాన్ చమురు ఆదాయాన్ని, తద్వారా దాని ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీయాలని ఆలోచిస్తున్నారు.దీనివల్ల ప్రధానంగా భారత్,చైనా, జపాన్,దక్షిణ కొరియా దేశాల చమురు ఎగుమతులు స్తంభించిపోతాయి. భారత్ కూడా ఇరాన్ చమురు కొనుగోలు చేస్తోంది. 2019 తర్వాత మొదటిసారి కొద్ది రోజుల క్రితమే ఇరాన్ నుండి చమురు భారత్‌కు వచ్చింది. ఇప్పటికే 15 భారత్ నౌకలు హోర్ముజ్ వద్ద స్తంభించిపోయాయని వార్తలు వెలువడ్డాయి. ఈ దేశాల అవసరాలలో 50 శాతం చమురు హోర్ముజ్ ద్వారా రవాణా జరుగుతూ ఉంటుంది. ఐతే చైనా ఇప్పటికే బొగ్గు, ఇ–బైక్‌లు, స్వయంసమృద్ధి వంటి ప్రత్యామ్నాయ విధానాల ద్వారా చాలా స్థిరంగా ఆర్థిక వ్యవస్థను కొనసాగిస్తుండగా, గ్లోబల్ సౌత్ దేశాలు పాకిస్థాన్, బంగ్లాదేశ్,నేపాల్,శ్రీలంక, వియ త్నాం,సహా అనేక ఆఫ్రికా దేశాలు, చమురు దిగుమతులపై ప్రధానంగా బతికే దేశాలు ఇప్పటికే ప్రభుత్వ రవాణా వ్యవస్థలను స్తంభింపజేసి అనేక ప్రత్యామ్నాయ విధానాలు అమలు చేస్తున్నాయి. దీంతో ఈ దేశాలలో తీవ్ర సంక్షోభ పరిస్థితులు తలెత్తుతాయి. హోర్ముజ్ మూసి ఉన్నా, తెరచి ఉన్నా అమెరికాకు పెద్దగా ఒరిగేదీ ఏమీ లేదని, హోర్ముజ్ ద్వారా వచ్చే చమురు అమెరికాకు చాలా స్వల్పమని ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. కానీ గల్ఫ్‌లో అమెరికా మిత్రదేశాలైన సౌదీ అరేబియా,యునైటెడ్ అరబ్ ఎమి రేట్స్, కువైట్,ఖతార్ దేశాల చము రు ఎగుమతులకు కూడా తీవ్ర సమస్యలు ఎదురవుతాయి.

**కొనసాగుతున్న పరిష్కార యత్నాలు పాక్ ప్రధానమంత్రి షరీఫ్**

అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధ పరిష్కార ప్రయత్నాలు కొనసాగుతున్నాయని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ సోమవారం రాత్రి ప్రకటించారు.''యుద్ధ విరమణ ఇప్పటికీ కొనసాగుతోంది, వాస్తవానికి ఏప్రిల్ 22వ తేదీ వరకూ వైరి పక్షాలు కాల్పుల విరమణకు అంగీకరించాయి, నేను మాట్లాడుతున్న సమయానికి, మిగిలిన సమస్యల పరిష్కారానికి మరోవైపు నుండి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి'' అని షరీఫ్ తన మంత్రివర్గ సభ్యులతో చెప్పారని ఎ.ఎఫ్.పి వార్తాసంస్థ పేర్కొంది. కేవలం రెండు మూడు సమస్యలపైన తప్ప అన్ని అంశాలమీదా ఒప్పందం కుదిరిందని ట్రంప్ కూడా చర్చల అనంతరం సోషల్ మీడియా పోస్టింగ్ ద్వారా ప్రకటించారు. అణు శుద్ధి కార్యక్రమాన్నిపూర్తిగా వదులుకోవాలని, ఆ మేరకు తమకు స్పష్టమైన హామీ ఉండాలని అమెరికా ప్రతినిధి బృందం చర్చల్లో కోరింది. తమపై విశ్వసనీయత పెంచుకునే బాధ్యత అమెరికాదే అని ఇరాన్ చెబుతున్నది. తమ దేశ ఇంధన అవసరాలు,శాంతియుత ప్రయోజనాల నిమిత్తం అణుశుద్ధి చేసే హక్కు తమకు ఉందని స్పష్టం చేసింది. ఇస్లాం మతం అణ్వాయుధానికి వ్యతిరేకమని ఇరాన్ మొదటినుండీ చెబుతున్నది. కానీ ఆలస్యం లేకుండా హోర్ముజ్‌ను తెరవాలని, శుద్ధి చేసిన 400 కేజీల యురేనియంను తమకు స్వాధీనం చేయాలని అమెరికా కోరుతున్నది. ఆరువారాలుగా సాగిన యుద్ధంలో ధ్వంసమైన దేశాన్ని పునర్నిర్మించేందుకు నష్టపరిహారం ఇవ్వాలని ఇరాన్ కోరుతున్నది. స్తంభించిన 27 బిలియన్ డాలర్ల ఆస్తులను తిరిగి ఇవ్వాలని, ఆంక్షలు ఎత్తివేయాలని ఇరాన్ కోరుతున్నది. వీటిమధ్య లెబనాన్‌లో హెజ్బొల్లాపై దాడులు ఆపాలని ఇరాన్ చేసిన డిమాండ్‌కూడా ఇంతవరకూ ఒక కొలిక్కి రాలేదు.

**అమెరికాతో విభేదాలు లేవు దిగ్బంధనానికి మద్దతుఃనెతన్యాహూ**

హోర్ముజ్ జలసంధి నుండి బయటకు వచ్చే, లోపలకు వెళ్ళే రాకపోకల నౌకలన్నింటినీ దిగ్బంధనం చేస్తామన్న ట్రంప్ నిర్ణయానికి ఇజ్రాయెల్ మద్దతు ఇస్తుందని ఆ దేశ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ చెప్పారు.సోమవారం సాయంత్రం మంత్రివర్గ సమావేశాన్ని ఆయన ప్రారంభిస్తూ, హోర్ముజ్ విషయంలో అమెరికా–ఇజ్రాయెల్ సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు. ఇస్లామాబాద్‌లో చర్చలపై అమెరికా–ఇజ్రాయెల్ మధ్య ఎలాంటి విభేదాలు లేవని, ఇవన్నీ పూర్తిఅవాస్తవాలని స్పష్టం చేశారు. ''మేం నిరంతర సమన్వయంతో వ్యవహరిస్తున్నాం,

అధ్యక్షుడితోపాటు వారి బృందంతో మేం రోజువారీ జరిపే చర్చల్లో పాల్గొనేవారికి ఎవరికైనా ఈ విషయం తెలుస్తుంది'' అని నెతన్యాహూ చెప్పారు. ''అమెరికాతో ఈ స్థాయి సమన్వయం మునుపు ఎన్నడూలేదు, ఇజ్రాయెల్ చరిత్రలో ఎన్నడూలేదు, యూదు ప్రజల చరిత్రలో లేదు'' అని ఉద్ఘాటించారు. ''ఇరాన్–అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ఏ క్షణంలోనైనా మారిపోవచ్చు'' అని కూడా ఆయన అన్నారు.

ఇస్లామాబాద్‌లో చర్చల తర్వాత తిరిగి వస్తుండగా అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ తనకు చర్చల వివరాలన్నీ తెలియజేశారన్నారు. కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనను అమెరికన్లు సహించలేరు, వారు వెంటనే హోర్ముజ్ జలసంధిని తెరవాలి, కాల్పుల విరమణ పాటించాలి, కానీ దీనిని చేయలేదు, దీనిని అమెరికన్లు సహించరు అన్నారు.

## మహిళా బిల్లులో బిసి మహిళలకు రిజర్వేషన్ కల్పించకపోవడం దారుణం

ప్రధాని మోదీకి లేఖ రాసిన రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా రిజర్వేషన్ ఒక చారిత్రాత్మక ముందడుగు అని, ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు రిజర్వేషన్ అవకాశం కల్పిస్తూ జనాభాలో ప్రధాన భాగమైన బిసి మహిళలకు రిజర్వేషన్ కల్పించకపోవడం, వారిని విస్మరించడం ఆందోళన కలిగిస్తున్న అంశమని రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ పేర్కొన్నారు. మహిళా బిల్లుతో పాటు దేశంలో జనగణనలో అనుసరిస్తున్న విధానాల ద్వారా బిసిలకు, బిసి మహిళలకు అన్యాయం జరగకుండా చూడాలని సోమవారం ప్రధాని మోదీకి రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. అలాగే రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఈ మేరకు కృషి చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సోనియాగాంధీ, రాజ్యసభ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీలకు కూడా వేర్వేరుగా లేఖలు రాసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

తెలంగాణ రాష్ట్రంలోని బిసి జాబితాలో 130 బిసి కులాలుండగా, కేంద్ర ఓబిసి జాబితాలో కేవలం 90 కులాలు మాత్రమే చేర్చబడ్డాయని, మిగతా 40 కులాలు కేంద్ర జాబితాలో చేర్చబడనందున, వివిధ కులాల వారు కేంద్ర ప్రభుత్వ విద్యా, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్లు పొందలేకపోతున్నారన్నారు. కాబట్టి 2027 జనగణన ప్రారంభానికి ముందే ఈ 40 కులాలు కేంద్రం ఓబిసి జాబితాలో చేర్చే విధంగా పార్లమెంట్‌లో సవరణ తీసుకురావాలని, లేకుంటే జనగణన సమయంలో ఈ 40 కులాల వారిని గణనలోకి తీసుకోనందున తెలంగాణ బిసిల సంఖ్య తక్కువగా చూపే ప్రమాదం ఉందని జి.నిరంజన్ తెలిపారు.

## విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి


సిఎం రేవంత్‌కు ఎంఎల్‌సి సత్యం లేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంఎల్‌సి సత్యం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్రంలోని టిఎస్ ట్రాన్స్‌కో, టిఎస్‌జెన్‌కో, టిజిఎస్‌పిడిసిఎల్, టిజిఎన్‌పిడిసిఎల్ విద్యుత్ సంస్థల్లో గత 25 నుంచి 30 ఏళ్లుగా అహర్నిశలు శ్రమిస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 8వ తేదీ నుంచి ఆర్టిజన్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం 2017లో కార్మికులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చి, ప్రమోషన్లు, సెలవులు ఇవ్వకుండా మోసం చేసిందని, సంస్థలోని రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించే 'ఎపిఎస్ఇబి రూల్స్' కాకుండా, ఆర్టిజన్ల కోసం ప్రత్యేకంగా 2020లో కొత్త సర్వీసు రూల్స్ తెచ్చి వారిపై రుద్దడం అన్యాయమన్నారు. తాగునీరు, లైటింగ్ వంటి కనీస సదుపాయాలు కూడా లేని సబ్ స్టేషన్లలో, తీవ్రమైన సిబ్బంది కొరతతో ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యార్హతను బట్టి ఆర్టిజన్ కార్మికులందరికీ (జూనియర్ లైన్‌మెన్, జూనియర్ అసిస్టెంట్, సబ్ ఇంజనీర్ తదితర) కన్వర్షన్ చేయాలని, సంస్థలో పనిచేస్తున్న అందరికీ ఎలాంటి వివక్ష లేకుండా 'ఎపిఎస్ఇబి రూల్స్' అమలు చేయాలన్నారు. టిజిఎస్‌పిడిసిఎల్ తరహాలో టిజిఎన్‌పిడిసిఎల్ పరిధిలోని ఆన్ మ్యాన్డ్ వర్కర్స్‌ను, 2016 నుండి చిన్న చిన్న అభ్యంతరాలతో పక్కనపెట్టిన కార్మికులను సంస్థలో విలీనం చేసుకోవాలని, పీస్ రేట్ వర్కర్స్ (బిల్ రీడర్స్, బిల్ కలెక్టర్స్, హమాలీ తదితర) అందరికీ కనీస వేతన చట్టం అమలు చేయడంతో పాటు కార్మికులందరికీ ప్రతి నాలుగేళ్లకు ఒకసారి ఇచ్చే 'పిఆర్‌సి 2026'ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సామాన్య ప్రజలు ఇబ్బందులు పడకముందే, సిఎం రేవంత్‌రెడ్డి తక్షణమే జోక్యం చేసుకుని కార్మిక సంఘాలతో చర్చించి ప్రధాన డిమాండ్లను పరిష్కరించడం ద్వారా 20వేల కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలని నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

సిఎం రేవంత్‌రెడ్డికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిజిఎస్ ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డికి ఆదివారం లేఖ రాశారు. తమ డిమాండ్లను నేరవేర్చాలని సుదీర్ఘ కాలంగా ఆర్‌టిసి కార్మికులు అనేక రూపాల్లో ఉద్యమాలు నిర్వహించడంతో పాటు పలుసార్లు వినతి పత్రాలు సైతం సమర్పించారని, అయినప్పటికీ ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించకపోవడం భావ్యం కాదని సాంబశివరావు పేర్కొన్నారు. ఆర్‌టిసి కార్మికుల న్యాయబద్ధమైన ప్రధాన డిమాండ్‌లను పరిష్కరించడం ద్వారా ఆర్‌టిసి కార్మికులు నిరవధిక సమ్మెకు వెళ్లకుండా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం, రెండు వేతన సవరణల అమలు, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘ ఎన్నికల నిర్వహించడం, కార్మికులకు ఉద్యోగ భద్రత, ప్రయాణీకుల సౌకర్యం కోసం కొత్త బస్సులు కొనుగోలు చేసి సంస్థను విస్తరించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఇప్పటివరకు ఏ ఒక్క హామీ కూడా అమలు కాకపోవడంతో ఆర్‌టిసి కార్మికులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. మరోవైపు ఆర్‌టిసిలో కొత్తగా ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో అద్దె వాహనాలను తీసుకొస్తున్నారని, ఈ బస్సులో పనిచేస్తున్న డ్రైవర్లకు ఆర్‌టిసికి సంబంధం లేకపోగా, ఈ బస్సులపై ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ ప్రైవేట్ వ్యక్తుల జేబులోకి వెళ్లుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఎలక్ట్రిక్ బస్సులు ప్రభుత్వం తీసుకుని ఆర్‌టిసికి ఇవ్వడం వల్ల సంస్థకు ఆదాయం సమకూరడమే కాకుండా ప్రజారవాణా వ్యవస్థ మరింత విస్తరించడంతో ఆర్‌టిసిలో ప్రైవేట్ గుత్తాధిపత్యం కూడా తగ్గుతుందని వెల్లడించారు. గత 11 ఏళ్లుగా ఆర్‌టిసిలో నియామకాలు లేకపోవడంతో పని భారాన్ని ఉన్న ఉద్యోగులే భరించాల్సివస్తుందని, దీంతో కార్మికులు తీవ్ర అనారోగ్యాలకు గురతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిఎఫ్‌కు సంబంధించి ఉద్యోగస్థుల నుంచి వసూలు చేసిన సుమారు రూ.1200 కోట్లను యాజమాన్యం రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్‌కు పంపకపోవడం వల్ల చాలా మంది ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్లు గత ఐదేళ్లుగా విడుదల కాలేదని లేఖ ద్వారా సిఎం దృష్టికి తీసుకువచ్చారు. కార్మికుల సమస్యలను పరిష్కరించి సమ్మెను నివారించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని సాంబశివరావు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.

## ప్రమాదాల నివారణ, ప్రాణ నష్టం ఉండొద్దనే అరైవ్–అలైవ్ లక్ష్యం

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రోడ్డు ప్రమాదం జరిగినపుడు గంట (గోల్డెన్ అవర్)లోపు ఆసుపత్రిలో చేర్చితే రాహవీర్ అవార్డ్ ఇస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ప్రమాదాల నివారణ, ప్రాణ నష్టం లేకుండా చూడటమే 'అరైవ్ అలైవ్' కార్యక్రమ లక్ష్యమన్నారు. ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో సోమవారం 'ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక'లో భాగంగా అరైవ్‌అలైవ్ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి, జెటిసిలు చంద్రశేఖర్ గౌడ్, రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి 18వ తేదీ వరకు రోడ్ సేఫ్టీ కోసం పోలీస్, రవాణా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. రవాణా నిబంధనలు, ప్రమాదాలకు కారణాలు చర్చించి, వాటిని తగ్గించే చర్యలు తీసుకోవడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం రవాణా శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ ఆరు రోజుల్లో అన్ని జిల్లాల్లో శాఖాపరంగా సమీక్షలు చేసుకుంటామన్నారు. చెక్ పోస్టులు ఎత్తివేసి కొత్త సంస్కరణలు తీసుకురావడంతో పాటు అన్ని స్కూళ్లలో విద్యార్థులకు రవాణా నిబంధనలు వివరించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఆర్‌టిసిలో 30 ఏళ్ల సర్వీసులో ఉండి, ఒక్క ఆక్సిడెంట్ కూడా చేయని వారికి సన్మానం చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు.

## ఆదివాసీ, గిరిజనుల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆదివాసీ, గిరిజన ,ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పనకు అడ్డంకిగా ఉన్న సమస్యల పరిష్కారం పైన ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఆయన తెలిపారు. ఆదివాసీ, గిరిజన,ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధి పనుల పైన మంత్రి సీతక్క నేతృత్వంలో గిరిజన,ఆదివాసీ ఎంఎల్‌ఎల బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి పలు సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో చెక్ డ్యాంల నిర్మాణంపైన దృష్టి సారిస్తామని వారికి సిఎం హామీ ఇచ్చారు. వీటి ద్వారా తాగు, సాగు నీటి అవసరాలను తీర్చవచ్చన్నారు. చెక్ డ్యాం లు, రహదారుల నిర్మాణం కోసం అటవీ శాఖ నుంచి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. వీలైనంత త్వరగా అటవీ శాఖ నుంచి అనుమతులు వచ్చేలా చూస్తానన్నారు. ఆదివాసీ,గిరిజన రైతులు సాగు చేస్తున్న భూముల్లో బోర్లు వేయడానికి అనుమతులు ఇవ్వాలని చేసిన విజ్ఞప్తికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. అటవీశాఖ అభ్యంతరాల వల్ల రహదారుల మరమ్మత్తులు ఆలస్యం అవుతాయని, కొన్ని చోట్ల కొత్త రహదారులకు అనుమతులు ఇవ్వడం లేదని వారు సిఎం దృష్టికి తీసుకు వచ్చారు. వీలైనంత త్వరగా వీటిపైన నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోటా పెంచే విషయాన్ని పరిశీలిస్తామని సిఎం హామీ ఇచ్చారు.ఐటిడిఎ లను మరింత బలోపేతం చేస్తామన్న ముఖ్యమంత్రి ఆదివాసీ, గిరిజనులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఖానాపూర్ ఎంఎల్ఎ వెడ్మ బొజ్జు, పినపాక ఎంఎల్ఎ పాయం వెంకటేశ్వర్లు, మహబూబాబాద్ ఎంఎల్ఎ డాక్టర్ మురళి నాయక్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని కలిసిన వారిలో ఉన్నారు.

**మహనీయులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్: సిఎం రేవంత్ రెడ్డి**

భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పించారు. అణగారిన వర్గాల సంక్షేమం కోసం అంబేద్కర్ చేసిన కృషిని ఆయన కొనియాడారు. దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలు, మహిళల సాధికారతకు ఆయన నిరంతరాయంగా కృషి చేశారని గుర్తుచేశారు. దేశ భవిష్యత్తును తన ముందుచూపుతో ఊహించి, దార్శనికతతో రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేద్కర్ భావి తరాలకు స్ఫూర్తిగా నిలిచారని స్మరించారు. అణగారిన వర్గాల ప్రజల హక్కులకు అంబేద్కర్ చేసిన పోరాటం యావత్ ప్రపంచానికి ఆదర్శమని చెప్పారు.

ఆ మహనీయుని ఆశయాల సాకారానికి మనమంతా కృషి చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతుందని అన్నారు. దీంతో అన్ని వర్గాలు, అన్ని మతాల పిల్లలందరూ ఒకే చోట నాణ్యమైన విద్యాబోధనను అందుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## 'ఇన్ సర్వీస్ టీచర్ల'కు ప్రత్యేక టెట్ పరీక్షలు నిర్వహించండి

ఎస్‌టియు టిఎస్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తమిళనాడు రాష్ట్రం తరహాలోనే తెలంగాణ రాష్ట్రంలో కూడా 'ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు' సాధారణ టెట్ పరీక్షలతో పాటు సంవత్సరంలో మూడు సార్లు ప్రత్యేక టెట్ పరీక్షలను నిర్వహించాలని ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జి.సదానందంగౌడ్, ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఎం.పర్వత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం వారు పాఠశాల విద్యా సంచాలకులు నవీన్ నికోలస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సదానందంగౌడ్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఉండేదని, తద్వారా గత కొన్నేళ్లుగా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ పరీక్షలకు దూరంగా ఉన్నారన్నారు. సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా ఉపాధ్యాయులందరికీ టెట్ పరీక్షకు అనుమతినిస్తూ పాఠశాల విద్యా శాఖ గత సంవత్సరంలో 'జిఒ 28'ను జారీ చేసిందని వివరించారు. ఉపాధ్యాయుల శ్రేయస్సు, వారు కోల్పోయిన అనేక అవకాశాలను దృష్టిలో పెట్టుకుని 'ఇన్ సర్వీస్' ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ పరీక్షలు నిర్వహించాలని కోరారు.

## ఆ ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణకు ఇవ్వండి

ప్రధాని మోదీని ఇక్కడికి తీసుకొద్దాం

రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి




**ప్రజాపక్షం/భద్రాచలం :** అశాస్త్రీయ పద్ధతిలో చోటు చేసుకున్న రాష్ట్ర విభజన ఆ ఐదు గ్రామపంచాయతీల ప్రజలకు శాపంగా మారిందని, దీంతో వారు అన్ని విధాలు నష్టాలకు గురవుతున్నారని, ఇప్పటికైనా కేంద్రం పునరాలోచన చేసి పోలవరం పేరుతో ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసిన భద్రాచలం పూర్వ మండల గ్రామ పంచాయతీలైన కన్నాయిగూడెం, పిచుకలపాడు, ఎటపాక, పురుషోత్త పట్నం, గుండాలను తెలంగాణలో కలపాలని రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి డిమాండ్ చేశారు. ఐదు గ్రామపంచాయతీల వితరణ కోసం భద్రాద్రి ఐఖ్యతా గళం పేరుతో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉద్యోగ జేఏసి ఆధ్వర్యంలో చేపట్టిన భద్రాద్రి పునరేకీకరణ విస్తృతస్థాయి అఖిలపక్ష సమావేశం సోమవారం పట్టణంలోని బ్రిడ్జీ సమీపంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడారు. అనేక పోరాటాలతో సాధించుకున్న తెలంగాణలోని చివరి భూ భాగం భద్రాచల పుణ్య క్షేత్రం అని, పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాల పేరుతో రాష్ట్ర విభజన సమయంలో ఏడు మండలాలను ఏపిలో విలీనం చేశారని, ఆ ఏడు మండలాల్లో ఒకటైన భద్రాచలం పట్టణం మినహా పూర్వ మండలం మొత్తం ఉందని చెప్పారు. దీంతో ఇక్కడ విద్యా, వైద్యపరమైన సమస్య తలెత్తిందని, ప్రజలు,విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పాఠశాల విద్య మొత్తం తెలంగాణలో చదివిన విద్యార్థులు పై చదువులు కోసం పోటీ పరీక్షలు రాసి ఉత్తీర్ణ సాధిస్తే స్థానికత కారణంగా వారికి సీట్లు దక్కడం లేదని, అసలు మీ అడ్రస్ ఏంటి అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తుందని ఇక్కడి ఆ పార్టీ నేతలు పలుమార్లు చెప్పారని, కానీ నేటికీ అది కార్యరూపం దాల్చలేదన్నారు. తాను కూడా చట్టసభలో దీనిపై ఎప్పటినుండో గళం విప్పుతున్నానని, ఆయినా పాలకులు పెడచెవిన పెడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం దీనిపై పలుమార్లు ప్రభుత్వానికి వినతి పత్రాలు సమర్పించారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తాను ఈ ఐదు గ్రామపంచాయితీలో విషయంలో చర్చించగా ప్రాధాన్యతా అంశంగా తీసుకున్నారని తెలిపారు. ఆ ఐదు గ్రామ పంచాయతీలను సాధించే వరకు ఈ ప్రాంత ఆడ బిడ్డగా కలిసి వస్తానని, అవసరమైతే కేంద్రం మెడలు వంచి ఒప్పించి ఆ పంచాయితీలను తిరిగి తెలంగాణలో విలీనం చేసుకునే వరకు పోరాటాన్ని కొనసాగిద్దామని చెప్పారు. అంతకు ముందు బిఆర్‌ఎస్ రాష్ట్ర ప్రతినిధి ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో చోటుచేసుకున్న అంశంతో ఐదు పంచాయితీల ప్రజలకు తీవ్ర నష్టాన్ని తెచ్చిపెడుతోందని, విభజన జరిగి 12 ఏళ్లు అవుతున్నా ఆ సమస్య ఓ కొలిక్కి రాకపోవడం దురదృష్ట కరమని స్పష్టం చేశారు. అనంతరం స్థానిక ఎంఎల్‌ఎ డా.తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ భద్రాచలం పట్టణానికి ఆనుకుని ఉన్న ఆ ఐదు గ్రామ పంచాయతీల ప్రజలు ప్రతీ అవసరానికి భద్రాచలమే రావాలని, పరిపాలనాపరమైన సమస్యలు ఎవైనా ఉంటే వాటి కోసం ఏపిలోని సుదూర ప్రాంతానికి వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. అనంతరం పలువురు అఖిలపక్షం నేతలు మెచ్చా వెంకటేశ్వర్లు, కెచ్చల కల్పన, కుంజా ధర్మా, మానె రామకృష్ణ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అటవి అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు. సర్పంచ్ పూనెం కృష్ణ, టిజిఓ నాయకులు ఏలూరి శ్రీనివాసరావు, గుంటుపల్లి శ్రీనివాసరావు, అమరనేని రామారావు, భార్గవ్ చైతన్య, పెన్షనర్ల జిల్లా అధ్యక్షులు చల్లగుళ్ల నాగేశ్వరరావు, ఖమ్మం జిల్లా అధ్యక్షులు కళ్యాణం నాగేశ్వరరావుతో పాటు యూటిఎఫ్ నాయకులు చావా రవి, రాజు, విలీన పంచాయతీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## మహిళల గురించి బిజెపి మాట్లాడడం సిగ్గుచేటు

మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళల గురించి బిజెపి మాట్లాడడం సిగ్గుచేటు అని మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. గాంధీభవన్‌లో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదని, మహిళా బిల్లు అవశ్యకతను మొదట గుర్తించిందే కాంగ్రెస్ అని అన్నారు. కానీ, ఎన్నికలు ఉండగా ఎందుకు ఇంత హడావిడి అని ప్రశ్నించారు. క్రెడిట్ కోసమే బిజెపి నేతలు డ్రామాలు ఆడుతున్నారనీ, పద్ధతి ప్రకారం అన్ని పార్టీలతో చర్చించిన తర్వాతనే మహిళా బిల్లు పెట్టాలని ఎర్రబెల్లి స్వర్ణ పేర్కొన్నారు.

## అరుదైన ఖనిజాల అన్వేషణతో ఆర్థికాభివృద్ధికి ఊతం

మంత్రి వివేక్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అరుదైన ఖనిజాల అన్వేషణ దేశంతో పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై సానుకూల ప్రభావాన్ని చూపుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఈ ఖనిజాలకు అంతర్జాతీయ, దేశీయ మార్కెట్లలో విస్తృత విలువ ఉందని, భవిష్యత్ అభివృద్ధికి ఈ రంగం కీలకమని ఆయన అన్నారు.

హైదరాబాద్‌లోని హెచ్ఐసిసిలో సోమవారం కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'క్రిటికల్ మినరల్ బ్లాక్స్ వేలం', 'ఎక్స్‌ప్లోరేషన్ లైసెన్స్' అంశాలపై రోడ్‌షో నిర్వహించారు. కార్యక్రమానికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి, మంత్రి వివేక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ ఖనిజాల కేటాయింపులో పారదర్శకత కోసం కేంద్రం సహా రాష్ట్ర ప్రభుత్వాలు పలు చర్యలు తీసుకున్నాయని మంత్రి తెలిపారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్ని ఖనిజ వనరులను పారదర్శక వేలం విధానంలో కేటాయించే విధాన నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. గత రెండేళ్లలో ఈ విధానం అమలుతో రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరిగిందని, ప్రైవేట్ బిడ్డర్లు పెద్ద ఎత్తున వేలం పాటల్లో పాల్గొంటున్నారని తెలిపారు. క్రిటికల్ ఖనిజాల అన్వేషణ గతంలో తగిన ప్రాధాన్యం పొందలేదని, అయితే కేంద్ర ప్రభుత్వం ఈ రంగాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు ప్రారంభించిందని మంత్రి తెలిపారు. రానున్న సంవత్సరాల్లో ఈ రంగంలో అన్వేషణలు పెరిగి, బిడ్డర్ల భాగస్వామ్యం విస్తరించి, మరిన్ని అవకాశాలు ఏర్పడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

చైనా ఈ రంగంలో ప్రస్తుతం భారత్ కంటే ముందంజలో ఉన్నప్పటికీ, భారత్‌కు విస్తృత అవకాశాలు ఉన్నాయని, ఈ వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధిని మరింత బలోపేతం చేయవచ్చని మంత్రి వివేక్ స్పష్టం చేశారు.




## కల్వకుంట్ల కుటుంబం అంటేనే కుట్రల కుటుంబం

రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కల్వకుంట్ల కుటుంబం అంటేనే కుట్రల కుటుంబం అని టిపిసిసి నాయకులు మెట్టు సాయికుమార్ ఆరోపించారు. గాంధీభవన్‌లో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ బిఆర్‌ఎస్‌ను టిఆర్‌ఎస్‌గా మార్చినా ఒరిగేదేమీ లేదని, తెలంగాణ ప్రజలు ఇప్పటికే వాళ్లకు విఆర్‌ఎస్ ఇచ్చేశారని విమర్శించారు. గత పదేళ్లలో తెలంగాణ అమరులు, ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాలను బిఆర్‌ఎస్ ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని, కొంగ జపం చేస్తున్న కెటిఆర్ గత పదేళ్లలో ప్రజలతో పాటు సొంత పార్టీ నేతలను కూడా పట్టించుకోలేదని విమర్శించారు. పాదయాత్ర కాదు పొర్లు దండాల యాత్ర చేసినా కెటిఆర్‌ను ఎవరూ పట్టించుకోరని మెట్టు సాయికుమార్ వ్యాఖ్యానించారు.


### సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: చింతల్ సర్కిల్-54

NIT No. 02/DB/EE/Chintal-54/CMC/2026-27, తేది: 13.04.2026

**పని పేరు:** డిజిల్టింగ్ వర్క్స్ & కంప్యూటర్ సరఫరా (2 నెం.లు), **అంచనా విలువ :** రూ.35.60 లక్షలు, ప్రారంభ తేది & సమయం: 15.04.2026న మ.3.00గం.ల నుండి, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 18.04.2026న మ.3.00గం.ల వరకు, టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు మరియు మొబైల్ నెం. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం.9701414306, హెడ్ డ్రాఫ్ట్స్‌మెన్ సెల్ నెం. 8712034411. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చింతల్ సర్కిల్-54, సిఎంసి.

DIPR R.O. No. : 598-PP/CL/ADVT/2026-27, Date: 13-04-2026

### మంచిర్యాల నగరపాలక సంస్థ, జిల్లా: మంచిర్యాల

EOI No. E1/253/MMC/2026 **E.O.I** తేది: 13-04-2026

మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలోని వీధి కుక్కల స్టెరిలైజేషన్ కోసం ఎనిమల్ బర్త్ కంట్రోల్ రూల్స్ 2001 మరియు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసిజర్ ప్రకారం కుక్కల కోసం ఎనిమల్ బర్త్ కంట్రోల్ కార్యకలాపాల కొరకు N.G.O / ఎజెన్సీ ల నుండి కమీషనర్ మంచిర్యాల నగరపాలక సంస్థ ద్వారా సీల్డ్ కొటేషన్లు కోరబడుతున్నవి. **E.O.I షెడ్యూల్ దరఖాస్తు కోసం ఆఖరి తేది:** 17-04-2026 న పగలు 3.00గంటల వరకు, **E.O.I షెడ్యూల్ జారీ తేది:** 14-04-2026న పగలు 3.00 గంటల నుండి ఇవ్వబడును. షెడ్యూల్ దాఖలు కమిషనర్ నగరపాలక సంస్థ మంచిర్యాల గారి పేరున రూ. 2000.00లు డి.డి రూపేన సమర్పించవలెను. **అట్టి షెడ్యూల్ తేది:** 17.04.2026 రోజున సాయంత్రం 4.00గల తరువాత తెరవబడును.

తదుపరి వివరములకు కమిషనర్, మున్సిపల్ ఇంజనీర్, మంచిర్యాల నగరపాలక సంస్థ గారిని సంప్రదించు ఫోన్ నెం. 9849905886, 9849906721, 9505550340.

సం/- కమిషనర్, మంచిర్యాల నగరపాలక సంస్థ.

DIPR R.O. No. : 619-PP/CL/ADVT/2026-27, Date: 13-04-2026

### మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, ఘట్‌కేసర్ సర్కిల్-06, ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ ఎదురుగా - 501301

ఇ-మెయిల్: ee.2.ghatkesar@gmail.com

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు**

ఎంఎంసి, ఉప్పల్ జోన్, ఘట్‌కేసర్ సర్కిల్-06లో టెండర్ నోటీస్ నెం. 12/EE/Ghatkesar Circle-06/MMC/Tenders/2025-26, తేది: 10.04.2026 నందు 04 పనుల కోసం ప్రచురణ. పూర్తి వివరాలకు https://tender.telangana.gov.in/login.htmlలో లాగ్‌ఇన్ అయి చూడవచ్చు. ఈవెంట్ల వివరాలు క్రింద వివరించబడ్డాయి:

| ఈవెంట్స్ | 4 పనులు మాత్రమే |
|---|---|
| ప్రారంభ తేది | 13.04.2026న సా.4.00గం.ల నుండి, |
| డౌన్‌లోడ్ ఆఖరి తేది | 15.04.2026న సా.4.00గం.ల వరకు, |
| బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | 15.04.2026న సా.4.00గం.ల వరకు, |
| ప్రైస్ బిడ్ ప్రారంభం | 15.04.2026న సా.4.30గం.లకు. |

**సంప్రదించవలసిన అధికారి చిరునామా:** శ్రీ కె.రమేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఘట్‌కేసర్ సర్కిల్-06, ఎంఎంసి, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://tender.telangana.gov.in/login.htmlలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఘట్‌కేసర్ సర్కిల్-06, ఎంఎంసి.

DIPR R.O. No. : 621-PP/CL/ADVT/2026-27, Date: 13-04-2026

లోక్‌సభ సీట్ల పెంపు విషయంపై

## అఖిలపక్ష భేటీలో చర్చించి నిర్ణయం తీసుకోవాలి

సిఎం రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చే మహిళా బిల్లుకు ప్రతి ఒక్కరు మద్దతిస్తారని, కానీ లోక్‌సభ సీట్ల పెంపు విషయంలోనే భిన్నాభిప్రాయాలు ఉన్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం దామాషా పద్ధతి కాకుండా మరో విధానాన్ని అనుసరించాలని కోరారు. అన్ని పార్టీల ఏకాభిప్రాయంతో ఈ అంశంపై ముందుకు వెళ్లాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. జనాభా ఆధారంగా లోక్ సభ సీట్లను పెంచాలని బిజెపి ప్రభుత్వం చూస్తోందని సిఎం విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ సిఎం రేవంత్ రెడ్డి సోమవారం ట్వీట్ చేశారు. లోక్‌సభ సీట్ల పెంపు విషయంపై అఖిలపక్ష భేటీలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు. లోక్ సభ సీట్ల పెంపు, మహిళా రిజర్వేన్లు వేర్వేరనేది ప్రతి పౌరుడికి తెలుసని అన్నారు. అసెంబ్లీ సీట్లలో మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే దేశం మొత్తం ఆమోదిస్తుందని అన్నారు. మహిళా రిజర్వేషన్ల పేరుతో జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్లు పెంచాలని బిజెపి చూస్తోందని ఆరోపించారు. దక్షిణాది, చిన్న రాష్ట్రాలకు ఈ విధానం అన్యాయం చేస్తోందని రేవంత్ రెడ్డి అన్నారు. భవిష్యత్తులో దేశాన్ని బలహీనం చేస్తోందని సిఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఏ పార్టీకైనా జాతీయ ప్రయోజనాలే ముఖ్యంగా ఉండాలన్నారు.

## వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్లను అక్రమంగా అమ్మినా కొన్నా కఠిన చర్యలు

స్టీఫెన్ రవీంద్ర

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్లను అక్రమంగా అనధికారిక మార్గాల ద్వారా అమ్మినా, కొనుగోలు చేసినట్లు తేలినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని పౌర సరఫరాల కమిషనర్ ఎం.స్టీఫెన్ రవీంద్ర హెచ్చరించారు. వాణిజ్య ఎల్‌పిజి సరఫరా, పంపిణీకి సంబంధించి హైదరాబాద్‌లోని పౌర సరఫరాల భవన్‌లో సమీక్షా సమావేశం జరిగింది.కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అధ్యక్షతన ఈసమావేశంలో పరిశ్రమల డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసిలు), హోటల్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సందర్భంగా, డిపోల నుండి వాణిజ్య ఎల్‌పిజి మొత్తం సరఫరా పంపిణీ పెరిగినప్పటికీ, కొన్ని రంగాలలో డెలివరీలో మాత్రం జాప్యం జరుగుతోందని ఇందుకు అక్రమ నిల్వలు, సరఫరాలే కారణమన్న అనుమానాన్ని అధికారులు వ్యక్తం చేశారు. ప్రస్తుత మార్కెట్ డిమాండ్లను తీర్చడానికి 70 శాతం వాణిజ్య ఎల్‌పిజి సరఫరా ఉందని దీనిని సమానంగా పంపిణీ చేయడానికి, ఈ సమీక్షలో ఇండస్ట్రియల్ ఫ్యాబ్రికేషన్, ఫౌండ్రీలతో సహా మొత్తం పారిశ్రామిక రంగాన్ని పరిగణనలోకి తీసుకున్నామని స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. ఓఎంసిలు తమ గత డేటా, సగటు అమ్మకాల రికార్డుల ఆధారంగా వ్యక్తిగత హోటళ్లు, పారిశ్రామిక యూనిట్లకు సరఫరా కొనసాగిస్తున్నాయని వెల్లడించారు. కృత్రిమ కొరతను అరికట్టడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఉద్దేశపూర్వకంగా డెలివరీ ఆలస్యం చేసినా,నిర్ణీత ధర కంటే ఎక్కువ వసూలు చేస్తున్నట్లు తేలినా పంపిణీదారుల లైసెన్సులను తక్షణమే రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామనిహెచ్చరించారు. హోటల్ యాజమాన్యం, పారిశ్రామిక ప్రతినిధులు, పంపిణీదారుల నెట్‌వర్క్‌లతో సహా సంబంధిత వర్గాలన్నీ పూర్తి సహకారం అందించాలని కమిషనర్ కోరారు.




# కూల్చివేతలు ఆపండి



### హైడ్రాకు హైకోర్టు ఉత్తర్వులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అక్రమ నిర్మాణాలు, అనుమతి లేని నిర్మాణాల కూల్చివేతలకు అమలు చేసే విధివిధానాలు ఏమిటో చెప్పే వరకు కూల్చివేత చర్యలు తీసుకోరాదని హైడ్రాకు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. ఏ చట్ట ప్రకారం కూల్చివేస్తున్నారో, కూల్చివేతలకు అమలు చేసే విధివిధానాలు ఏమిటో, అనుసరించే మార్గదర్శకాలు ఏమిటో తెలియజేసే వరకు కూల్చివేతలు ఆపాలని ఆదేశించింది. ప్రజావసరాలైన చెరువులు, కుంటలు, ఇతర నీటివనరులు, నాలాలు, పార్కులు, రోడ్లు వంటివి ఆక్రమణలకు గురైతే వాటి విషయంలో ముందుకు వెళ్లవచ్చునని స్పష్టం చేసింది. నోటీసు ఇవ్వకుండా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన రైతు ఎం.ఎ.షరీఫ్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారించిన ఈ ఉత్తర్వులను జారీ చేశారు. పది దశాబ్ధాలనాటి ఆస్తిలో నిర్మాణమైన నీటి ట్యాంక్, కాంపౌండ్ వాల్ వంటివి హైడ్రా స్టాఫ్ తెల్లవారు జామున కూల్చేశారని లాయర్ చెప్పారు. సర్వే నెం.165 నుంచి 175, 212, 213లోని 36.37 ఎకరాల విషయంలో హైకోర్టు ఆర్డర్‌ను అడ్డంపెట్టుకుని మిగిలిన వెయ్యి ఎకరాలను కబ్జా చేసిన వాళ్లు కూడా అక్రమ నిర్మాణాలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని ప్రభుత్వ న్యాయవాదులు చెప్పారు. దీనిపై హైకోర్టు.. పిటిషనర్లు సమర్పించిన వీడియోను పరిశీలించి హైడ్రా తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. జిహెచ్‌ఎంసి, మున్సిపాలిటీల చట్టం లేదంటే ఏ ఇతర చట్టాల కింద హైడ్రా విధులకు సంబంధించి ప్రామాణిక కార్యాచరణ విధనాలు లేదా మార్గదర్శకాలను కోర్టుకు నివేదించే వరకు కూల్చివేతలు చేయరాదని హైడ్రాను ఆదేశించింది. అంతర్గత రహదారులు, ప్రహరీ గోడల తొలగింపు వంటివి బలవంతపు చర్యలు చేపట్టరాదని కూడా ఆదేశించింది. సుప్రీం కోర్టుతో సహా ఇదే హైకోర్టు ఇచ్చిన పలు తీర్పుల్లో అక్రమ నిర్మాణాల తొలగింపుపై మార్గదర్శకాలను అమలు చేయాలన్న ఉత్తర్వులను అమలు చేయలేదని తప్పుపట్టింది. జిహెచ్‌ఎంసి చట్టంలోని సెక్షన్ 374బి కింద హైడ్రాకు అధికారం దఖలైందని, అయితే హై డ్రా చేపట్టే చర్యలకు సరైన ప్రామాణిక విధానం ఏమిటో వందకుపై గా ఉన్న కేసుల్లో హైడ్రా హైకోర్టుకు చెప్పలేదని తేల్చింది. అందుకే ఆ విధానాలు చెప్పే వరకు కూల్చివేతలకు పాల్పడరాదని ఆదేశించింది. ఐలాపూర్ భూములకు సంబంధించి యథాతథస్థితి కొనసాగించాలని ముధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను వాయిదా వేశారు.

### హైడ్రాపై ఆగ్రహం

సూరారం గ్రామం సిద్ధివినాయక నగర్‌లోని సర్వే నంబర్ 105 పరిధిలో ఉన్న భూమి వివాదంపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ముందస్తు నోటీసులు జారీ చేయకుండా పిటిషనర్ల భూమిలోకి ప్రవేశించి పబ్లిక్ నోటీస్ బోర్డు ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. భూమి చుట్టూ ఫెన్సింగ్ వేయడం వంటి చర్యలు తీసుకోవడాన్ని ఆక్షేపించింది. ఈ విషయాలను సీరియస్‌గా పరిగణిస్తున్నట్లు ప్రకటించింది. హైడ్రా అధికారులు ఈనెల 6న ముందుగా నోటీసు ఇవ్వకపోగా కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా స్థలాల వద్దకు వచ్చి ఫెన్సింగ్, బోర్డులను ఏర్పాటు చేశారని, కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి చట్టపరమైన ప్రక్రియలను ఉల్లంఘించారని పిటిషనర్ న్యాయవాది హైకోర్టు దృష్టికి తెచ్చారు. దీనిపై హైడ్రా న్యాయవాది స్పందిస్తూ, ఈ లేఅవుట్ 1978లో ఏర్పాటైందని, మొత్తం 102 ప్లాట్లు మాత్రమే ఉన్నాయన్నారు. రెండు స్థలాలు పార్కు, ప్రజావసరాలకు చెందినవి ఉన్నాయన్నారు. పిటిషనర్లు రెగ్యులరైజేషన్‌కు దరఖాస్తు చేసుకున్నప్పటికీ, ఆ భూమి పార్కు కోసం నిర్ధేశించినది కాబట్టి దరఖాస్తును పరిగణనలోకి తీసుకోలేదన్నారు. రక్షణ చర్యగా ఫెన్సింగ్ చేసినట్లు వివరణ ఇచ్చారు. ఈ వాదనలపై స్పందించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి శ్రవణ్ కుమార్.. ఈ భూమిపై ఇప్పటికే కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తించారు. గత ఏడాది ఫిబ్రవరి 7న హైకోర్టు యథాతథస్థితి ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో కోర్టు అనుమతి లేకుండా హైడ్రా బోర్డు ఏర్పాటు చేసి భూమి పార్కుదని ఎలా ప్రకటిస్తుందని ప్రశ్నించారు. హైడ్రా చర్య కచ్చితంగా కోర్టు ఉత్తర్వులకు విరుద్ధమన్నారు. అందువల్ల వివాదాస్పద స్థలంలో ఏర్పాటు చేసిన నోటీస్ బోర్డును 48 గంటల్లో తొలగించాలని ఆదేశించారు. ఇప్పటికే వేసిన ఫెన్సింగ్ కొనసాగించవచ్చని చెప్పారు. ఇరుపక్షాలు ప్రస్తుత పరిస్థితిని యథాతథంగా కొనసాగించాలని ఆదేశించారు. తదుపరి విచారణను జూన్ 10కి వా యిదా వేశారు. అప్పటిలోగా ప్రతివాదులైన హైడ్రా ఇతరులు తమ వాదనలతో కౌంటర్లు దాఖలు చేయాలని నోటీసులు జారీ చేశారు.



### కోర్టు అంటే లెక్కలేదా?

కోర్టు వివాదాల్లో ఉన్న స్థలాల్లో ఇది ప్రభుత్వ స్థలమంటూ హైడ్రా కంచె వేసిందంటూ దాఖలైన మరో పిటిషన్‌ను జస్టిస్ ఎన్.వి శ్రవణ్ కుమార్ సోమవారం విచారించారు. ఇదే హైకోర్టు గతంలో ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించి హైడ్రా బోర్డు పెట్టి, ఫెన్సింగ్ వేయడాన్ని తప్పుపట్టారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి చర్యలు తీసుకోవడమంటే హైడ్రా కోర్టు కంటే ఎక్కువని భావిస్తోందా లేక ప్రభుత్వానికి సమాంతర పాలన సాగిస్తున్నట్లు భావించాలా అని ప్రశ్నించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని సూరారం గ్రామంలో తమ ఆస్తిని హైడ్రా స్వాధీనం చేసుకోవడాన్ని సవాలు చేస్తూ జితేంద్ర అనే వ్యక్తి దాఖలు చేసిన వ్యాజ్యాన్ని విచారించారు. సర్వే నెం 105లోని రెండు ప్లాట్లను స్వాధీనం చేసుకుని కంచె వేశారని పిటిషనర్ వాదన. దీనిపై న్యాయమూర్తి.. రాగల48 గంటల్లో బోర్డును తొలగించాలని హైడ్రా ను ఆదేశించారు. కంచెను కొనసాగించవచ్చని స్పష్టం చేశారు. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు యధాతథస్థితిని కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. కౌంటర్లు దాఖలు చేయాలని హైడ్రాను ఆదేశించారు. విచారణను జూన్ 10కి వాయిదా వేశారు.

## మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌కు శాశ్వత భవనం

- రూ.98 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు
- ఉప్పల్ భగయత్‌లో ఎంఎంసికి ఇక శాశ్వత కార్యాలయం
- ప్రస్తుతం హెచ్ఎండిఏ పాత కార్యాలయంలో కార్యకలాపాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) సొంత భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉప్పల్ భగయత్ లేఅవుట్ ఫేజ్IIIలో శాశ్వత కార్యాలయ భవన నిర్మాణానికి రూ.98 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ జిఓ 417 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ పేరుతో ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆర్థిక శాఖ ఆమోదం పొందిన తర్వాతే ఈ నిధులను మంజూరు చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఉప్పల్ భగాయత్ లేఅవుట్ ఫేజ్IIIలోని సర్వే నెంబర్లు 264, 265, 266, 267, 268, 269, 276, 278, 279, 280 ప్రాంతాల్లో సుమారు 10 ఎకరాల భూమిపై ఈ భవనం నిర్మించనున్నారు. ఈ భూమిని హెచ్ఎండిఏ ద్వారా కేటాయించగా, నిర్మాణానికి సంబంధించిన ప్రాథమిక అంచనాలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. ఇటీవల మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్.బి. నగర్ జోన్‌లను కలిపి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌గా పునర్వ్యవస్థీకరించిన నేపథ్యంలో, శాశ్వత కార్యాలయ భవనం అవసరం ఏర్పడింది.ప్రస్తుతం తాత్కాలికంగా తర్నాకలోని హెచ్ఎండిఏ పాత కార్యాలయంలో కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. కమిషనర్ ప్రతిపాదన మేరకు ప్రభుత్వం విషయాన్ని పరిశీలించి, 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఈ నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. ఖర్చు మొత్తం ఎంఎంసి నిధుల నుంచే భరించనుంది. ఇకపై నిర్మాణానికి సంబంధించిన తదుపరి చర్యలు చేపట్టాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## ఆట-పాటలతో మహనీయులకు నివాళి గొప్ప స్ఫూర్తి : పల్లె నరసింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కళాకారుల ఆటపాటల ద్వారా మహనీయులకు నివాళి అర్పించడం గొప్ప స్ఫూర్తినిస్తుందని తెలంగాణ రాష్ట్ర బాషా, సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యులు పల్లె నరసింహ అన్నారు. తెలంగాణ రాష్ట్ర బాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హైదరాబాద్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్ లో సోమవారం పల్లె నరసింహ నేతృత్వంలో జ్యోతిబా పూలే, డాక్టర్ బి.ఆర్. అంబెద్కర్, జగ్జీవన్ రామ్ వంటి మహనీయుల జయంతోత్సవాల సందర్భంగా 'ఆట పాటలతో మహనీయులకు నివాళి' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 80 మంది కళాకారులూ పాల్గొని తమ ఆట, పాటలతో చైతన్యం నింపారు. ఈ సందర్భంగా పల్లె నరసింహ మాట్లాడుతూ వివక్ష, అసమానతలకు వ్యతరేకంగా, అణగారిన ప్రజల హక్కులను కోసం తమ జీవితాలను త్యాగం చేసిన గొప్ప మహనీయులు జ్యోతి రావు పూలే, అంబెద్కర్, జగ్ జీవన్ రామ్ లు అని కొనియాడారు. వారిని స్మరించుకుంటూ ఆట పాటలతో ప్రజల్లో చైతన్యాన్ని రగిలించడానికి ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులూ డి.వేణుగోపాల చారి, ఎమ్ రాము, వి.అడిమయ్యా, సిహెచ్‌శేఖర్, డి.భాస్కర్, ఎస్ పోచయ్య, ఎం.భాస్కర్, ఎం.మహేష్,జోసబ్ భాను,జి. శైలజ, ఎ. మంగమ్మ, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



## తట్టేపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- స్కూటిని ఢీ కొట్టిన లారీ : ముగ్గురు మృతి
- సురక్షితంగా బయటపడిన కుమారుడు
- గోతిలో పడి మృతి చెందిన కానిస్టేబుల్

**ప్రజాపక్షం/తాండూరు :** తాండూరు సబ్ డివిజన్ పరిధిలో జరిగిన వేరు వేరు రోడ్డు ప్రమాదాలలో నలుగురు వ్యక్తులు మృత్యువాత పడ్డారు.పెద్దేముల్ మండల పరిధి తట్టేపల్లి సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గరు వ్యక్తులు అక్కడిక్కక్కడే మృతి చెందారు. విధులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఓ కానిస్టేబుల్ రోడ్డుపై దొవ్వి గోతిలో పడి మృతి చెందాడు. తాండూరు సబ్ డివిజన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దేముల్ మండల పరిధి రుక్మాపూర్ గ్రామానికి చెందిన ఓ కుటుంబం తమ స్కూటిపై సోమవారం తెల్లవారు జామున జహిరాబాద్‌కు వెళ్తున్నారు. సిద్దన్నమడగు తాండా దాటి తట్టేపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న ఇసుక లారీ స్కూటిని ఢీ కొట్టింది. ఈ ఘనటలో కవిరాజ్(40), భార్య పావని (29), కూతురు కీర్తన(11)లు అక్కడికక్కడే మృతి చెందారు. వారి కుమారుడు కార్తీక్ స్వల్ప గాయాలతో బతికి బయటపడ్డారు. తల్లి శవం వద్ద కార్తిక్ రోదిస్తున్న దృశ్యం పలువురిని కంటతడిపెట్టించింది. విషయం తెలుసుకున్న పెద్దేముల్ ఎస్ఐ ప్రశాంత్ వర్దన్ ఘటన స్థలానికి చేరుకుని గాయాల పాలైన కార్తీక్‌ను మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. మృతుల శవాలను శపరిక్ష నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసునమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరో రోడ్డు ప్రమాదం ఘటనలో నీటి గుంతలో పడి కానిస్టేబుల్ మృతి చెందాడు. వికారాబాద్ జిల్లా యలాల మండల పరిధి లక్ష్మి నారాయణపూర్ వద్ద ఈ విషాదం నెలకొంది. తాండూరు భద్రేశ్వర జాతర ఉత్సవాలకు భందోబస్తుకు విధులు ముగించుకుని తన బైక్‌పై స్వగ్రామమైన రెడ్డిగణపూర్‌కు తిరిగి వెళ్తున్న సమయంలో కానిస్టేబుల్ నర్సిములు(30) ప్రమాద వశాత్తు రోడ్డు పక్కన బ్రిడ్జి నిర్మాణంలో ఉన్న నీటి గుంతలో పడి మృతి చెందాడు. నర్సిములు ప్రభుత్వ చీప్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి సెక్యూరిటి సిబ్బందిగా పనిచేస్తున్నాట్లు తెలిసింది. చీకటిగా ఉండడంతో గుంతను గమనించ లేక ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఈ ఘటనపై ప్రభుత్వ చీప్ విఫ్ పట్న మహేందర్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు.

## బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాను నిషేధించాలి : కాంగ్రెస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్న బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాను తక్షణమే నిషేధించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. గాంధీ భవన్‌లో సోమవారం టిపిసిసి ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఇందిరా శోభన్, చరణ్ కౌశిక్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా చనగాని దయాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకమైన 'పోషణ్ అభియాన్' కింద మొత్తం 38,130 మొబైల్ ఫోన్ల కొనుగోలుకు నవంబర్ 2025లో ప్రభుత్వ పోర్టల్ జిఇఎం (గవర్నమెంట్ ఇ మార్కెట్ ప్లేస్) ద్వారా ఐదుగురు నిపుణుల సమక్షంలో గ్లోబల్ టెండర్ నిర్వహించారన్నారు. కేంద్ర కేంద్రం నిర్ధేశించిన ధర రూ.11,800 కాగా, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కేవలం రూ.11,650 లకే ఫోన్లను కొనుగోలు చేసిందని పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాల నుండి వచ్చి ఎంఎల్‌ఎగా, మంత్రిగా నిబద్ధతతో వ్యవరిస్తున్న ధనసరి అనసూయ సీతక్కపై తప్పుడు కథనాలతో దిగజారుడు ప్రచారాలు మానుకోవాలనిహెచ్చరించారు. ఇందిరా శోభన్ మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకుడు క్రిశాంక్ మంత్రి సీతక్క కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి సీతక్కపై అబద్ధాలు మాట్లాడినా, ప్రచారం చేసినా సహించబోమని హెచ్చరించారు.

## రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమంగా 'అరైవ్ అలైవ్'

రోడ్డు భద్రత కార్యక్రమాలో పాల్గొంటున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా అరికట్టి, ప్రాణనష్టాన్ని నివారించడమే లక్ష్యంగా 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 'అరైవ్ అలైవ్' కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.హైదరాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేయగా, ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి పలు కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొని రోడ్డు భద్రత ఆవశ్యకతను తెలియజేశారు.ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించిన డిజిపి బి. శివధర్ రెడ్డి ఎఆర్ హెడ్ క్వార్టర్స్‌లో బాలికల ఆత్మస్థైర్యం కోసం 'ఆపరేషన్ జ్వాలా' ముగింపు వేడుకలు, ఖాకీ కిడ్స్ బ్యాచ్‌ల పంపిణీ, విద్యార్థుల కోసం రాష్ట్రంలోనే తొలి ట్రాఫిక్ పార్కును ప్రారంభించారు. మైనర్ డ్రైవింగ్ చేస్తున్న 400 మంది పిల్లలు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ కార్యక్రమంలో పాల్గొన్న డిజిపి, 'అభయ మై టాక్సీ 2.0' ద్వారా 5000 ఆటోలకు క్యూఆర్ కోడ్ బీమా సౌకర్యం కల్పించే ప్రక్రియను ప్రారంభించారు. డ్రైవర్లకు కంటి పరీక్షలు చేయించి అద్దాలు పంపిణీ చేశారు. చించుఘాట్ గ్రామంలో ఆదివాసీలతో కలిసి సామూహిక భోజనం చేసి, పోటీ పరీక్షల లైబ్రరీని ప్రారంభించారు. అదేవిధంగా, ఆదిలాబాద్ జిల్లాలోని గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ఎస్ కన్వెన్షన్ హాల్‌లో జిల్లా వ్యాప్తంగా గల సర్పంచులు, సుమారు 500 మంది రోడ్ సేఫ్టీ క్లబ్ సభ్యులతో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్థానిక ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా ప్రజలు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. మెదక్ జిల్లా నంద గోకుల్‌లో 'నో హెల్మెట్‌నో ఎంట్రీ' నిబంధన విధిస్తూ రూ. 500 జరిమానా నిర్ణయించగా, నిజామాబాద్‌లో హెల్మెట్ ధరించే వారికి ఉచితంగా ఐపిఎల్ మ్యాచ్ చూసే అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఐ జి పి గజరావ్ భూపాల్, కలెక్టర్లు రాజర్షి షా, నితిక పంత్, స్నేహ మెహ్రా, సత్య ప్రసాద్, గరిమ అగ్రవాల్ తదితరులు పాల్గొన్నారు హైదరాబాదులో జరిగిన మరో కార్యక్రమంలో ట్రాఫిక్ అడిషనల్ సిపి జోయల్ డేవిస్, డిసిపి చంద్రమోహన్‌లు పాల్గొన్నగా భువనగిరిలో జరిగిన అర్రైవ్ అలైవ్ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, శాంతి భద్రతల అదనపు డిజిపి మహేశ్ భగవత్, జిల్లా ఎస్పి ఆకాంక్ష యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## హంగరీలో ట్రంప్ మిత్రుడి పరాజయం


మాగ్యార్ చారిత్రక విజయం
యూరప్ దేశాల నాయకుల సెలబ్రేషన్స్



**బుడాపెస్ట్:** యూరప్‌దేశం హంగరీలో ప్రతిష్టాత్మకంగా జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ట్రంప్ మిత్రుడు విక్టర్ ఓర్బాన్ (62) పరాజయం పాలయ్యారు. ప్రతిపక్ష టిస్జా పార్టీ నాయకుడు పీటర్ మాగ్యార్ (45) చారిత్రక విజయం సాధించారు. హంగరీ దేశానికి ప్రత్యామ్నాయంగా ఉన్న 'మాగ్యార్' ఆదివాసీ పురాతన జాతికి పీటర్ మాగ్యార్ ప్రతినిధి. అత్యున్నత చట్టసభలో 199 స్థానాలకుగాను తుదిఫలితాల నాటికి భారీగా 138 స్థానాలు గెలిచే అవకాశాలున్నాయి. మూడింట రెండు వంతుల మెజార్టీ పొందారు. ఈ విజయంతో హంగరీని విముక్తం చేస్తామని, ప్రజాస్వామ్యం దిశగా అడుగులు వేస్తామని, యూరోపియన్ విలువలను, యూరోపియన్ యూనియన్‌తో సంబంధాలను పునరుద్ధరిస్తామన్నారు. యూరోపియన్ దేశంగా ఉండాలని హంగరీ ప్రజలు కోరుకుంటునారన్నారు. అందరూ ముందుగా ఊహించిన విధంగానే ఓర్బాన్ ఓడిపోవడంతో గడచిన 16 సంవత్సరాలుగా హక్కులు అణచివేసిన నియంత పాలనకు తెరపడింది.ఈ ఫలితాలుచూసి ఆయన కుంగిపోయారు. ఐనప్పటికీ ప్రజల తీర్పు స్పష్టంగా ఉందని పేర్కొంటూ ఓటమిని అంగీకరించారు. ప్రతిపక్షంలో ఉండి ప్రజలకు సేవ చేస్తానని అన్నారు. మాగ్యార్‌ను అభినందించారు. మాగ్యార్ విజయంతో యూరప్ అంతటా దేశాల నాయలు సెలబ్రేషన్స్ చేసుకున్నారు. ఓర్బాన్ విజయం కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ కూడా ప్రచారంలో పాల్గొన్నారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో 74.2 శాతం ప్రజలు భారీగా పోలింగ్‌లో పాల్గొన్నారు. 2022 లో జరిగిన ఎన్నికల్లో 62.9 శాతం ప్రజలు మాత్రమే పోలింగ్‌లో పాల్గొన్నారు. గడచిన మూడు సంవత్సరాలుగా ఓర్బాన్ పరిపాలనలో దేశంలో ఆర్థిక వ్యవస్థ స్తంభించింది.ప్రజల జీవన వ్యయాలు అనూహ్యంగా పెరిగిపోవడంతో దేశంలో అసంతృప్తి పెరిగింది. అమెరికా ప్రతిపక్ష డెమోక్రాట్లు కేరింతలు కొట్టారు.పలు యూరప్ దేశాల నాయకులు మాగ్యార్‌కు అభినందనలు తెలియజేశారు. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, మాగ్యార్‌తో కలిసి సన్నిహితంగా పనిచేస్తామని అన్నారు. ఇన్నాళ్ళుగా ఉన్న ఆటంకాలన్నీ తొలగిపోవడంతో ఆయనతో కొత్త ఉత్సాహం తొంగి చూసింది. ఓర్బాన్ అధికారంలో ఉన్నంతకాలం ఉక్రేన్‌కు యుద్ధ నిధులు అందకుండా అడ్డుకున్నారు. హంగరీ యూరప్‌లో చేరడంవల్ల ఉక్రేన్‌లో జరుగుతున్న యుద్ధ పరిణామాల్లో మార్పులు సంభవించే అవకాశాలు ఉంటాయని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం చైనా పర్యటనలో ఉన్న స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో శాంఛెజ్ కూడా ఎక్స్ వేదికగా మాగ్యార్‌కు అభినందనలు తెలియజేస్తూ, యూరోపియన్ విలువలతో ఆయన ఎంతో గొప్ప విజయం సాధించారని ప్రశంసించారు. బ్రిటన్ ప్రధానమంత్రి కీవ్ స్టార్మర్‌తో పాటు ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్, నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రట్టే, జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్, యూరోపియన్ యూనియన్ కమిషన్ ఛైర్మన్ ఉర్సులా వోండర్‌లేయన్, ఐరిష్ ప్రధానమంత్రి మైఖేల్ మార్టిన్, స్వీడన్ ప్రధానమంత్రి ఉల్ఫ్ క్రిస్టెర్సన్, యూరోపియన్ యూనియన్ పార్లమెంటు స్పీకర్ రోబెర్ట్ మెట్సోలా, డెనిష్ ప్రధానమంత్రి మెట్టే ఫ్రెడరిక్‌సన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షులు ఆంటోనియో కోస్టా, ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీ, పోలెండ్ ప్రధానమంత్రి డోనాల్డ్ టస్క్, ఇతర యూరప్ నాయకులు అభినందనలు తెలియజేశారు.యూరప్‌కు ఇది అద్భుతమైన విజయమని పేర్కొన్నారు.

## ఇరాన్‌లో యుద్ధంపై ట్రంప్ వెర్సస్ పోప్

అణ్వాయుధాన్ని సమర్థించే పోప్ నాకొద్దు
రిపబ్లికన్ పాలకులకు భయపడను



**వాషింగ్టన్:** ఇరాన్‌లో యుద్ధం విరమించాలని పదే పదే కోరుతూ పరోక్ష విమర్శలు గుప్పిస్తున్న పోప్ లియో–14పై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అసాధారణ స్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం రాత్రి పొద్దుపోయాక ట్రూత్ సోషల్ ద్వారా పోప్‌లియోపై ఆయన విమర్శలు గుప్పించారు. అమెరికా అధ్యక్షుణ్ణి విమర్శించే పోప్ నాకు వద్దు అన్నారు.ఆయన ఉదారవాది, నేరాలు ఆపాలని నమ్మే వ్యక్తి కాదు, ఇరాన్ దగ్గర అణ్వాయుధం ఉంటే 'ఓకే'' అని సర్దుకుపోయే పోప్ నాకు వద్దు అని విమర్శించారు. దీనిపై పోప్ వెంటనే స్పందిస్తూ, రిపబ్లికన్ పాలకులకు తాను భయపడనని, ప్రపంచ శాంతికోసం తాను విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. నాలుగు ఆఫ్రికా దేశాలలో 11 పర్యటనలో భాగంగా మొదటివిడత అల్జీర్స్‌కు వెళుతున్న సమయంలో విమానంలో పోప్ లియో మీడియాతో మాట్లాడారు. ''నేను (అతడితో)చర్చకు దిగాలనుకోవడంలేదు, నేను పేర్కొన్న దాడుల విషయం ఎవ్వరినీ ఉద్దేశించింది కాదు, ఈ రోజు ప్రపంచంలో ఎంతోమంది బాధలు పడుతున్నారు, ఎంతోమంది మృత్యువాత పడుతున్నారు, ఈ సమస్య పరిష్కారానికి ప్రపంచ దేశాలు స్పందించాలి, నా సందేశం చాలా స్పష్టంగా ఉంది, శాంతి దూతలకు నా ఆశీర్వాదాలు ఉంటాయి'' అన్నారు. ఇంతకు ముందు ఈస్టర్ సందేశం సందర్భంగా పోప్ లియో ఇరాన్‌లో యుద్ధ దాడులను తీవ్రంగా ఖండించారు. అధికారం,శక్తిసామర్థ్యాలు ఉన్నవారు యుద్ధానికి బదులుగా శాంతిని ఎంచుకోవాలని ట్రంప్‌పై పరోక్షంగా విమర్శలు చేశారు. దీనిపై ట్రంప్ స్పందించారు.

పోప్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన మొట్టమొదటి అమెరికన్ జాతీయుడు పోప్ లియో–14 పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుండీ యుద్ధ వ్యతిరేక ప్రకటనలు చేస్తూ శాంతిని కోరుతున్నారు. ''ఆయనకు నేనేమీ పెద్ద అభిమానిని కాదు, ఆయన విదేశీ విధానం తెలియదు, నేరాలపై అవగాహన లేదు, ఈ రెండు విషయాలలో ఆయన బలహీనుడు,కేవలం అమెరికన్ కావడంవల్లనే ఆయన పోప్ అయ్యారు, నేను వైట్‌హౌస్‌లో లేకపోతే ఆయన వాటికన్ సిటీలో ఉండేవారే కాదు'' అని ట్రంప్ విమర్శించారు. ఆ తర్వాత ట్రంప్ తనను తాను ఏసుక్రీస్తుగా చిత్రీకరించుకునే ఫోటోలను విడుదల చేశారు. ఎరుపు తెలుపు వస్త్రాలు ధరించిన ట్రంప్ ఒక వ్యక్తికి స్వస్థత చేకూర్చే చేతికర్రతో భుజాన అమెరికా జెండాతో ఈ చిత్రంలో కనిపించారు. దీంతో క్యాథలిక్ అధిపతి ఆయనను ఖండించారు. ప్రపంచ నాయకులు పశ్చిమాసియాలో యుద్ధ నివారణకు కృషి చేయాలని పోప్‌లియో పిలుపు ఇచ్చారు. ట్రంప్ వివిధ దశల్లో ఇరాన్‌కు వ్యతిరేకంగా చేసిన తీవ్ర హెచ్చరికల సమయంలో వాటిని పోప్ విమర్శించారు. ఇరాన్ నాగరికతను సంపూర్ణంగా తుడిచిపెట్టి ఆ దేశాన్ని రాతియుగంలోకి నెట్టేస్తామని ట్రంప్ చేసిన విమర్శలను పోప్ తీవ్రంగా ఖండించారు. ఇది ప్రపంచానికి అస్సలు ఆమోదయోగ్యం కాదని అన్నారు.

# ఎన్‌కౌంటర్‌లో మహిళా మావోయిస్టు మృతి

### మృతురాలిపై రూ. 5 లక్షల రివార్డు



**కాంకేర్ :** ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్ జరిగింది. కాంకేర్ జిల్లాలో సోమవారం భద్రతా సిబ్బందితో జరిగిన ఎదురు కాల్పుల్లో రూ. 5 లక్షల రివార్డు ఉన్న ఒక మహిళా మావోయిస్టు మరణించినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలిని రూ పిగా గుర్తించారు. ఆమె మావోయిస్టుల ఏరియా కమి టీ సభ్యురాలని, కాంకేర్‌తో సహా ఏడు జిల్లాలు ఉన్న ఛత్తీస్‌గఢ్ బస్తర్ ప్రాంతంలో చురుకుగా ఉన్న చివరి సీనియర్ తెలుగు కేడర్ ఆమెనే అని భావిస్తున్నట్లు వారు తెలిపారు. మార్చి 31న ఛత్తీస్‌గఢ్‌ను సాయుధ మావోయిస్టులు లేని రాష్ట్రంగా ప్రభుత్వం ప్రకటించిన 12 రోజుల తర్వాత ఈ ఘర్షణ జరిగింది. లొంగిపోయి పునరావాస ప్రయోజనాలను పొందాలని మావోయిస్టులకు ప్రభుత్వం నిరంతరం విజ్ఞప్తి చేస్తోందని, దీని ఫలితంగా ఇటీవలి నెలల్లో గణనీయ సంఖ్యలో మావోయిస్టులు తిరిగి ప్రధాన స్రవంతిలోకి వస్తున్నారని బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, సుందర్‌రాజ్ తెలిపారు. అయినప్పటికీ, రూపితో సహా కొందరు కేడర్లు హింసా మార్గంలోనే కొనసాగారని, ఇది చివరికి ఇలాంటి పరిణామాలకు దారితీసిందని ఆయన పేర్కొన్నారు. ఛోటేబెతియా–పార్తాపూర్ పోలీస్ స్టేషన్ల సరిహద్దులోని మచ్చపల్లి గ్రామానికి సమీపంలో ఉన్న అడవిలో, కేడర్ల ఉనికి గురించి అందిన నిర్దిష్ట నిఘా సమాచారం ఆధారంగా భద్రతా సిబ్బంది బృందం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ చేపట్టినప్పుడు, ఉదయం కాల్పులు జరిగాయని కాంకేర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నిఖిల్ రాఖేచా తెలిపారు. కాల్పులు ఆగిపోయిన తర్వాత, సంఘటనా స్థలం నుండి రూపి మృతదేహంతో పాటు ఒక పిస్టల్, పేలుడు పదార్థాలు, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని ఆయన అన్నారు. పోలీసుల ప్రకారం, రూపి గత సంవత్సరం మాన్‌పూర్–మొహ్లా–అంబఘర్ చౌకీ జిల్లా ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు విజయ్ రెడ్డి భార్య. శాంతియుత, గౌరవప్రదమైన జీవితాన్ని ఎంచుకోవడానికి వారికి పరిమిత సమయం మాత్రమే మిగిలి ఉందని పేర్కొంటూ, మిగిలిన మావోయిస్టు కేడర్లు హింసను విడనాడి ప్రధాన స్రవంతిలో తిరిగి చేరాలని ఐజీ సుందర్‌రాజ్ పి విజ్ఞప్తి చేశారు. తాజా చర్యతో, ఈ ఏడాది ఛత్తీస్‌గఢ్‌లో ఇప్పటివరకు జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో కనీసం 28 మంది మావోయిస్టులు హతమయ్యారు. గత సంవత్సరం, రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎన్‌కౌంటర్లలో భద్రతా దళాలు 285 మంది మావోయిస్టులను హతమార్చాయి. దేశం నుండి వామపక్ష తీవ్రవాదాన్ని నిర్మూలించడానికి కేంద్రం మార్చి 31, 2026ను గడువుగా నిర్ణయించింది.

## మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ

# దశాబ్దాల నిరీక్షణకు ముగింపు

### మహిళా కోటా చట్ట సవరణకు మూడు రోజుల పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు : ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ :** 21వ శతాబ్దపు అత్యంత కీలకమైన నిర్ణయాలలో ఒకదానిని తీసుకునే అంచున భారతదేశం నిలిచి ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని సవరించి 2029 నాటికి అమలు చేయడం ద్వారా దశాబ్దాల నిరీక్షణకు ముగింపు పలికేందుకు పార్లమెంటు సమావేశమవుతోందని ఆయన తెలిపారు. ఈనెల 16న ప్రారంభమయ్యే మూడు రోజుల ప్రత్యేక పార్లమెంటు సమావేశాలకు ముందు సోమవారం ఢిల్లీలో జరిగిన మహిళల సదస్సును ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. 'నారీ శక్తి వందన్ అధినియం'కు చేసే సవరణలు గత తరం ఆశయాలను సాకారం చేస్తాయని, భవిష్యత్తు సంకల్పాలను నెరవేరుస్తాయని ఆయన పేర్కొన్నారు. పాలనలో మహిళల సేవలను కొనియాడుతూ, వారిలో చాలామంది మరింత కీలకమైన బాధ్యతలను స్వీకరించడానికి సిద్ధంగా, ఉత్సాహంగా ఉన్నారని ఆయన ఉద్ఘాటించారు. 'మన దేశ పార్లమెంటు ఒక కొత్త చరిత్రను సృష్టించే దిశగా అడుగులు వేస్తోంది. గత తరం ఆశయాలను సాకారం చేసే, భవిష్యత్తు సంకల్పాలను నెరవేర్చే ఒక కొత్త చరిత్ర అది. సమానత్వంతో కూడిన భారతదేశం కోసం, సామాజిక న్యాయం కేవలం ఒక నినాదంగా కాకుండా, మన పని సంస్కృతిలోనూ,



నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలోనూ ఒక సహజ భాగంగా ఉండే భారతదేశం కోసం తీసుకున్న సంకల్పం ఇది' అని ఆయన అన్నారు. 2023లో ఈ చట్టాన్ని ప్రవేశపెట్టినప్పుడు అన్ని రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించాయని, ముఖ్యంగా ప్రతిపక్షాల నుండి 2029 నాటికి దీనిని అమలు చేయాలనే సామూహిక డిమాండ్ వినిపించిందని కూడా ఆయన గుర్తుచేశారు. రాష్ట్ర శాసనసభల నుండి దేశ పార్లమెంటు వరకు దశాబ్దాల నిరీక్షణకు ముగింపు పలికే సమయం ఈనెల 16, 17, 18 తేదీలేనని ప్రధానమంత్రి తెలిపారు. ఈ తేదీలలోనే, చట్ట సవరణలను పరిశీలించి ఆమోదించేందుకుగాను బడ్జెట్ సమావేశాల పొడిగింపు షెడ్యూల్ చేయబడిందని ఆయన పేర్కొన్నారు. మహిళల భాగస్వామ్యం దేశ ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేలా, 'నారీ శక్తి వందన్ అధినియం'ను సకాలంలో అమలు చేయాలని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా మహిళల్లో నెలకొన్న ఉత్సాహాన్ని ప్రస్తావిస్తూ, దేశవ్యాప్తంగా ఉన్న మహిళలు శాసనసభలు, లోక్‌సభలో స్థానం సంపాదించాలనే తమ ఆకాంక్షలను గట్టిగా వినిపిస్తున్నారని మోదీ అన్నారు. వారి కలలకు కొత్త రెక్కలు వచ్చాయని, దేశంలో ఒక సానుకూల వాతావరణం ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. 'రాష్ట్రపతి నుండి ప్రధానమంత్రి వరకు, మహిళలు ఏ స్థానంలో ఉన్నా సరే, వారు తమదైన ఒక ప్రత్యేక వారసత్వాన్ని సృష్టించుకున్నారు' అని ఆయన అన్నారు. 'నారీ శక్తి వందన అధినియమ్‌ను అమలు చేయడం అనేది అటువంటి మహిళలందరి జీవితాల్లో ఒక గొప్ప అవకాశంగా మారుతుంది. పంచాయతీ నుండి పార్లమెంటు వరకు వారి ప్రయాణం మరింత సులభతరం కాబోతోంది' అని ఆయన అన్నారు. పుట్టిన మొదటి శ్వాస నుండి చివరి శ్వాస వరకు, ప్రభుత్వం వివిధ పథకాలతో సోదరీమణులకు, కుమార్తెలకు సేవ చేయడానికి సిద్ధంగా ఉందని మోదీ తెలిపారు.'

## మహిళా రిజర్వేషన్ల చట్టానికి

# కాంగ్రెస్ వ్యతిరేకం కాదు

### 15న తమ పార్టీ ఆధ్వర్యంలో అఖిలపక్ష భేటీ
### ఈ బిల్లుపై సమగ్ర సంప్రదింపులకు కేంద్రం సిద్ధంగా లేదు : ఖర్గే



**న్యూఢిల్లీ :** మహిళా రిజర్వేషన్ల చట్టం గురించి చర్చించేందుకు ఏప్రిల్ 15న తమ పార్టీ ఒక అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఈ బిల్లుపై సంబంధిత వర్గాలన్నింటితోనూ సమగ్ర సంప్రదింపులు జరపడానికి కేం ద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల చట్టానికి కా ంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. అయితే జాతీయ స్థా యిలో దీని ప్రభావం విస్తృతంగా ఉన్నందున, మహిళా రిజర్వేషన్ల చట్టం అమలుపై విస్తృత చర్చలు జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మ హిళా రిజర్వేషన్ల చట్టానికి తమ పార్టీ వ్యతిరేకం కాదని వెల్లడించారు. కర్ణాటకలోని బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. 'మహిళా రిజర్వేషన్ల చట్టంపై చర్చించేందుకు కేంద్రం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ పార్టీ పాల్గొంటుంది. తగు సూచనలను అందిస్తుంది. కా నీ కేంద్రం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడానికి సిద్ధంగా లేదు. అoదుకే మేము ఏప్రిల్ 15న అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నాం. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తూనే ఉంది. మహిళా రిజర్వేషన్ల చ ట్టాన్ని వ్యతిరేకిస్తున్నామని చేస్తున్న ఆరోపణలు అవాస్తవం. అంతేకాకుండా నా రీ శక్తి వందన్ అధినియంకు మేం వ్యతిరేకం కాదు. పార్లమెంట్‌లో ఇది ఏకగ్రీవంగా ఆమోదించిన చట్టం. మోదీ సర్కార్ కేవలం ఈ చట్టం ద్వారా రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తోంది. మేము ఇప్పటికే పంచాయతీలు, జిల్లా పరిషత్తులు, కార్పొరేషన్లలో ఈ చట్టాన్ని దీనిని అమలు చేశాము. కాబట్టి మాకు ఎ వరూ నీతులు చెప్పాల్సిన అవసరం లేదు. దేశానికి సంబంధించిన ఒక నిర్ణయం తీసుకున్నప్పుడు, దానికి విస్తృతమైన పర్యవసానాలు ఉంటాయి' అని ఖర్గే పేర్కొన్నారు.

# అశ్రునయనాల మధ్య ఆశా భోస్లే అంత్యక్రియలు



**న్యూఢిల్లీ :** ప్రముఖ బాలీవుడ్ గాయని ఆశా భోస్లే అంత్యక్రియలు అభిమానుల అశ్రునయనాల మధ్య జరిగాయి. ఆశా భోస్లే ఆదివారం తుదిశ్వాస విడవగా సినీ ప్రముఖులు, అభిమానుల సందర్శనార్థం ఆమె పార్థివదేహాన్ని ముంబయిలోని నివాసంలో సోమవారం మధ్యాహ్నం వరకూ ఉంచారు. పలువురు ప్రముఖులు తరలివచ్చి ఆశా భోస్లేకు తుది వీడ్కోలు పలికారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఎఆర్ రెహమాన్, క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్ అంజలి ఘటించారు. మహారాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ సిఎం సుశీల్ కుమార్ షిండే, ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, శివసేన ఉద్ధవ్ థాక్రే పార్టీ అధినేత ఉద్ధవ్ థాక్రే ఆశా భోస్లే పార్థివ దేహం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం ముంబయిలో ఆశా భోస్లే అంతిమయాత్ర నిర్వహించారు. తుది విడ్కోలు పలికేందుకు పలువురు ప్రముఖులతో భారీగా అభిమానులు తరలివచ్చారు. సాయంత్రం 4 గంటలకు శివాజీ పార్క్ శ్మశానవాటికలో ప్రభుత్వం లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఇదిలా ఉండగా, మహారాష్ట్ర ప్రభుత్వం ప్రముఖ గాయని ఆశా భోస్లే కలలు కన్న సంగీత సంస్థ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లనున్నట్లు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. ఆశా భోస్లే ప్రతిపాదించిన సంగీత విద్యా సంస్థ నిర్మాణాన్ని ప్రభుత్వం త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఆమెకు ఘన నివాళులు అర్పించారు.

# లాలూకు సుప్రీంలో చుక్కెదురు...

### వ్యక్తిగత హాజరు నుంచి మాత్రం మినహాయింపు



**న్యూఢిల్లీ :** భూములు తీసుకుని ఉద్యోగాలు ఇచ్చారనే కేసులో ఆర్‌జెడి చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌కు సుప్రీంకోర్టులో నిరాశ ఎదురైంది. తనపై, తన కుటుంబ సభ్యులపై సిబిఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలంటూ లాలూ వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం సోమవారం నాడు తోసిపుచ్చింది. జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటేశ్వర సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. కేసులో మెరిట్స్‌ను పరిశీలించే అధికారాన్ని ట్రయిల్ కోర్టుకే విడిచిపెడుతూ, చట్టప్రకారం విచారణ కొనసాగించవచ్చని ధర్మాసనం పేర్కొంది. అయితే ట్రయల్ కోర్టు విచారణకు వ్యక్తిగత హాజరు నుంచి లాలూకు మినహాయింపు ఇచ్చింది. ఈకేసులో ఇంతకుముందు లాలూ ప్రసాద్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తలిగింది. సిబిఐ తమపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలంటూ లాలూ వేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. పిటిషన్‌లో ఎలాంటి మెరిట్ లేదని కోర్టు పేర్కొంది. ఈ నిర్ణయాన్ని లాలూ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. దీనిపైనే సుప్రీం తాజా తీర్పు చెప్పింది. లాలూ ప్రసాద్ యాదవ్ 2004–2009 మధ్య కేంద్ర రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు ఉద్యోగాల కేటాయింపులో అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఆ సమయంలో రైల్వేలోని వివిధ జోన్లలో అనేక మందిని గ్రూప్‌డి పోస్టుల్లో నియమించారు. దీనికి బదులుగా వారి భూములను లాలూ ప్రసాద్ కుటుంబ సభ్యులతో పాటు ఒక ప్రైవేటు కంపెనీకి బదిలీ చేశారని సిబిఐ ఆరోపణగా ఉంది. 2022 మే 18న లాలూ, ఆయన భార్య, ఇద్దరు కుమార్తెలు, గుర్తు తెలియని ప్రభుత్వ అధికారులు, ప్రైవేటు వ్యక్తులపై కేసు నమోదైంది. 77 ఏళ్ల లాలూ, ఇతర నిందితులు ప్రస్తుతం బెయిలుపై ఉన్నారు. కాగా, సిబిఐ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్, ఇన్వెస్టిగేషన్, చార్జిషీట్లలో చట్టపరమైన లోపాలున్నాయని లాలూ వాదనగా ఉంది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 17ఏ కింద సిబిఐ ముందస్తు అనుమతి తీసుకోలేదని, ఇందువల్ల సిబిఐ ప్రొసీడింగ్స్ చెల్లనేరవని లాలూ వాదించారు. అయితే ఈ వాదనను తాజాగా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దీంతో ఈ కేసులో లాలూ కుటుంబానికి న్యాయపరంగా మరిన్ని చిక్కులు తప్పేలాలేవు.

## కనీస మద్దతు ధర పిటిషన్‌పై...

# కేంద్రం, ఇతరుల నుంచి స్పందనలు కోరిన 'సుప్రీం'

- గత ఐదేళ్లలో ఒక్క మహారాష్ట్రలోనే 17,000 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని పిటిషన్ వెల్లడి
- పిటిషనర్ల తరపున వాదనలు వినిపించిన న్యాయవాది ప్రశాంత్‌భూషణ్

**న్యూఢిల్లీ :** కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)ను నిర్ణయించేటప్పుడు సాగుకు అయ్యే కచ్చితమైన ఖర్చుపై రాష్ట్రాల ప్రతిపాదనను పరిగణనలోనికి తీసుకోవాలంటూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టు కేంద్రం, ఇతరుల నుంచి స్పందనలను కోరింది.ప్రధానన్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించడానికి అంగీకరించింది. దానిపై స్పందన కోరుతూ కేంద్రానికి, విదేశీ వాణిజ్య, వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్ డైరెక్టరేట్ జనరల్‌కు నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ల తరపున హాజరైన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఈ పిటిషన్ దేశంలోని రైతులకు సంబంధించిన చాలా ముఖ్యమైన సమస్యను లేవనెత్తుతుందని ధర్మాసనానికి తెలిపారు. భారతీయ రైతులు తమ పంటను అసలు ధరకు కూడా అమ్ముకోలేక తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని, ఇది రైతులు పెద్ద యెత్తున ఆత్మహత్యలకు దారితీసిందని, ఒక్క మహారాష్ట్రలోనే గత ఐదేళ్లుగా 17,000 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. కనీస మద్దతు ధర సాగు ఖర్చుకు సమానంగా లేదా అంతకంటే తక్కువగా ఉందని తన వాదనల సందర్భంగా ప్రశాంత్ భూషణ్ అన్నారు. పిటిషన్‌లో చాలా గణిత సూత్రాలను ఉదహరించడం వల్ల రాష్ట్రాల వారీగా



మారే ఖర్చులు, మూలధనం విషయంలో ఇబ్బంది తలెత్తవచ్చని ధర్మాసనం గమనించింది. ఈ లెక్కలను ప్రభుత్వం చేసిందని ప్రశాంత్ భూషణ్ ధర్మాసనానికి చెప్పారు. 'మీరు మమ్మల్ని ఆర్థిక విధానాన్ని తిరిగి రాయమని అడుగుతున్నారు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.పెద్ద మొత్తంలో భూమి ఉన్న రైతులు కూడా ఉన్నందున, బహుశా అందరికీ ఒకే విధమైన విధానం ఉండటం సాధ్యం కాదని ధర్మాసనం పేర్కొంది. కాగా ధర్మాసనం పిటిషన్‌ను విచారించడానికి అంగీకరించినప్పటికీ దానిపై ఎటువంటి ఉత్తర్వు జారీచేయలేదు. ప్రభుత్వం దాని సంస్థలు రాష్ట్రాల వారీగా వివిధ వ్యవసాయ ఉత్పత్తులు సహా ఉత్పత్తిని లెక్కిస్తాయని అది పేర్కొంది. దేశంలో వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు రైతులకు వారి ఖర్చుతో పాటు అదనంగా 50శాతం చెల్లించాలని, 2006 నాటి ఎం.ఎస్.స్వామినాథన్ కమిషన్ నివేదిక సిఫార్సు చేసిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ సిఫార్సును ప్రభుత్వం ఎన్నడూ ప్రశ్నించలేదని కూడా పిటిషనర్ తెలిపారు. ప్రభుత్వం ఏటా పంటల వారీగా నిర్ణయిస్తున్న కనీస మద్దతు ధర ఉత్పత్తి సగటు వ్యయం కంటే గణనీయంగా తక్కువగా ఉందని పిటిషన్ తెలిపింది. సాగుకు అయ్యే కచ్చితమైన ఖర్చు ఆధారంగా లెక్కించిన ఎంఎస్‌పి కింద నోటిఫైడ్ పంటల పూర్తి సేకరణను నిర్ధారించాలని అధికారులను ఆదేశించాలని కోరింది. దేశవ్యాప్తంగా ప్రతీ తహసీల్, బ్లాక్, గ్రామం, జిల్లాలో సమర్థవంతమైన, అందుబాటులో ఉండే క్రియాశీలమైన సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అలాగే సమర్థవంతమైన సేకరణను కేవలం ఎంపిక చేసిన పంటలకు లేదా ప్రాంతాలకు మాత్రమే పరిమితం చేయకుండా ఎంఎస్‌పి విధానం కింద నోటిఫై చేయబడిన అన్ని పంటల సేకరణకు హామీ ఇచ్చేలా పారదర్శకమైన, ఏకరీతి సేకరణ యంత్రాంగాన్ని అమలు చేయాలని కూడా ఈ పిటిషన్‌లో కోరారు. సాగు ఖర్చుల వసూలును నిర్ధారించడంలో ఎంఎస్‌పి చట్రం నిరంతరం విఫలం అవుతోందని, తత్ఫలితంగా వ్యవసాయంలో అసమతౌల్యం ఏర్పడుతోందని ఆరోపిస్తూ, రైతులకు చెల్లించాల్సిన బకాయిలను అన్నింటినీ మాఫీ చేయాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీచేయాలని కూడా పిటిషనర్లు కోర్టును అభ్యర్థించారు.

# ఢిల్లీ బలగాలతో బిజెపి గెలుపు అసాధ్యం

### నన్ను ఎదుర్కొనేందుకు 19 రాష్ట్రాలు, కేంద్రం ఏకమయ్యాయ్
### పశ్చిమబెంగాల్ సిఎం మమతా బెనర్జీ

**సూరి/గల్సి :** తనను ఎదుర్కోవడానికి 19 రాష్ట్రాలు, కేంద్రం ఏకమయ్యాయని, తాను సామాన్య ప్రజల కోసం ఒంటరిగా పోరాడుతున్నానని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం పేర్కొన్నారు. బీర్‌భూమ్ జిల్లాలోని సూరిలో సోమవారం జరిగిన ఒక ర్యాలీలో ప్రసంగిస్తూ, ఢిల్లీ బలగాలతో బిజెపి పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో గెలవలేదని టిఎంసి అధినేత్రి అన్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ 226కు పైగా సీట్లు కైవసం చేసుకుంటుందని ఆమె దీమా వ్యక్తం చేశారు. యువతను ప్రభావితం చేసేందుకే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని ప్రసారం చేస్తున్నారని కూడా బెనర్జీ ఆరోపించారు. వారు (బిజెపి) డబ్బు పంచిపెడుతున్నారు... ఎవరూ పట్టుకోకుండా ఉండేందుకు అధికారులు, పోలీసులతో సహా అందరినీ ఇతర రాష్ట్రాలకు బదిలీ చేశారు. పశ్చిమ బెంగాల్‌లోకి డబ్బు, మత్తుపదార్థాలు, ఆయుధాలు, ఓటర్లను అక్రమంగా తరలిస్తున్నారు. బిహార్ నుండి ఓటర్లను రైళ్లు, బస్సుల్లో తీసుకువచ్చి ఓటు వేయిస్తున్నారు. మొత్తం 19 రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం నాకు వ్యతిరేకంగా ఏకమయ్యాయి... వారికి నేను ఒక్కరినే చాలు. నేను ఒంటరినని అనుకోవడం లేదు కాబట్టి సామాన్య ప్రజల కోసం నా పోరాటాన్ని కొనసాగిస్తాను. నాకు ప్రజల ఆశీస్సులు ఉన్నాయి' అని ఆమె అన్నారు. అన్ని స్థానాల్లోనూ తానే అభ్యర్థినని మోదీ చేసిన వ్యాఖ్యకు ప్రతిస్పందనగా ఆయనకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నారా అని ప్రశ్నిస్తూ టిఎంసి అధినేత్రి ఎద్దేవా చేశారు. 294 అసెంబ్లీ స్థానాలన్నింటిలోనూ తానే అభ్యర్థినని మోదీ చేసిన ప్రకటన, 2021 నుంచి ఎన్నికల ప్రచారాల్లో తాను పదేపదే చెబుతున్న విషయాన్నే ప్రతిబింబిస్తోందని బెనర్జీ అన్నారు. ఆదివారం సిలిగురిలో జరిగిన ఒక ర్యాలీలో ప్రసంగిస్తూ, పశ్చిమ బెంగాల్‌లోని 'అన్ని నియోజకవర్గాల్లోనూ తానే బిజెపి అభ్యర్థినని' ప్రధాని అన్నారు. 'మోదీజీ తానే 294 స్థానాల్లో అభ్యర్థినని చెబితే, ఆయన ప్రధాన మంత్రి పదవికి రాజీనామా చేసి, పశ్చిమ బెంగాల్



ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నానని చెప్పాలి. అన్ని నియోజకవర్గాల్లోనూ ఓట్లు అడగనివ్వండి' అని ఆమె అన్నారు. ముందు, మీరు దేశానికి ప్రధానమంత్రి కావాలనుకుంటున్నారా లేక పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నారా అని నిర్ణయించుకోండని సూచించారు. మీరు ఇక్కడ బయటి వ్యక్తి, ముందు ఢిల్లీని చక్కదిద్దండి, ఆ తర్వాతే పశ్చిమ బెంగాల్ గురించి ఆలోచించండి అని చురకలంటించారు. ఉద్యోగ కల్పన హామీలపై మోదీపై విమర్శలు గుప్పిస్తూ, రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న మీ పాత హామీ ఏమైంది? అని బెనర్జీ ప్రశ్నించారు. మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని కూడా టిఎంసి అధినేత్రి విమర్శించారు. పిల్లలను ప్రభావితం చేయడానికి దీనిని వాడుకుంటున్నారని ఆమె ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో బుల్డోజర్లు దూసుకొస్తాయని ఆదివారం నాడు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, తమ ప్రభుత్వం అటువంటి విధానాన్ని కాకుండా ప్రేమ ఆధారిత విధానాన్ని విశ్వసిస్తుందని బెనర్జీ ఎదురుదాడి చేశారు. 'మేము బుల్డోజర్ విధానాన్ని విశ్వసించము. మేము ప్రేమ విధానాన్ని విశ్వసిస్తాము' అని ఆమె అన్నారు. బిజెపి నుంచి డబ్బులు తీసుకోవడం భవిష్యత్తులో చట్టపరమైన చిక్కులకు దారితీయవచ్చని బెనర్జీ ప్రజలను హెచ్చరించారు. బొగ్గు, పోర్టు కార్యకలాపాలకు సంబంధించిన అవినీతిపై బిజెపి నాయకులను నిందిస్తూ, ఆ పార్టీ 'ఛార్జ్ షీట్' ప్రచారాన్ని బెనర్జీ తీవ్రంగా విమర్శించారు. అదే సమయంలో తృణమూల్ కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకోవద్దని ఆ పార్టీని హెచ్చరించారు.

# మూడు రాష్ట్రాల్లో రోడ్డు ప్రమాదాలు

**న్యూఢిల్లీ :**సోమవారం మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో జరిగిన రోడ్డుప్రమాదాల్లో 24 మంది మృతిచెందారు, 13 మంది గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం మహారాష్ట్ర, థాణే జిల్లాలోని గోవిలి గ్రామం రైతా బ్రిడ్జి దగ్గర వ్యాన్, సిమెంట్ మిక్చర్ లారీ ఢీకొన్న ఘటనలో 11 మంది మృతిచెందగా, ఇద్దరు గాయపడ్డారు.వ్యాన్ మురాబాద్ నుంచి కల్యాణ్‌కు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న సిమెంట్ మిక్చర్ లారీని ఢీకొట్టడంతో ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. మృతుల్లో 8మంది పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నారన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని హర్దూర్ జిల్లాలో బస్సు, ట్రక్కు ఢీకొన్న ఘటనలో ఆరుగురు మృతిచెందగా, ఏడుగురు గాయపడ్డారు. వివాహ వేడుకకు వెళ్లి తిరిగి వస్తుండగా ఘటన జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రమాదంలో పెళ్లికొడుకు తండ్రి కూడా మరణించాడు.అలాగే గుజరాత్‌లోని సురేంద్రనగర్ జిల్లాలో జరిగిన మరో ఘటనలో ఏడుగురు మృతిచెందగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పత్తి లోడుతో వెళ్తున్న ట్రక్కు అదుపుతప్పి, రాజ్‌కోట్ నుంచి బహుచరాజికి నడుచుకుంటూ వెళ్తున్న యాత్రికుల బృందాన్ని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. 500 మంది యాత్రికుల బృందం చరాద్ గ్రామం నుంచి బయలుదేరారని, భాస్కరపరా గ్రామం ఆగినప్పుడు ప్రమాదం జరిగినట్లు తెలిపారు.

## ప్రత్యేక పార్లమెంట్ సమావేశానికి...

# లోక్‌సభ పార్టీ ఎంపీలందరూ హాజరుకావాలి

### కాంగ్రెస్ విప్ జారీ

**న్యూఢిల్లీ :** మహిళా రిజర్వేషన్ చట్టానికి సవరణలను ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశానికి లోక్‌సభ పార్టీ ఎంపీలు అందరూ సభకు హాజరుకావాలని సోమవారం కాంగ్రెస్ విప్ జారీచేసింది. గురువారం, శుక్రవారం, శనివారం సభలో కొన్ని చాలా ముఖ్యమైన అంశాలను చర్చకు, ఓటింగ్ చేపట్టనున్నట్లు కాంగ్రెస్ తన లోక్‌సభ ఎంపీలు అందరికీ తెలియజేసింది. 'లోక్‌సభలోని పార్టీ ఎంపీలందరూ ఏప్రిల్ 16 (గురువారం), 17 (శుక్రవారం), 18 (శనివారం) తేదీలలో ఉదయం 11గంటల నుంచి సభ వాయిదా పడేవరకూ తప్పనిసరిగా సభలో హాజరై పార్టీ వైఖరికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాం' అని పార్టీ తెలిపింది. 'దీనిని అత్యంత ముఖ్యమైనదిగా పరిగణించవచ్చు' అని పార్టీ జారీచేసిన మూడులైన్ల విప్‌లో తెలిపింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను పొడిగించారు. ఏప్రిల్ 16 నుంచి 18 తేదీల మధ్య మూడు రోజుల పాటు సభ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు.'నారీ శక్తి వందన అధినియమ్' కు సవరణలను 2029లో అమలు చేసేందుకు తీసుకురానున్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో వేలిముద్ర, ఐరిస్ బయోమెట్రీ అమలు విజ్ఞప్తిపై...

# కేంద్రం, ఇసికి 'సుప్రీం' నోటీసులు

### పిటిషన్ విచారణకు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ బెంచ్ అంగీకారం
### ప్రస్తుత రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు ఈ విధానాన్ని వర్తింపచేయలేమని స్పష్టీకరణ'

**న్యూఢిల్లీ:** డూప్లికేట్ ఓటింగ్‌ను నివారించడానికి పోలింగ్ కేంద్రాలలో వేలిముద్ర, ఐరిస్ బయోమెట్రిక్ వ్యవస్థను అమలు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టు కేంద్రం, ఎన్నికల స oఘం, ఇతరుల నుంచి స్పందనను కోరింది. ఈ పిటిషన్‌ను విచారించడానికి అంగీకరిస్తూ ప్రధాన న్యా యమూర్తి సూర్యకాంత్ జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం పిటిషన్‌లో కోరిన విధానాన్ని కొన్ని రాష్ట్రాలలో ప్రస్తుత రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు పరిగణించలేమని స్పష్టం చేసింది. 'అయితే త దుపరి పార్లమెంట్ ఎన్నికలు లేదా రాష్ట్ర శాసనసభ ఎ న్నికలకు ముందు అటువంటి చర్య తీసుకోవడం స ముచితమేనా అనేది పరిశీలించాలి. నోటీసు జారీచేయండి అని బెంచ్ ఆదేశించింది. అశ్వినికుమార్ ఉ పాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందన కోరుతూ కేంద్రానికి, ఎన్నికల సంఘానికి, పలు ఇతర రాష్ట్రాలకు అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీచేసింది. స్వయంగా హాజరైన అశ్వినికుమార్ ఉపాధ్యాయ్ పిటిషన్‌లో కోరిన ప్రార్థన, లంచగొండితనా న్ని, ప్రాక్సీ ఓటింగ్‌ను నిరోధిస్తుందని ధర్మాసనానికి తెలిపారు. దీనికి నిబంధనలలోని పెద్ద మార్పులు అ వసరం అవుతాయని, అంతేకాకుండా భారీ ఆర్థిక భా రం పడుతుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఓ టరు గుర్తింపును బలోపేతం చేయడానికి, లంచగొండితనం, అక్రమ ఓటింగ్, నకిలీ, దొంగ ఓటింగ్‌లను నిర్మూలించడానికి ఎన్నికల సంఘం తన సంపూర్ణ అ ధికారమైన 324 ఆర్టికల్‌ను ఉపయోగించి వేలిము ద్ర, ఐరిస్ ఆధారిత బయోమెట్రిక్ ధృవీకరణను అమ లు చేయవచ్చని పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణ సందర్భంగా తాను ఐదు రాష్ట్రాలలో రాష్ట్ర శాసనసభ లో సభ్యుడిగా లేనని ఉపాధ్యాయ్ తెలిపారు. ఎన్నికలలో పోలింగ్ బూత్‌ల వద్ద వేలిముద్ర, కంటి పాప ( ఐరిస్) బయోమెట్రిక్ ధృవీకరణను అమలు చేయడం ద్వారా నిజమైన, సక్రమంగా నమోదు చేసుకున్న ఓటర్లు మాత్రమే తమ ఓట్లను వేయడానికి అనుమతించబడతారని నిర్ధారించవచ్చని పిటిషన్‌లో పేర్కొన్నారు. 'లంచం, అనుచిత ప్రభావం, ఒకరికి బదులు మరొకరు ఫోటోలు మార్పిడి, డూప్లికేట్ ఓటింగ్, దొంగ ఓట్ల వంటివి ఇప్పటికీ పౌరులను ప్రభావితం చేస్తున్నందున ఎన్నికల ప్రక్రియ, స్వచ్ఛత, సమగ్రతకు కలిగే నష్టం అత్యంత తీవ్రమైనది' అని పిటిషన్ సమర్పించింది. ప్రస్తుతం ఓటరు గుర్తింపు అనేది ఐడి కార్డు, మాన్యువల్ వెరిఫికేషన్ ద్వావరా జరుగుతోందని, ఇవి కాలం చెల్లిన ఫోటోలు, గుమస్తా పొరపాట్లు, రియల్ టైమ్ సమాచారం లేకపోవడం వంటి వాటికి గురయ్యే అవకాశం ఉందని అది పేర్కొంది. 'ఇది ఒకే వ్యక్తిగా నటి స్తూ ఓటు వేయడానికి లేదా అనధికార వ్యక్తుల ద్వా రా బహుళ ఓటింగ్‌లకు ఆస్కారం కల్పిస్తుంది. ప్రతీ వ్యక్తికీ ప్రత్యేకంగా ఉండే వేలిముద్ర, కనుపాప ఆధారిత ప్రామాణీకరణ, నకిలీ ఓటింగ్‌లను /దొంగ ఓటింగ్‌లను తొలగించి 'ఆన్ ఓట్' నిబంధనలను కచ్చితంగా పాటించేలా చేస్తుంది' అని పిటిషన్ తెలిపింది. జనాభాలో గణనీయమైన భాగం వలస వెళ్లడం వల్ల నియోజక వర్గాల ఓటర్ల జాబితాలో తరుచూ వ్యత్యాసాలు ఏర్పడుతున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు.

**పాసుబుక్ పోయినది**

హనుమకొండ జిల్లా, వేలేరు మండలం, కన్నారం గ్రామానికి చెందిన **సందెబోయిన లచ్చమ్మ భర్త కొమురయ్య**కు సంబంధించిన తెలంగాణ పట్టాదారు పాస్ బుక్ పోయినది. తెలంగాణ పట్టాదారు **పాసు బుక్కు ఖాతా నెంబర్ : 398**, పట్టా పాసు బుక్ నెం. **T21100020232** నెంబర్ గల సంబంధిత పట్టాదారు ఫిబ్రవరి నెలలో కన్నారం నుండి హనుమకొండ కు బస్ లో ప్రయాణం చేయుచుండగా పోయినది, ఇట్టి పట్టాదారు పాసు బుక్కు దొరికినవారు ఈ క్రింది చిరునామాకు అందించగలరు.

ఇట్లు
**సందెబోయిన లచ్చమ్మ,**
**భర్త : కొమురయ్య ,**
ఇంటి నెంబర్ : 2-33,
గ్రామం : కన్నారం,
మండలం : వేలేరు,
జిల్లా : హనుమకొండ,
పిన్ నెం : 505471.
**ఫోన్ నెంబర్ : 9701006631**

# శాంతిమార్గం విడనాడితే మిగిలేది వినాశమే!

పాకిస్థాన్ మధ్యవర్తిగా ఇస్లామాబాద్‌లో అమెరికా – ఇరాన్ ప్రతినిధుల మధ్య ఏకబిగిన 21గంటలపాటు జరిగిన చర్చలు ఒప్పందం లేకుండా ముగిసినప్పటికీ వాటి ప్రాధాన్యత వాటికుంది. 38 రోజులపాటు హోరాహోరీ గగనతల మిస్సైలీ, డ్రోన్ బాంబుల యుద్ధం తర్వాత కాల్పుల విరమణ ప్రకటించిన వెనువెంటనే చర్చలు జరగటమే విశేషం. అంతేగాక, 1979లో ఇరానియన్ ఇస్లామిక్ విప్లవం తర్వాత అమెరికా–ఇరాన్ ముఖ్య నాయకుల మధ్య ముఖాముఖీ చర్చలు ఇదే ప్రథమం అని గుర్తుచేసుకున్నప్పుడు వాటి ప్రాధాన్యత స్పష్టం. అధ్యక్షుడు ట్రంప్ రెండు వారాలపాటు కాల్పుల విరమణ ప్రకటనకు ముందు చేసిన భీకర ప్రకటనలు ఎట్టి ఉపద్రవానికి దారితీస్తాయో అని ప్రపంచదేశాలు తీవ్రంగా కలతపడిన నేపథ్యం కూడా గుర్తు చేసుకోదగింది. పాకిస్థాన్ ద్వారా ప్రతిపాదించబడిన శాంతి చర్చల ప్రతిపాదనను ట్రంప్ అంగీకరించటంతో ప్రపంచం ఊపిరిపీల్చుకున్నా, ఆ అంగీకారం ఆయనకు పరాజయంతో సమానం. పాకిస్థాన్ వంటి అప్రధాన దేశం మధ్యవర్తిత్వం ఏమిటి? ప్రపంచదేశాల నుంచి ట్రంప్ అంతగా ఏకాకి అయినట్లు ఇది చెప్పకనే చెబుతున్నది. గతంలో ఇరాక్, అఫ్ఘానిస్థాన్‌లపై దురాక్రమణ యుద్ధాల సందర్భంలోలాగా అమెరికా సైన్యాలు దిగగానే నాటో సైన్యాలు ఇప్పుడు అనుసరించలేదు. యూరప్ రాజ్యాలను 'పిరికి పందలు' అని దూషించినా, హెచ్చరించినా నాటోలో చలనం లేదు. గల్ఫ్‌లోని మిగతా అరబ్ రాజ్యాలు, ఇస్లామిక్ రాజ్యాలు అమెరికా తొత్తులుగా ఉన్నందున, వాటి భూభాగాల్లోని అమెరికా సైనిక స్థావరాలు, వసతులపై ఇరాన్ బాంబులు వర్షిస్తున్నా అవి నోరెత్తే స్థితిలో లేవు. మరోవైపున, హోర్ముజ్ జలసంధిని ఇరాన్ నియంత్రిస్తున్నందున ఆయిలు, ఇతర కీలకమైన వస్తు రవాణా నిలిచిపోయి మిగతా ప్రపంచ దేశాలు ఆర్థిక మాంద్యం, ద్రవ్యోల్బణం అంచుకు చేరుకున్నాయి. కాబట్టి అవేవీ ట్రంప్‌కు మద్దతుగా నోరెత్తే స్థితిలో లేవు. అంతెందుకు, ట్రంప్‌ను ప్రియమిత్రునిగా చెప్పుకునే మన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఈ యుద్ధం మొదలు కావటానికి రెండ్రోజులముందే ఇజ్రాయెల్ సందర్శించి ఆ దేశ యుద్ధోన్మాది నెతన్యాహును ఆలింగనం చేసుకుని వచ్చి, ఖమేనీ హత్యను ఖండించలేని దుస్థితిలో అమెరికా–ఇజ్రాయెల్ పక్షపాతిగా ముద్రపడి పశ్చిమాసియా యుద్ధం గూర్చి పల్లెత్తుమాట మాట్లాడలేక మౌనముని అయినారు. దేశంలో ఆయిలు, గ్యాస్ సంక్షోభం ఆయన్ను ఆవరించింది. 140కోట్ల జనాభా కలిగిన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ మాటకు ప్రపంచం విలువ ఇచ్చేది. ఆ మర్యాదను మోదీ మంటగలిపాడు. పాకిస్థాన్ మధ్యవర్తి పాత్రలోకి రావటం మింగుడుపడని ఆయన వందిమాగధులు 'బ్రోకర్' దేశంగా నోరుపారేసుకుని పరువు తీసుకున్నారు.

ట్రంప్ రెండవసారి అధ్యక్ష పీఠం ఎక్కగానే 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' అంటూ, మిత్ర, అమిత్ర దేశాలనే తేడా లేకుండా సుంకాల యుద్ధంతో అందరినీ అమిత్రుల్ని చేసుకున్నారు. లాటిన్ అమెరికాలో ప్రభుత్వాలు మార్చే పనిలో పడ్డాడు. అది సాధ్య పడనందున వెనిజులా అధ్యక్షుణ్ణి బందీగా పట్టుకొచ్చాడు. ఇజ్రాయెల్‌ను గాఢంగా విశ్వసించే ట్రంప్ తొలి అధ్యక్ష పదవీకాలంలోనే ఒబామా కాలంలో ఇరాన్‌తో కుదిరిన అణుశక్తి నిరోధక అంతర్జాతీయ ఒప్పందాన్ని రద్దు చేస్తానని ప్రకటించాడు. దాన్ని ఈ పదవీకాలంలో నెరవేర్చటమేగాక 2025 జూన్‌లో – అధికారం చేబట్టిన ఐదు మాసాలకే ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్ అణు పదార్థాల పరీక్షల భూగర్భ కేంద్రాలపై బాంబుదాడులు చేసి ఇరాన్ అణుశక్తి కార్యక్రమం కోలుకోలేని విధంగా ధ్వంసం చేశామని ప్రకటించాడు. మరి ఇప్పుడు – అదే కారణంగా ఎందుకు యుద్ధానికి దిగినట్లు? ఇది అమెరికన్‌లు అడుగుతున్న ప్రశ్న. ద్రవ్యోల్బణం పెరిగి అమెరికన్‌ల బాధలు మొదలైనాయి. ప్రజలు 'అమెరికాలో రాచరికం లేదు' అనే నినాదాలతో ట్రంప్ వ్యతిరేక ప్రదర్శనలు చేస్తున్నారు. నవంబర్‌లో కాంగ్రెస్ మధ్యంతర ఎన్నికలు రానున్నాయి. యుద్ధం నుంచి బయటపడటానికి ట్రంప్‌కు ఏదోక హేతువు కావాలి. ఇరాన్‌తో సత్సంబంధాలు కలిగిన పాకిస్థాన్‌ని బహుశా వారే ప్రోత్సహించి ఉంటారు. ఇరాన్ ఇచ్చిన 10 అంశాల ప్రతిపాదనను మార్చి అమెరికాకు పంపారనే ఆరోపణకు గురైంది పాకిస్థాన్ ప్రభుత్వం.

ఏమైతేనేం, చర్చలకు ప్రాతిపదికలపై ఎటువంటి ముందస్తు చర్చలు లేకుండా ఉపాధ్యక్షుడు వాన్స్ నాయకత్వంలో ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని పంపాడు ట్రంప్. నోట్స్ మార్చుకునే పద్ధతిలో ప్రారంభమైన చర్చలు చివరకు ముఖాముఖీ జరిగాయి. చాలావాటిపై అంగీకారం కుదిరిందని, అయితే హోర్ముజ్ జలసంధి ద్వారా స్వేచ్ఛారవాణా, ఎన్నటికీ అణుబాంబు తయారు చేయబోమన్న హామీ ఇరాన్ నుంచి రాలేదని అమెరికా అంటున్నది. అమెరికా మా నుంచి సద్భావాన్ని పొందలేకపోయిందని ఇరాన్ అంటున్నది. ఒక్క సమావేశంతోనే గంభీరమైన సమస్యలన్నీ పరిష్కారమై శాంతి పుష్పాలు విరబూస్తాయని ఎవరూ ఆశించరు. చర్చలు కొనసాగాలి – అందుకోసం కాల్పుల విరమణ పొడిగించాలని కోరుకుంటారు. కాని ట్రంప్ దారే వేరు. హోర్ముజ్ జలసంధిని తెరవకపోతే దాన్ని దిగ్బంధనం చేస్తామని గడువు పెట్టాడు. ఇరాన్‌కు సుంకం చెల్లించి సంధి దాటిన ఓడలను సముద్రంలో పేల్చివేస్తామంటున్నాడు. గల్ఫ్‌లో ఇరాన్ నౌకాశ్రయాలను నాశనం చేస్తామని కాలిగాలిన పిల్లిలా ఎగిరిపడుతున్నాడు. ఇరాన్ దీటుగా జవాబిచ్చింది.

అణుబాంబు తయారు చేయబోమని ఈ యుద్ధానికి ముందే ఇరాన్ ఒమన్ మధ్యవర్తిత్వంలో జరిగిన చర్చల్లో అమెరికాకు హామీ ఇచ్చింది. హోర్ముజ్ జలసంధి ఆ దేశ సార్వభౌమత్వంతో ముడిపడిన అంశం అయినందున తన ఆధిపత్యం వదులుకోదు. 'గల్ఫ్‌లోని ఓడరేవులు అందరికీ చెందుతాయి – కాదంటే ఎవరికీ చెందవు' అని ఘాటుగా సమాధానమిచ్చింది. హోర్ముజ్‌ను నౌకలతో దిగ్బంధించే ట్రంప్ పిలుపును బ్రిటన్ తదితర దేశాలు తిరస్కరించాయి. విధ్వంసానికి పాల్పడి ప్రపంచం ఆగ్రహానికి గురై చరిత్రహీనుడిగా మిగలటమా లేక సంయమనం పాటించి చర్చలు కొనసాగించి పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పటమా? బంతి ట్రంప్ కోర్టులో ఉంది. ●



## విచారణ నుంచి స్వర్ణ తప్పుకోవాలి

**ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ కార్యక్రమాలకు ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి స్వర్ణ కాంత శర్మ నాలుగు సార్లు హాజరయ్యారు. దీంతో ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసు విచారణ నిష్పక్షపాతంగా జరుగదు. ఈ నేపథ్యంలో ఈ కేసు విచారణ నుంచి ఆమె తప్పుకోవాలి. ఢిల్లీ లిక్కర్ కేసు రాజకీయ కోణంతో ముడిపడి ఉన్నది. నేను ఈ రోజు ఇక్కడ నిందితుడిగా నిలబడలేదు. నన్ను ఇప్పటికే నిర్దోషిగా విడుదల చేశారు. సిబిఐ విచారణను ట్రయల్ కోర్టు తప్పుపట్టినప్పటికీ దాని వాదనలను న్యాయమూర్తి స్వర్ణ కాంత శర్మ చాలా వరకు సమర్థించారు. మార్చి 9 నాటి ఉత్తర్వులతో తన గుండె జారిపోయింది.**

– ఆప్ అధినేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్



## అంతరించే అంచున డాల్ఫిన్ జలచరం

సిటేసియన్ క్షీరదాల జాతికి చెందిన డాల్ఫిన్‌లు సామాజిక చైతన్యం, స్నేహపూర్వక స్వభావం, మంచి అవగాహన శక్తిగల జలచరాలుగా మనుగడ సాగించే జంతువుగా మనందరి దృష్టిని, ప్రేమను, విలక్షణ ప్రవర్తనతో ఆకర్షిస్తున్నాయి. సాధారణంగా డాల్ఫిన్లు 4 నుంచి 30 అడుగుల పొడవును కలిగి జలచర జంతువులుగా లోతు తక్కువగా ఉన్న సముద్ర ప్రాంతాల్లో మనుగడ సాగిస్తాయి. చేపలు, స్కిడ్స్ లాంటి జంతువులను తిని బతుకులను కొనసాగించే మాంసాహారులుగా పేరు తెచ్చుకున్నాయి. ఆడ డాల్ఫిన్‌ను 'కౌ' అని, మగ వాటిని 'బుల్' అని, యువ డాల్ఫిన్‌లను 'కాఫ్', డాల్ఫిన్ల సమూహాన్ని 'స్కూల్ లేదా 'పోడ్' అని పిలుస్తారు. నీటిలో కాకుండా నేల పైన కూడా స్పష్టంగా చూడగలగడం, వినగలగడంతో పాటు డాల్ఫిన్లు మంచి స్పర్శ జ్ఞానాన్ని కూడా ప్రదర్శిస్తాయి. డాల్ఫిన్లు కొంతమేరకు శబ్దాలను కూడా చేయగలుగుతాయి. మొత్తంగా 36 రకాల లేదా ఉపజాతులుగా డాల్ఫిన్‌లు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్నాయి.

**మానవులకు మంచి స్నేహితులు డాల్ఫిన్స్:**

డజన్ల నుంచి వేల సంఖ్యల్లో సమూహాలుగా (పోడ్) జీవనాలను కొనసాగిస్తూ తమ ఆహారం విరివిగా దొరికే జల వనరుల ప్రదేశాల్లో నివసిస్తాయి. తమ సమూహంలో ఉన్న డాల్ఫిన్లు మంచి స్నేహితులుగా, ఒకరినొకరు సహాయం చేసుకునే స్వభావాలను కలిగి ఉంటాయి. శిక్షణ పొందిన డాల్ఫిన్లు సామాజిక ప్రదర్శనలు, కొట్లాటలు, సైగలు, ఈలలు లాంటి శబ్దాలతో చూపరుల దృష్టిని ఆకర్షిస్తాయి. మానవులు అనుభవిస్తున్న మధుమేహ రుగ్మతలు డాల్ఫిన్లకు కూడా వర్తిస్తాయి.

**భారత్‌లో గంగా ప్రాజెక్ట్ డాల్ఫిన్ :**

1801లో గంగా నదిలో డాల్ఫిన్లను గుర్తించారు. డాల్ఫిన్లు భారత జాతీయ జలచరంగా గుర్తింపు పొందింది. డాల్ఫిన్ జలచరాలను కాపాడుకునే పటిష్ఠ చర్యలు తీసుకోని యెడల ఆ జాతి అంతరించే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత ప్రభుత్వం 05 అక్టోబర్ రోజు జాతీయ గంగా నది డాల్ఫిన్ దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయం కూడా చేయడం సంతోషదాయకం. ఆరోగ్యకర జల జీవావరణ వ్యవస్థలు మాత్రమే జీవ వైవిధ్యానికి ఉపకరిస్తాయని తెలుసుకోవాలి. సమతుల్య సముద్ర పర్యావరణానికి డాల్ఫిన్లు అద్భుతమైన సూచనలాగా కూడా పనిచేస్తున్నాయి. డాల్ఫిన్‌ల శాస్త్రీయ నామం 'ప్లాటానిస్టా గాంగెటికా' అని తెలుసుకోవాలి. ఇవి భారత్, బంగ్లాదేశ్, నేపాల్ ప్రాంతాల్లో కనిపిస్తాయి. డాల్ఫిన్ల సగటు జీవిత కాలం 18–22 ఏండ్లు ఉంటూ, దాదాపు 150–170 కిలోల బరువును కలిగి ఉంటాయి. అమాయక, స్నేహపూర్వక, సామాజిక, అందమైన డాల్ఫిన్ల మనుగడను కాపాడుకుంటూ, జీవ వైవిధ్యానికి పట్టం కడదాం, డాల్ఫిన్ జలచరాలతో ఆటలు ఆడుకుందాం.

*(14 ఏప్రిల్ జాతీయ డాల్ఫిన్ దినోత్సవం సందర్భంగా)*



డాక్టర్ రామ్ పునియాని

## ఆర్ఎస్ఎస్ వ్యతిరేక పోరాటానికి అంబేడ్కర్ జయంతి సందర్భోచితం

మనమంతా ఏప్రిల్ 14న బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని జరుపుకోబోతున్న తరుణంలో 'కుల నిర్మూలన' గురించి బాబాసాహెబ్ బోధించిన ప్రధాన సిద్ధాంతం 'కుల నిర్మూలన' ప్రస్తుత స్థితి గురించి కూడా ఆలోచించాల్సిన సమయం ఇది. 'హిందూ' అనే పదం వాడకంలోకి రాకముందే కులవర్ణ వ్యవస్థ హిందూ సమాజ ఆచారాలలో ప్రధాన భాగంగా ఉంది. మన పవిత్ర గ్రంథాలు, వేదాల నుండి మనుస్మృతి వరకు, ఇక్కడ గౌరవించబడే అనేక ఇతర గ్రంథాలు కఠినమైన వర్ణజాతి నియమాలను నిర్దేశించాయి. ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా గళం విప్పిన మొదటి ప్రధాన స్వరం గౌతమ బుద్ధుడు. దీనినే బాబాసాహెబ్ 'విప్లవం' అని పిలిచారు. ఆ తరువాత, పుష్యమిత్ర శుంగ నుండి మొదలుకొని, బౌద్ధమతం, అది బోధించిన విలువలు వ్యతిరేకించబడ్డాయి. ప్రతీకార విప్లవం అని పిలువబడే ఈ కాలం వర్ణ–కుల వ్యవస్థను దూకుడుగా పునరుద్ధరించడానికి దారితీసింది. భారతదేశం నుండి బౌద్ధమతం తుడిచిపెట్టుకుపోయింది. అయితే ఇది అనేక దక్షిణ, తూర్పు ఆసియా దేశాలలో వర్ధిల్లింది.

కుల వ్యవస్థకు తదుపరి ప్రధాన వ్యతిరేకత కబీర్, రవిదాస్, దాదు వంటి సంతుల నుండి వచ్చింది. ఈ సంతులు ఆచారాలు, పురోహిత వర్గం ప్రాధాన్యతకు విరుద్ధంగా మానవతావాదాన్ని సమర్థించారు, సమాజంలో సమానత్వం గురించి మాట్లాడారు. వారి వాక్చాతుర్యం చాలా శక్తివంతమైనది. కానీ కుల వ్యవస్థ ప్రధాన లబ్ధిదారులైన భూస్వాములతో పొత్తు పెట్టుకున్న పురోహిత వర్గం నుండి వారు బలమైన వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. బ్రిటీష్ వలస పాలన కాలంలో అన్ని రకాల లోపాలు ఉన్నప్పటికీ, ఈ అమానవీయ వ్యవస్థకు వ్యతిరేకంగా ఆధునిక విద్యా వ్యవస్థతో పోరాటం ప్రారంభమైంది. ఆధునిక కాలంలో సమానత్వ భావన జ్యోతిరావు పూలేతో ప్రారంభమైంది. ఆయన నిమ్న కులాల వారి విద్య పట్ల ఉన్న వ్యతిరేకతను ఎదుర్కొని, దళిత— ఒబిసిలకు విద్య, సమాన హోదాను అందించడంలో విజయం సాధించారు. ఆధునిక పారిశ్రామికీకరణ దీనికి మరింత ఊపునిచ్చింది. సమానత్వంతో కూడిన సమాజం కోసం జరిగిన పోరాటం ఇక్కడే పాతుకుపోయింది.

మహిళలను పురుషుల కంటే తక్కువగా చూసే వ్యవస్థ కాఠిన్యానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి, జ్యోతిరావు, సావిత్రిబాయి పూలే ప్రారంభించిన మహిళా విద్యా ఉద్యమం ఒక ఆదర్శవంతమైన వేదికగా నిలిచింది. ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడంలో సావిత్రిబాయితో ఫాతిమా షేక్ దృఢంగా నిలబడ్డారు. సామాజిక న్యాయం కోసం సాగే ఈ ప్రస్థానంలో బాబాసాహెబ్ అంబేడ్కర్ ఒక ప్రధాన ముందడుగు వేశారు. ప్రజల తాగునీటి కోసం (చావదార్ తలావ్), ఆలయ ప్రవేశం కోసం (కలారం మందిర్) ఆయన చేసిన ఉద్యమాలన్నీ ఇందుకు నిదర్శనం. కుల వ్యవస్థకు మతపరమైన ఆమోదాన్ని వ్యతిరేకిస్తూ మనుస్మృతిని దహనం చేయబడింది. ఆత్మగౌరవం కోసం పెరియార్ రామస్వామి నాయకర్ చేసిన ఉద్యమం సమాజ మనస్సాక్షిని కదిలించేంత శక్తివంతమైనది. ఈ ప్రయత్నాలన్నీ మహాత్మా గాంధీ నేతృత్వంలోని స్వాతంత్ర్య ఉద్యమానికి సమాంతరంగా సాగి, చివరికి భారత రాజ్యాంగం కోసం రాజ్యాంగ సభలో చర్చలు జరగడంతో పరాకాష్టకు చేరుకున్నాయి. అంబేడ్కర్ ముసాయిదా కమిటీకి ఛైర్మన్ కావడం కేవలం ప్రతీకాత్మకం కాదు, అది సమానత్వ విలువల కోసం ఈ మహనీయుడు పోషించిన కీలక పాత్రను ప్రతిబింబించింది.



నేడు డాక్టర్ అంబేడ్కర్ 135వ జయంతి

సమానత్వం వైపు సాగే ఈ సామాజిక మార్పు ప్రక్రియకు వ్యతిరేకత బీజాలు సమాజంలోనే ఉన్నాయి. అవి మొదట హిందూ మహాసభలో, ఆ తర్వాత ఆర్ఎస్ఎస్‌లో ప్రతిఫలించాయి. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతానికి మూలమైన కుల, లింగ భేదాల పాతుకుపోయి నిచ్చెన మెట్ల పద్ధతిని కదిలించిన ప్రధాన ముందడుగు దళిత – ఒబిసి ఉద్యమం. సమాజంలో సమానత్వం కోసం పోరాడుతున్న దళితులకు వ్యతిరేకంగా ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించింది. క్రమంగా తన అధికారాన్ని పటిష్టం చేసుకునేందుకు, అది ముస్లింలను ఒక బాహ్య శత్రువుగా వెతుక్కుంది. మనుస్మృతి దాని కేంద్ర బిందువుగా ఉండగా, ఇస్లాం, ముస్లింల పట్ల వ్యతిరేకత దాని ఎదుగుదలకు ఒక ముసుగుగా పనిచేసింది. ప్రచారక్‌లుగా (పూర్తికాల కార్యకర్తలుం, బ్రహ్మచారులు), స్వయంసేవక్‌లుగా మారిన యువకులకు తన శిక్షణా విధానాన్ని అందించడం ద్వారా అది తనను తాను బలోపేతం చేసుకుంటూ వచ్చింది.

రాజ్యాంగం ఎస్‌సి / ఎస్‌టిలకు రిజర్వేషన్లు కల్పించినప్పటికీ, దానికి వ్యతిరేకంగా అంతర్లీనంగా మౌఖిక ప్రచారం కొనసాగింది. ఇది 1980లో దళితులపై, 1985లో ఒబిసిలపై అహ్మదాబాద్ పరిసర ప్రాంతాల్లో జరిగిన హింసాకాండకు దారితీసింది. మండల్ సిఫార్సుల అమలు సామాజిక న్యాయం వైపు ప్రయాణానికి మరింత ఊతమిచ్చింది. మండల్ సిఫార్సుల అమలు ప్రక్రియ నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి హిందూ జాతీయవాదులు తమ కమండల్, రామ మందిరం, గోవు, లవ్ జిహాద్ వంటి వాటిని బలోపేతం చేసుకున్నారు. 'యూత్ ఫర్ ఈక్వాలిటీ' వంటి సంస్థలు మండల్‌కు వ్యతిరేకతను మరింత బలపరిచాయి.

భూ సంస్కరణల ప్రక్రియ అసంపూర్తిగా మిగిలిపోవడం, మత పెద్దలు, భూస్వాములు తమ రూపాన్ని మార్చుకుంటూనే ఉండటం, వారు కనుమరుగవకపోవడంతో, ఈ రిజర్వేషన్ల ప్రక్రియను పాతుకుపోయిన వర్గాలు అంగీకరించలేదు. కుల ఆధారిత రిజర్వేషన్ల ప్రక్రియను నీరుగార్చడానికి, వారు ఆర్థిక ప్రమాణాలను ప్రవేశపెట్టారు. విద్యా రంగంలోని రిజర్వుడు పోస్టులు, 'తగిన అభ్యర్థి దొరకలేదు' అని పక్షపాత ధోరణి గల ఎంపిక కమిటీల వల్ల భర్తీ కాలేదు. హిందూ జాతీయవాద భావజాలం, ఆలోచనలు పెరగడంతో, సామాజిక న్యాయం వైపు సాగే ప్రయాణాన్ని అడ్డుకోవడానికి కొత్త కొత్త శక్తులు పుట్టుకొస్తున్నాయి.

చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కుల గణన డిమాండ్‌కు వ్యతిరేకత వచ్చింది. ఇప్పుడు అది ఆమోదించబడింది. దాని ఫలితాలతో మనం కులాల స్థితి, వారి దుస్థితి గురించి తెలుసుకుంటాము. మరో సమస్య సూక్ష్మ స్థాయిలో పనిచేస్తోంది. అది ముఖ్యంగా విద్యాసంస్థలలో, సాధారణంగా సమాజంలో ఎస్‌సి/ఎస్‌టిలను అవమానించడం. సమాజంలోని అణగారిన వర్గాలకు జరిగే ఈ సూక్ష్మ అవమానాలు దళిత/ఎస్‌టి అభ్యర్థుల ఆత్మహత్యల సంఖ్య పెరగడానికి దారితీశాయి. రోహిత్ వేముల సంస్థాగత హత్య మానవతా విలువలున్న ఎంతో మందిని తీవ్రంగా కలచివేసింది. సైన్స్ రచయిత కావాలనుకున్న ఒక దళిత యువకుడు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అత్యంత దారుణమైన ప్రవర్తనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడు. రోహిత్ చట్టం రూపొందించబడింది కానీ అమలు కాలేదు. ముంబైలోని నాయర్ ఆసుపత్రిలో పాయల్ తడ్వి ఉదంతం మనల్ని తీవ్రంగా కదిలించింది. ఎందుకంటే డాక్టర్ పాయల్ తడ్వి తన పై అధికారుల చేత నిత్యం అవమానాలకు గురై, ఆత్మహత్య చేసుకునేలా ఒత్తిడి చేశారు. ముంబై ఐఐటిలో దర్శన్ సోలంకిని తోటి విద్యార్థులు పలు సందర్భాల్లో ఎగతాళి చేయడంతో, అతను ఆత్మహత్య చేసుకున్నాడు. ఇవి కేవలం కొన్ని ఉదాహరణలు మాత్రమే; ఇలాంటి కేసులు లెక్కలేనన్ని ఉన్నాయి.

ఈ నేపథ్యంలో 2026 జనవరి 13న యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (ఉన్నత విద్యా సంస్థలలో సమానత్వాన్ని ప్రోత్సహించడం) నిబంధనలు– 2026ను నోటిఫై చేసింది. ఇది భారతదేశంలోని అన్ని విశ్వవిద్యాలయాలలో కఠినమైన వివక్ష వ్యతిరేక చర్యలను తప్పనిసరి చేసింది. కుల, లింగ, వైకల్య వివక్షలను లక్ష్యంగా చేసుకుని, సమానత్వాన్ని నిర్ధారించడమే దీని ఉద్దేశ్యం. సమాన అవకాశాల కేంద్రాలు (ఇఒసి), ఈక్విటీ కమిటీలు, 24/7 హెల్ప్‌లైన్‌లు ఏర్పాటు చేయడం, ఈక్విటీ అంబాసిడర్లను నియమించడం వంటివి దీనిలోని ముఖ్య ఆదేశాలు. దీనికి భారీ వ్యతిరేకత, నిరసనలు వెల్లువెత్తాయి. ఈ విషయం కోర్టుకు వెళ్లగా, కోర్టు ఈ యుజిసి ఆదేశాన్ని కొట్టివేసింది. నేడు మనం డాక్టర్ అంబేడ్కర్ ను స్మరించుకుంటున్నప్పుడు, సామాజిక సమానత్వం వైపు సాగే ప్రయాణానికి ప్రధానమైన, అంతర్లీన వ్యతిరేకత బలంగా పాతుకుపోయిన ఆర్ఎస్ఎస్ నుండే వస్తోందనే విషయాన్ని మనం గమనించాలి. అది తన తిరోగమన ఎజెండాను పలు మార్గాల ద్వారా వ్యాప్తి చేస్తోంది. ఆర్ఎస్ఎస్ యొక్క ముస్లిం వ్యతిరేక ఎజెండా స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, దాని దళిత వ్యతిరేక ఎజెండా మరింత అంతర్లీనమైనది. కుల నిర్మూలన అనే స్వప్నాన్ని సాకారం చేసుకోవడానికి దీనిని ఎదుర్కోవలసి ఉంది.

*(ఐపిఎ సర్వీస్)*



సోనియాగాంధీ
కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్

## మహిళా రిజర్వేషన్ కాదు..నియోజకవర్గాల పునర్విభజనే అసలు సమస్య

తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో ఎన్నికల ప్రచారం ఉధృతంగా సాగుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో బలవంతంగా ఆమోదింపజేయాలని భావిస్తున్న బిల్లులకు మద్దతు ఇవ్వాలని ప్రధానమంత్రి ప్రతిపక్ష పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ అసాధారణమైన తొందరపాటుకు ఒకే ఒక కారణం ఉండొచ్చు. అదేమిటంటే రాజకీయ లబ్ధి పొందడం, ప్రతిపక్షాన్ని ఆత్మరక్షణలో పడేయడం. ప్రధానమంత్రి ఎప్పటిలాగే నిజాన్ని మితంగానే చెబుతున్నారు.

2023 సెప్టెంబర్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో నారీ శక్తి వందన్ అధినియమ్, 2023ను పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ అధినియమ్ రాజ్యాంగంలో ఆర్టికల్ 334 ఎను ప్రవేశపెట్టింది. ఇది లోక్‌సభ, విధాన(శాసన)సభలలో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్‌ను తప్పనిసరి చేసింది. తదుపరి జనాభా లెక్కలు, జనాభా లెక్కల ఆధారిత నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియ పూర్తయిన తర్వాత ఇది అమల్లోకి రావాల్సి ఉంది. ప్రతిపక్షం ఈ షరతును కోరలేదు. వాస్తవానికి, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే, 2024 లోక్‌సభ ఎన్నికల నుంచే రిజర్వేషన్ నిబంధనను అమలు చేయాలని గట్టిగా డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి మాత్రమే తెలిసిన కారణాల వల్ల, ఆ ప్రతిపాదనను అంగీకరించలేదు.

ఇప్పుడు 2029 నుంచే మహిళా రిజర్వేషన్‌ను వర్తింపజేసేందుకు ఆర్టికల్ 334ఎను సవరించనున్నారని మాకు అవగతమైంది. ఈ విధంగా యూ టర్న్ తీసుకునేందుకు ప్రధానమంత్రికి 30 నెలలు ఎందుకు పట్టింది? ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి ఆయన కొన్ని వారాలు కూడా ఎందుకు ఆగలేకపోయారు? పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 29న చివరి దశ ఎన్నికలు ముగిసిన తర్వాత, ప్రభుత్వ కొత్త ప్రతిపాదనలపై చర్చించడానికి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపక్ష నాయకులు ఒకసారి కాదు, మూడుసార్లు లేఖలు రాశారు. కానీ, ఆ అత్యంత ఉచితమైన అభ్యర్థనను తిరస్కరించారు. దానికి బదులుగా, ప్రధానమంత్రి సంపాదకీయ వ్యాసాలు రాయడం, రాజకీయ పార్టీలకు విజ్ఞప్తులు చేయడం, సమ్మేళనాలు నిర్వహించడం వంటి వాటికి పాల్పడ్డారు. ఇది ప్రధానమంత్రి ఆధిపత్య ధోరణిని, నిర్ణయాలు తీసుకునే విషయంలో ఆయన 'అయితే నాదారి లేదంటే రహదారి' అనే వైఖరిని ప్రతిబింబించే ఒక కుత్సిత ఎత్తుగడ.

### గతం నుండి పాఠాలు

పార్లమెంటులో 73వ, 74వ రాజ్యాంగ సవరణ బిల్లులు వరుసగా 1993 ఏప్రిల్, 1993జూన్‌లో ఆమోదం పొందాయి. ఈ బిల్లులపై దాదాపు ఐదేళ్ల చర్చలు, వాదోపవాదాలు జరిగాయి. ఆ తర్వాత పంచాయతీలు, నగరపాలికల ఎన్నికలలో మహిళలకు రిజర్వేషన్ చట్టంగా మారింది. ఇది దివంగత ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ సాధించిన ఒక అద్భుతమైన విజయం. నేడు గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలలో సుమారు 15లక్షల మంది ఎన్నికైన మహిళా ప్రతినిధులు ఉన్నారు. ఇది మొత్తం ప్రతినిధుల సంఖ్యలో 40 శాతం కంటే ఎక్కువ. నారీ శక్తి వందన అధినియమ్, 2023 ఈ ఘనత భుజాలపై నిలబడింది.

గత దశాబ్ది జనాభా లెక్కలు 2021లో జరగాల్సి ఉంది. మోదీ ప్రభుత్వం దానిని వాయిదా వేస్తూ వచ్చింది. పర్యవసానంగా, ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజనకు ఆధారమైన జాతీయ ఆహార భద్రతా చట్టం, 2013 ప్రకారం పది కోట్లకు పైగా ప్రజలు తమ చట్టపరమైన హక్కులను కోల్పోయారు. ఐదేళ్ల పాటు వివరించలేని జాప్యం తర్వాతే జనాభా లెక్కల కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ఇది డిజిటల్ జనగణన అని గర్వంగా చెప్పుకుంటున్నారు. దీని డిజిటల్ స్వభావం కారణంగా, చాలా వరకు జనాభా గణన సంఖ్యలు 2027లోనే అందుబాటులోకి వస్తాయని ఉన్నతాధికారులే స్వయంగా బహిరంగంగా ప్రకటించారు. ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి, నియోజకవర్గాల పునర్విభజన చేయడానికి ప్రభుత్వం చూపుతున్న తొందరపాటుకు, చెప్పే సాకులు స్పష్టంగా డొల్లగా ఉన్నాయి.

2027 జనగణనలో కులగణన కూడా ఉంటుందని దాదాపుగా సరిగ్గా ఏడాది క్రితం ప్రధానమంత్రి ప్రకటించారు. కుల గణన నిర్వహించాలనే ఆలోచనను తిరస్కరిస్తూ సుప్రీం కోర్టులో అఫిడవిట్లు దాఖలు చేసి, పార్లమెంటులో ప్రశ్నలకు సమాధానమిచ్చిన తర్వాత ఆయన ఈ ప్రకటన చేశారు. కుల గణన కోసం పిలుపునిస్తున్న కాంగ్రెస్ నాయకులు 'అర్బన్ నక్సల్ మనస్తత్వం'తో బాధపడుతున్నారని ప్రధానమంత్రి ఆరోపించిన తర్వాత కూడా ఇది సంభవించింది.

ఏది ఏమైనప్పటికీ, సామాజిక న్యాయానికి, సాధికారతకు మరింత అర్థం చేకూర్చేందుకు 2027 జనాభా లెక్కలు కులాల వారీగా జనాభాను లెక్కించనున్నాయి. బిహార్, తెలంగాణ రాష్ట్రాలు తమ తమ రాష్ట్రాల్లో సమగ్ర కుల సర్వేలను నిర్వహించాయి. ఈ మొత్తం ప్రక్రియకు ఆరు నెలలకు మించి సమయం పట్టలేదు.

కాబట్టి, కుల గణన కారణంగా 2027 జనాభా లెక్కల ప్రచురణ ఆలస్యం అవుతుందన్న ప్రచారం ఎంతమాత్రం నిజం కాదని స్పష్టమవుతోంది. వాస్తవానికి, కుల గణనను మరింత ఆలస్యం చేసి, పట్టాలు తప్పించడమే ఇప్పుడు ప్రధానమంత్రి అసలు ఉద్దేశం. ప్రత్యేక సమావేశం ఏప్రిల్ 16న ప్రారంభం కానుంది.

అయినప్పటికీ, ఈ సమావేశంలో ప్రభుత్వం కచ్చితంగా ఏ అంశాలను పరిశీలించాలనుకుంటుందో అనే విషయంపై ఎంపిలతో ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రతిపాదనను పంచుకోలేదు. నియోజకవర్గాల పునర్విభజన కోసం ఏదో ఒక ఫార్ములాను సూచిస్తున్నట్లు కనిపిస్తోంది. గతంలో మాదిరిగానే, ఏ పునర్విభజనకైనా ముందుగా జనాభా గణన జరగాలి. అంతేకాకుండా, లోక్‌సభ సభ్యుల సంఖ్యను పెంచే ఏ పునర్విభజన అయినా కేవలం గణాంకపరంగానే కాకుండా రాజకీయంగా కూడా సమానంగా ఉండాలనేది చెప్పనవసరం లేదు. కుటుంబ నియంత్రణలో పథనిర్దేశకులుగా ఉన్న రాష్ట్రాలు, చిన్న రాష్ట్రాలు సంపూర్ణంగా గానీ, సాపేక్షంగా గానీ నష్టానికి గురికాకూడదు. వాస్తవానికి, ప్రపోర్షనేట్ (దామాషా) పెరుగుదల రిలేటివ్ (సాపేక్ష) ప్రభావాన్ని కోల్పోవడానికి దారితీయవచ్చు. ఎందుకంటే సంఖ్యాపరమైన వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉంటుంది.

### నిశిత పరిశీలన అవసరం

నారీ శక్తి వందన అధినియమ్, 2023 రిజర్వేషన్‌లలోనే రిజర్వేషన్‌ను కల్పిస్తుంది. దీని ప్రకారం, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కోసం కేటాయించిన మూడింట ఒక వంతు సీట్లను మహిళలకు కూడా రిజర్వ్ చేస్తారు.

2023 సెప్టెంబర్‌లో జరిగిన చర్చ సందర్భంగా, రాజ్యసభలోని ప్రతిపక్ష నాయకుడు ఇతర వెనుకబడిన తరగతులకు (ఒబిసిలకు) చెందిన మహిళలకు కూడా ఇదే విధమైన రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాలలోఒబిసిలకు ఇప్పటికే రిజర్వేషన్ కల్పించబడింది.

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలై మధ్యలో ప్రారంభమవుతాయి. ఒకవేళ ప్రభుత్వం ఏప్రిల్ 29 (ఐదు శాసనసభల ఎన్నికల) తర్వాత అఖిలపక్ష సమావేశం పిలిచి, ప్రతిపక్షాలతో తమ ప్రతిపాదనలపై చర్చించి, జనబాహుళ్యంలో చర్చకు సమయం ఇచ్చి, ఆ తర్వాత వర్షాకాల సమావేశాల్లో రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదానికి పెడితే ఆకాశం ఏమీ కూలిపోదు.

మన రాజకీయ వ్యవస్థలో అత్యంత సుదూర ప్రభావం చూపే మార్పులను బలవంతంగా రుద్దడానికి పడుతున్న ఈ తొందరపాటుకు, క్లిష్ట సమయాల్లో వృత్తాంతాన్ని సృష్టించడమే తప్ప మరే సమర్థనా లేదు.

ఈ ప్రక్రియ తీవ్ర లోపాలతో కూడుకున్నది, ప్రజాస్వామ్య వ్యతిరేకమైనది. ఇక్కడ మహిళలకు రిజర్వేషన్ సమస్య కాదు. అది ఇప్పటికే పరిష్కరించబడింది. అసలు సమస్య నియోజకవర్గాల పునర్విభజన. అనధికారికంగా అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, ఇది అత్యంత ప్రమాదకరమైనది, రాజ్యాంగంపైనే దాడి లాంటిది.

(ది హిందూ సౌజన్యంతో )

# భూ పరిపాలనకు దిక్సూచి 'భూభారతి'

### రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో భూ పరిపాలనను ప్రక్షాళన చేస్తూ, సామాన్యుడికి భూ హక్కుల భద్రత కల్పించేందుకు తీసుకువచ్చిన 'భూభారతి' చట్టం అమలులోకి వచ్చి నేటికి ఏడాది పూర్తవుతోంది. ఈ సందర్భంగా సోమవారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి లోకేశ్ కుమార్‌తో కలిసి రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో కుప్పకూలిన రెవెన్యూ వ్యవస్థను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పునర్నిర్మిస్తున్నామని, భూభారతి చట్టం రాష్ట్ర చరిత్రలో ఒక కీలక సంస్కరణ అని మంత్రి అన్నారు. భూభారతి చట్టం కేవలం ఒక చట్టం మాత్రమే కాకుండా రాష్ట్రంలో భూహక్కుల రక్షణకు కొత్త శకానికి నాంది పలికిందన్నారు. గతంలో ధరణి పోర్టల్ కారణంగా ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తుచేస్తూ, ఆ పరిస్థితులను పూర్తిగా మార్చేందుకు ఈ సంస్కరణలను తీసుకువచ్చినట్లు తెలిపారు. గత ఏడాది ఏప్రిల్ 14న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా భూభారతి పోర్టల్ ప్రారంభించామని మంత్రి గుర్తు చేశారు. ఈ పోర్టల్ ద్వారా భూ వివాదాలను తగ్గిస్తూ, సాధారణ ప్రజలకు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరాన్ని తగ్గించామని చెప్పారు. భూభారతి పోర్టల్ ప్రారంభించిన ఏడాదిలోపే 5.20 కోట్లకు పైగా సందర్శనలు నమోదయ్యాయని, సుమారు 67 లక్షల మంది వినియోగదారులు లాగిన్ అయ్యారన్నారు. ఇప్పటివరకు 3.80 లక్షల పాస్‌బుక్‌లు జారీ చేసినట్లు మంత్రి వివరించారు. పాత సర్వే పద్ధతులకు స్వస్తి పలుకుతూ ఆధునిక సాంకేతికతతో రీసర్వే చేపడుతున్నామని తెలిపారు. రోవర్స్ వంటి ఆధునిక పరికరాలను వినియోగిస్తూ భూముల కొలతలు చేపడుతున్నామన్నారు. ఇప్పటివరకు 411 రోవర్స్ కొనుగోలు చేయగా, మరిన్ని 400 కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి సర్వే నెంబర్‌కు ప్రత్యేక భూధార్ నెంబర్ కేటాయించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. నిజాం కాలం నుంచి నక్షాలు



లేని 378 గ్రామాల్లో రీసర్వే చేపట్టగా, ఇప్పటికే 5 గ్రామాల్లో పూర్తి చేసి భూధార్ నెంబర్లు కేటాయించామన్నారు. రెవెన్యూ, సర్వే, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, ఎన్ఐసి సహకారంతో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ రూపొందించినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఐదు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తుండగా, త్వరలో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు చెప్పారు. భూ సర్వే కోసం 5,520 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు లైసెన్సులు జారీ చేసి, ప్రతి మండలానికి 4–6 మంది సర్వేయర్లను నియమించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 10,984 రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి, జిపిఓల నియామకం కూడా పూర్తయిందన్నారు. మంత్రి చివరగా, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని, భూభారతి చట్టం ద్వారా తెలంగాణలో భూ పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామన్నారు.

## సిసిటివి కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం



**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో 75 సీసీ కెమెరాల అనుసంధానంతో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సోమవారం జిల్లా ఎస్‌పి కె. నరసింహ, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిఘా నేత్రాలతో నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, వ్యాపారులు ముందుకు రావాలన్నారు. ప్రజల సంరక్షణలో పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందన్నారు. నేరాల నివారణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఒక్కొక్క సీసీ కెమెరా 100 నేత్రాలు, పోలీసులతో సమానమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఓ జయప్రకాష్ రెడ్డి, డిఎస్‌పి ప్రసన్న కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకట్, మున్సిపల్ కమీషనర్ హన్మంతరెడ్డి పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై సత్వర పరిష్కారం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె. సీతారామారావు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. భూ సమస్యకు సంబంధించి మొత్తం 40 దరఖాస్తులు రాగా, మున్సిపాలిటి 13, డిపిఓ 5, డిడబ్లుఓ 2, మిగిలిన 35 దరఖాస్తులు వివిధ శాఖలకు చెందినవని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ సుదర్శన్ రెడ్డి, ఆర్‌డిఓ వేణుమాధవ్, అడిషనల్ పిడి సురేష్ పాల్గొన్నారు.


## ప్రజా సంక్షేమం హక్కుల పరిరక్షణకు ఉద్యమాలు : లొడంగి



**ప్రజాపక్షం/చిట్యాల:** ప్రజా ఉద్యమాలలో ముందుండే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పార్టీకి విరాళాలు అందించి సహకరించాలని ఆ పార్టీ నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ కోరారు. మున్సిపాలిటి కేంద్రంలో సోమవారం పార్టీకి నిధుల సేకరణ కోసం చేపట్టిన ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు విద్య, వైద్యం,రవాణా వంటి కీలక రంగాలను ప్రైవేట్ సంస్థలకు అప్పటించడం వల్ల సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సిపిఐ నిరంతరం ఉద్యమాలు కొనసాగిస్తుందని, ఈ పోరాటాలకు ప్రజలు ఆర్థికంగా సమకరించాలని విజప్తి చేశారు. అలాగే రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఎండి అక్బర్, సహాయ కార్యదర్శి జిల్లా సత్యం, పట్టణ కార్యదర్శి షేక్ షరీఫ్, నాయకులు బొలుగూరి లింగయ్య, పి దేవేందర్, సత్తయ్య, రవి, కృష్ణ పాల్గొన్నారు.

## కార్మికుల అక్రమ తొలగింపులు ఆపాలి

### పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి: రామస్వామి



**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండలం గ్రామ పంచాయతీ కార్మికుల అక్రమ తొలగింపులను ఆపాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ కార్మికులతో కలిసి సోమవారం స్థానిక ఎంపిడివో కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిపి కార్మికులపై అధికారుల, రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని, గత పదిహేను సంవత్సరాలుగా ఉన్న కార్మికులను తొలగించి కొత్త వారిని చేర్చుకోవడం అన్యాయం అని ఆయన అన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో జిపి కార్మికులు జీతాలు కూడా సకాలంలో అందడం లేదని తక్షణమే జిపి కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, కనీస వేతనం అమలు చేయాలని లేని పక్షంలో ఏప్రిల్ 25 నుండి నిరవధిక సమ్మె చేయడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. తక్షణమే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు నల్ల దేవరాజ్, లక్ష్మ, ముత్తయ్య, అంజమ్మ, మల్లమ్మ, అలివేలు, రవి తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి కొరత లేకుండా ప్రణాళికలు



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనపై మండల అధికారులతో , ప్రజా ప్రతినిధులతో కలిసి దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలు నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ బాలునాయక్ మాట్లాడుతూ బాధ్యతలు చేపట్టిన సర్పంచ్‌లు తమ తమ గ్రామాలలో క్షేత్ర స్థాయిలో పర్యటించి మౌలిక వసతులు , ప్రజల అవసరాలను సమగ్రంగా గుర్తించాలని సూచించారు. పంచాయతీ ఆదాయం , బడ్జెట్‌కు అనుగుణంగా గ్రామాలలో ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలానికి సంబంధించి 15 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను ఎంఎల్ఏ పంపిణి చేశారు. ఈ సమావేశంలో ఎంపిడివో పార్వతి, తహశీల్దార్ మధుసూధన్‌రెడ్డి, సర్పంచ్‌లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంచాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్




**ప్రజాపక్షం/నల్లగొండ :** రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రోడ్ సేఫ్టీ అవేర్నెస్ ట్రీ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించిన నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సోమవారం క్లాక్ టవర్ సెంటర్లో రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాల ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రోడ్డు సేఫ్టీ అవగాహన కార్యక్రమాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు.జీవితం విలువైనది అనే సందేశంతో రోడ్డు సేఫ్టీ వృక్షాన్ని ప్రతీకగా చూపిస్తూ, మనిషి జీవితాన్ని రక్షించుకోవడం ఎంత ముఖ్యమో వివరిస్తూ అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరిస్తేనే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. హెల్మెట్ ధరించినప్పుడు ప్రమాదం జరిగినా ఎలా రక్షణ లభిస్తుందో, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు ఎదురవుతాయో ప్రదర్శన ద్వారా ప్రజలకు స్పష్టంగా వివరించారు.ఈ కార్యక్రమంలో రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ వాణి,డిటిఓ లావణ్య,వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి,మోటారు ఇన్‌స్పెక్టర్లు కొండయ్య ,మల్లికార్జున్, భాస్కర్ రెడ్డి,ఉషశ్రీ,సోనిప్రియ,చిరంజీవి,గోపీనాథ్, నరేందర్ రెడ్డి, రవి పాల్గొన్నారు.

**కొనుగోలు కేంద్రాలను సందర్శించాలి :** మండలాల ప్రత్యేక అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను తప్పనిసరిగా సందర్శించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సందర్భంగా రబి ధాన్యం సేకరణ పై మాట్లాడుతూ రబీ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో అన్ని మండలాల్లో అధికారులు క్రమం తప్పకుండా ఫీల్డ్ విజిట్ చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని,ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు.

**వనమహోత్సవంలో మొక్కలు నాటే లక్ష్యం :** వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈవాన కాలం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. అలాగే 2027 సంవత్సరానికి గాను ఆయా శాఖల వారీగా మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించుకుని మొక్కలు పెంచాలని చెప్పారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వనమహోత్సవం కింద ఈ సంవత్సరం నాటనున్న మొక్కలు ,2027 వన మహోత్సవానికి అవసరమైన మొక్కల పెంపకంపై ప్రణాళికతో సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో మొక్కల పెంపకం కార్యక్రమం వేగంగా కొనసాగుతున్నదని ,2025 /26 సంవత్సరం జిల్లాలో మొత్తం 68 లక్షల మొక్కలకు గాను 90 శాతం మొక్కలు నాటడం జరిగిందని, 2026/27కు సంబంధించి డిఆర్డిఓ ద్వారానే 32 లక్షల 12 వేల మొక్కలు నాటినట్లు వెల్లడించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు భద్రత కమిటీలు



**ప్రజాపక్షం/సూర్యాపేట :** రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లాలో గ్రామ, వార్డుల వారీగా రోడ్డు భద్రత కమిటిలను ఏర్పాటు చేశామని జిల్లా ఎస్‌పి కె. నరసింహ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమాన్ని సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కమిటిల వారీగా బాధ్యతగా పనిచేసి పనిచేయాలన్నారు. ప్రతి ప్రయాణం సురక్షిత గమ్యం చేరాలే ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటిస్తామని అన్ని కమిటీలు తీర్మానం చేసుకోవాలని సూచించారు. సామాజిక సేవలో, ప్రజల భద్రతలో జిల్లా పోలీసులు పటిష్టంగా పనిచేయడం జరుగుతుందన్నారు. సూర్యాపేట జిల్లాలో 2024 రోడ్డు ప్రమాదాల్లో 278 మంది మరణించగా 2025లో ఆ సంఖ్యని 230కి తగ్గించామన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, డిఎస్‌పి ప్రసన్న కుమార్, ఆర్‌టిఓ జయప్రకాష్ రెడ్డి, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేద్దాం : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా నేడు నిర్వహించే ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వివిధ ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులతో ఎమ్మెల్యే ప్రత్యేక సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. అంబేద్కర్ ఆశయాలు కేవలం ఒక్క వర్గానికే పరిమితం కావని, సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధికి ఆయన వేసిన పునాదులే నేడు మనకు మార్గదర్శకాలని కొనియాడారు. నేడు నిర్వహించే అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లు హాజరుకానున్నట్లు తెలిపారు. రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులు కలిసికట్టుగా ఉండి జయంతి వేడుకలను వైభవంగా, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అగ్నిమాపక శాఖ నియమాలు పాటించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ కె. సీతారామారావు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** అగ్నిమాపక శాఖ నియమాలను పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా హోటల్ నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె. సీతారామారావు అన్నారు. సోమవారం అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అగ్నిమాపక నివారణ పట్ల ముద్రించిన అవగాహన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటల్స్‌లో అగ్నిమాపక పరికరాలు అన్ని వేళలా పనిచేసేలా ఉంచాలన్నారు. ప్రతి అంతస్తులో మొదటి ద్వారాలు అగ్నిమాపక పరికరాలు తెరిచే ఎస్కేప్ ప్లాన్ ఉండాలని చెప్పారు. ఎయిర్ కండీషన్ ద్వారా మంటలు వ్యాప్తి చెందకుండా డ్యాంపర్స్ ఏర్పాటు చేయాలని వాటిని ఆటోమెటిక్ డిటెక్టవ్ సిస్టమ్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. విద్యుత్ వైరింగ్, స్విచ్‌లు, ఇతర పరికరాలు క్రమం తప్పకుండా చెక్ చేసుకోవాలని ఏదైనా లోపాలు ఉంటే వెంటనే సరి చేసుకోవాలన్నారు. హోటల్ సిబ్బంది అందరికి ఎక్విప్మెంట్‌పై శిక్షణ ఇవ్వాలన్నారు. తరచు మాక్‌డ్రిల్స్ నిర్వహించాలని, అగ్నిమాపక లాంటి అత్యవసర సమయాలలో ఏ విధంగా ప్రవర్తించాలో శిక్షణ ఇవ్వాలన్నారు. వంట గదిలో అగ్నిప్రమాదం జరగకుండా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి జానయ్య, ముఖ్య ప్రణాళిక అధికారి కిషన్, జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు, అడిషనల్ పిడి సురేష్, డిఎంఓ నాగేశ్వర శర్మ, ఏఓ సుదర్శన్ రెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అధికారి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## దళారులు రైతులను మోసం చేస్తే చర్యలు

### ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. ఆయన సోమవారం మండల కేంద్రంలో వంగపల్లి పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ భూమండ్ల జయమ్మ శ్రీనివాస్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో పారదర్శకంగా ధాన్యం కొనుగోలు నిర్వహించడంతోపాటు, రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడంతో పాటు, విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను కూడా వెంటనే ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. దళారులు రైతులను మోసం చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ధాన్యం అమ్మిన రైతుల ఖాతాల్లో డబ్బులు త్వరితగతిన జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్టర్ తహసిల్దార్ రాజేంద్రప్రసాద్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కొంతం మోహన్ రెడ్డి, సర్పంచులు పచ్చిమట్ల జయమ్మ మదార్ గౌడ్, ప్రదీప్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేష్ పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై టిఎస్‌యుటిఎఫ్ రాజీలేని పోరాటం

**ప్రజాపక్షం/కోదాడ:** విద్యారంగ సమస్యలపై టిఎస్‌యుటిఎఫ్ రాజీలేని పోరాటం చేస్తుందని టిఎస్ యూటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వర రావు, పాండురంగచారి లు అన్నారు. సోమవారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో టిఎస్‌యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యూటిఎఫ్ ఆవిర్భావం నుండి నేటి వరకు విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికై కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు యూటిఎఫ్ సభ్యులు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా అనంతగిరి ఎంఈవో తల్లాడ శ్రీనివాసరావు, చిలుకూరు ఎంఈవో నర్సింహారెడ్డిలు యూటిఎఫ్ చేస్తున్న పోరాటాలను అభినందించారు. టిఏ జనార్ధన్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ కార్యదర్శి జ్యోతి, సీనియర్ నాయకులు చందా శ్రీనివాసరావు, సనత్‌కుమార్, పిడతల శ్రీనివాస్, ఉపేందర్, రామారావు, లక్ష్మి నారాయణ, శ్రీదేవి, మండవ ఉపేందర్, సత్తార్, బాబు, విక్రమ్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, బాలరాజు, శ్రీనివాసచారి, శ్రీరంగారాజు, సైదిరెడ్డి, నందా, కిషోర్ పాల్గొన్నారు.



## ప్రమాదాల నివారణలో భాగస్వాములవ్వాలి




**ప్రజాపక్షం/హాలియా:** రోడ్డు ప్రమాదాల నివారణలో అందరూ భాగస్వాములు కావాలని హాలియా ఎస్ఐ బండి సాయి ప్రశాంత్ పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా నల్గొండ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కొత్తపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. హాలియా ఎస్ఐ సాయి ప్రశాంత్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యల గురించి జిల్లా ఎస్పీ సూచించిన సూచనలను వివరించారు. ప్రమాదాలు జరగడానికి గల కారణాలను ఆయన వివరిస్తూ ప్రజలు రహదారులపై ధాన్యాన్ని ఆరబోయడం వలన రాత్రి వేళలు పలు ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. కొత్తపల్లి వద్ద నేషనల్ హైవే లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు ఈ సమావేశంలో జాతీయ రహదారి ఏఈ కి విన్నవించారు. దీనిపై ఆమె స్పందిస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బ్రహ్మానంద రెడ్డి, వార్డ్ మెంబర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/త్రిపురారం:** మండలంలోని మాటూరు గ్రామ పరిధిలో ఆదివారం సాయంత్రం బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం మిర్యాలగూడ మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన బొడ్డుపల్లి భద్రయ్య అడవిదేవులపల్లినుండి మిర్యాలగూడ వెళుతుండగా బైక్ అదుపుతప్పి కింద పడగా తలకు తీవ్రంగా గాంయ కావడంతో స్థానికులు వెంటనే 108 వాహనానికి సమాచారం అందించి మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## ఆలోచింపచేసిన ఫూలే నాటకం




**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** కుల నిర్మూలన సాంస్కృతకోత్సవాల్లో భాగంగా సింధూర కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రదర్శించిన జ్యోతిబాపూలే నాటకం వీక్షకులను ఆలోచింపజేసిందని సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్ కొనియాడారు. నాటకం డి.విజయ్ కుమార్ రచించగా పాటిబండ్ల ఆనందరావు దర్శకత్వం వహించారు. దాదాపు రెండున్నర గంటలు ప్రదర్శించిన నాటకం ప్రేక్షకులకు చైతన్య స్ఫూర్తినిచ్చిందని వినయ్‌కుమార్ తెలిపారు. అఖండ భారతదేశంలో 2500 సంవత్సరాలుగా, బుద్ధుని తర్వాత అలుముకున్న అజ్ఞానపు చీకట్లను ఛేదించిన అక్షర సూర్యులు పూలే దంపతులన్నారు. తెలంగాణ ప్రజా సంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, జ్యోతిబాపూలే తన సతీమణి సావిత్రిబాయి పూలేను మొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా తీర్చిదిద్ది రాళ్ల దెబ్బలు తింటూ, అవమానాలు భరిస్తూ విముక్తి మార్గం చాటిన సమతా మూర్తి పూలే అని అన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** మూడు నెలలుగా కొనసాగుతున్న పనులతో ఇబ్బందులు పడుతున్న ప్రతాప్‌నగర్, ఉప్పర్‌బస్తీవాసుల సమస్య పరిష్కారానికి ఖైరతాబాద్ బిఆర్ఎస్ ఇంచార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ మేరకు బస్తీవాసులు ఆయన్ను కలుసుకుని స్థానికంగా నెలకొన్న సమస్యలను వివరించారు. దీనిపై స్పందించిన మన్నె గోవర్ధన్‌రెడ్డి సంబంధిత అధికారి మేనేజర్ శివకుమార్‌తో ఫోన్లో మాట్లాడి సమస్యను అత్యవసరంగా పరిష్కరించి 8 ఇంచుల పైపులను తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. గోవర్ధన్‌రెడ్డిని కలిసిన వారిలో బస్తివాసులు రాము, ధనరాజ్, శౌరీరాజ్, ఆనంద్, సాయి కిరణ్ తదితరులు ఉన్నారు.

## కథా రచనలపై కార్యశాల

**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** తెలంగాణ సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో ఒక రోజు కథా రచనలపై కార్యశాల జరగనుంది. ఈ సదస్సులో కథలు ఎలా రాయాలి? కథా నిర్మాణ పద్ధతులు, కథలకు అంశాలను ఎలా ఎన్నుకోవాలి? అన్న వివిధ అంశాలపై ప్రముఖ కథకులు డాక్టర్ పెద్దింటి అశోక్ కుమార్, స్వర్ణ కిలారి, డాక్టర్ బివిఎన్ స్వామి సదస్సులో పాల్గొన్నవారికి మెలకువలు నేర్పిస్తారు. నేటితరం, యువతను సాహితీవేత్తలుగా తీర్చిదిద్దాలని భావిస్తున్న తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రముఖ కథా రచయితలతో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఉత్సాహవంతులైన యువతీ, యువకులు ఈ సదవకాశాన్ని ఊపయోగించుకోవాలని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి కోరారు. ఆసక్తి ఉన్నవారు సెల్: 9182445692 నెంబర్‌లో సంప్రదించి, వాట్సాప్ ద్వారా, వివరాలు ఏప్రిల్ 23 లోగా పంపించి, ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికే అవకాశం ఉంటుందని.. ఏప్రిల్ 28న జరిగే కథా కార్యాశాల వివరాలు త్వరలో ప్రకటిస్తామని బాలాచారి తెలిపారు.

## మోడల్ ఎంసెట్-నీట్ పరీక్షలు

20 నుంచి 28 వరకు నిర్వహణ.. పరీక్షల పోస్టర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/ముషీరాబాద్:** మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షలను ఈనెల 20 నుంచి 28 ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్షల పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. హైదరాబాద్ జిల్లా కమిట్లీ కార్యదర్శి కే.అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య పర్యవేక్షణలో పరీక్షలు జరగనున్నాయి. ఈ సందర్భంగా మీడియాతో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షలను నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామీణ, పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్: 9030881429/9515166907 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్, మమత, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు లెనిన్, ఉపాధ్యక్షులు రజనీకాంత్, నాగేందర్, ప్రవీణ్, ఆంజనేయులు, కార్తీక్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రావెల్స్ బస్సులో బంగారు ఆభరణాలు చోరీ

**ప్రజాపక్షం/గోషామహల్:** అనంతపురం నుంచి హైదరాబాద్ వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో భారీ చోరీ జరిగింది. కూకట్‌పల్లికి చెందిన కీర్తన అనే మహిళ తన కుటుంబ సభ్యులతో కలిసి రాత్రి మీనా ట్రావెల్స్ బస్సులో అనంతపురం నుంచి హైదరాబాద్కు బయలుదేరారు. ఉదయం బస్సు ఎంజిబిఎస్ చేరుకున్న తర్వాత హ్యాండ్ బ్యాగ్‌లో భద్రపరుచుకున్న సుమారు 20 తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించారు.వెంటనే బాధితులు అఫ్జల్‌గంజ్ పోలీసులకు ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కీర్తన ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రయాణం మధ్యలో ఈ దొంగతనం జరిగిందా? లేదంటే బస్సు దిగే సమయంలో జరిగిందా? అనే కోణంలో పోలీసులు విచారణ ముమ్మరం చేశారు.

## డిజిటల్ నెస్ట్ ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభం

**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** జైన్ క్యాపిటల్ పార్క్‌లో ఏర్పాటు చేసిన డిజిటల్ నెస్ట్ ఇంక్యుబేషన్ సెంటర్ ను రాష్ట్ర పట్టణాభివృద్ధి, పర్యాటక, క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఇగ్నైట్ 20/6 ప్రోగ్రాం పోస్టరును ఆయన సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ సందీప్‌రెడ్డి సంతోషంతో కలిసి ఆవిష్కరించారు. తెలంగాణ స్టార్టప్ ఎకోసిస్టమ్ అభివృద్ధి, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలపై తమ అభిప్రాయాలను ఆయన పంచుకున్నారు. గత 10 సంవత్సరాలుగా ఎంతో మంది విద్యార్థులకు డిజిటల్ మార్కెటింగ్ శిక్షణలో శిక్షణ అందించామని, నాలుగు పర్యాయాలు బెస్ట్ ఎడ్యుకేషన్ ఐకాన్ అవార్డును అందుకున్నామని సంస్థ వ్యవస్థాపకుడు,సిఇఒ సందీప్‌రెడ్డి సంతోషం తెలిపారు.

# 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'కు ప్రాధాన్యతనివ్వాలి

ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలి
వడదెబ్బ నివారణకు తగు చర్యలు తీసుకోవాలి
హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి




**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు' కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అధికారులకు తెలిపారు. జిల్లా కలక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న ఆమె వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి పాలన కార్యక్రమాలను జిల్లాలో శాఖల వారీగా సమీక్షించాలన్నారు. దీనిలో నిర్వహించే కార్యక్రమాలు విజయవంతం కావడానికి ఆమె అధికారులతో చర్చించి తగు సూచనలు జారీ చేశారు. ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలని అధికారులును ఆమె ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 594 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో గృహనిర్మాణ శాఖకు చెందినవి 481 కాగా ఫించన్లకు సంబంధించినవి 61, రెవెన్యూ శాఖకు చెందినవి 18, ఇతర శాఖలకు సంబంధించినవి 31ఆర్జీలు వచ్చాయని ఆమె చెప్పారు. వీటిని శాఖల వారీగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆమె ఆదేశించారు. జిల్లాలో రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతోందన్నారు. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నందున చిన్న పిల్లలు, వృద్ధులు మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బయటకు రావద్దని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వడదెబ్బ నివారణకోసం పలు మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ జి.జితేందర్ ఎడ్డి, గృహనిర్మాణ శాఖ పిడి అశోక్ చక్రవర్తి, ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి శ్రీధర్ ఇతర అధికారులు, ఆర్జీదారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు పారబోస్తే కఠిన చర్యలు

ఎంఎంసి కమిషనర్
వినయ్ కృష్ణా రెడ్డి





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ స్థలాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు పారబోస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్(ఎంఎంసి) టి. వినయ్ కృష్ణా రెడ్డి హెచ్చరించారు. 99 రోజుల కార్యాచరణ ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని శ్రీ సాయి ఎన్‌క్లేవ్, రాజశేఖర్ కాలనీ, మల్లయ్య నగర్, వీరారెడ్డి నగర్ ప్రాంతాల్లో అధికారులు, సిబ్బందితో కలిసి విస్తృతంగా పర్యటించారు. శ్రీ సాయి ఎన్‌క్లేవ్‌లో అర్బన్ బయోడైవర్సిటీ పనులను పరిశీలించిన కమిషనర్, ఆమోదించిన వర్క్ ఆర్డర్ ప్రకారం ప్రతి దశలో పనులు నాణ్యతతో అమలు చేయాలని ఆదేశించారు. రానున్న వన మహోత్సవానికి అవసరమైన మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులు, ఆటో డ్రైవర్లు, కాలనీవాసులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. రోడ్లపై నీటి నిల్వ సమస్యపై వెంటనే శుభ్రపరిచే చర్యలు తీసుకుని డ్రైనేజీ సదుపాయాలు మెరుగుపరచాలని ఆదేశించారు. రాజశేఖర్ కాలనీ చిల్డ్రన్స్ పార్క్‌ను సందర్శించిన కమిషనర్, పార్కులో పచ్చదనం పెంచేందుకు అదనపు మొక్కలు నాటాలని సూచించారు. వినియోగంలో లేని ప్లాంటర్ బాక్సులను తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. వాణిజ్య సంస్థల ట్రేడ్ లైసెన్సులపై సమీక్ష నిర్వహించి, ప్రతి దుకాణం తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే లైసెన్స్ పొందాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మల్లయ్య నగర్‌లో ప్రభుత్వ భూముల్లో నిర్మాణ వ్యర్థాలు పారవేయడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా చెత్త పారవేస్తున్న వారిపై వాహనాల సీజ్‌తో పాటు జరిమానాలు విధించాలని, సిసిటివి పర్యవేక్షణను పెంచాలని ఆదేశించారు. వీరారెడ్డి నగర్‌లో మహిళా సంఘ సభ్యులతో సమావేశమై కొత్త సంఘాల ఏర్పాటుకు ప్రోత్సహిస్తూ ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు.

## గ్యాస్ సిలిండర్ల అక్రమ నిల్వలపై పౌరసరఫరాల శాఖ విస్తృత దాడులు



రూ 1.50 కోట్ల విలువైన డొమెస్టిక్ సిలిండర్ల స్వాధీనం.-2,089 కేసులు నమోదు.

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్యాస్ సిలిండర్ల అక్రమ నిల్వ తరలింపు అడ్డుకట్ట వేసేందుకు పౌరసరఫరాల శాఖ దాడులను మరింత ఉధృత్తం చేసింది.గడిచిన నెల రోజులో అక్రమంగా తరలిస్తున్న, నిల్వ ఉంచిన 5,079 డొమెస్టిక్ సిలిండర్లు, మరో 70 చిన్న సిలిండర్లను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 1.50 కోట్ల ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా 2,089 కేసులు నమోదు చేయడంతో పాటు వీరిపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టారు. గ్యాస్ కొరత నేపథ్యంలో గ్యాస్ సరఫరాలో గృహ వినియోగదారులకి ఎలాంటి ఇబ్బంది కల్గకుండ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ నిరంతరం పర్యవేక్షిస్తోంది. ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు గ్యాస్ సిలిండర్లను అక్రమ నిల్వ, పక్కదారి పట్టించే వారిపై అధికారులు నిఘా పెట్టి , ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. గృహ వినియోగ సిలిండర్ల సరఫరా ప్రక్రియ నిబంధనల ప్రకారం సకాలంలో జరిగేందుకు బుకింగ్స్ ,డెలివరీలను కమాండ్ కంట్రోల్ ద్వారా ఆయా ఏజెన్సీ లతో రోజువారీగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. గ్యాస్ సిలిండర్ల అక్రమ నిల్వ, తరలింపు, డెలివరీ లో జాప్యంపై పౌర సరఫరాల సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1967 కు ఫిర్యాదు చేయాలని ప్రభుత్వం సూచించింది.

# అంబేద్కర్ స్ఫూర్తిని మరిచిపోతున్నారు

కులవివక్ష పోరాట సమితి
అధ్యక్షుడు స్కైలాబ్‌బాబు




**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** అంబేద్కర్‌కు భక్తులు అవుతున్నారు.. కానీ అంబేద్కర్ అందించిన స్ఫూర్తిని మరిచిపోతున్నారని కులవివక్ష పోరాట సమితి అధ్యక్షుడు స్కైలాబ్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మనువాదంరాజ్యాంగం అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. మనుషులంతా ఒక్కటే అన్నది సమాజంలో అమలు కావడం లేదన్నారు. మనుస్మృతి వివక్షను ప్రోత్సహిస్తుందని ఆరోపించారు. సమాజంలో అంతరాలు ఉన్నాయని.. పాలకులు సనాతన మనుస్మృతి ఆధారంగా పాలిస్తున్నారని విమర్శించారు. అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలే కాని విగ్రహాలకు పూలమాలలు వేయడం కాదని అన్నారు. మానవీయత, త్యాగమయ జీవితాలకు జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే ఆదర్శమన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా రద్దు చేయడం సరికాదన్నారు. కులం వారిగా చర్చిలు ఉన్నాయన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి దళిత క్రైస్తవులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఆవాజ్ ప్రతినిధి ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ, దేశభక్తిదైవభక్తి రెండు ఒక్కటే అని బిజెపి అంటుందని.. అయితే జియోనిజంను ఇజ్రాయిల్ అనుసరిస్తుందని.. ఇక్కడ బిజెపి ప్రభుత్వం మనువాదాన్ని అనుసరిస్తుందని పేర్కొన్నారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరత్వం, రాజ్యాంగం విలువలు సమాజంలో అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో పాలడుగు భాస్కర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## బీపీ మండల్ సిఫారసులను అమలు చేయాలి



యాదవ జెఎసి స్టేట్ చైర్మన్ డాక్టర్
దాసరి అజయ్ కుమార్ డిమాండ్

**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీపీ మండల్ సిఫారసులను అమలు చేయాలని యాదవ జేఏసీ స్టేట్ చైర్మన్ డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యాదవ జేఏసీ ఆధ్వర్యంలో యాదవ రాజకీయ సదస్సును నిర్వహించారు. అనంతరం బీపీ మండల్( బిందేశ్వర ప్రసాద్ మండల్)44వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలో బీపీ మండల్ ఉద్యమం గ్రామ గ్రామాన చేపడతామన్నారు. ట్యాంక్‌బండ్ మీద బీపీ మండల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలో బీపీ మండల్ ఉద్యమం ద్వారానే యాదవులు ముఖ్యమంత్రి అయ్యారన్నారు. తెలంగాణలో కూడా మరో మండల్ ఉద్యమం చేపడతామన్నారు. ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను కల్పించిన ఘనత బీపీ మండల్ కే దక్కుతుందన్నారు. బీపీ మండల్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాలన్నారు. పార్లమెంట్‌లో బీపీ మండల్ విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు.

# దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదా కల్పించాలి

1950 రాష్ట్రపతి ఉత్తర్వులను
రద్దు చేయాలి
ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు
మందకృష్ణ మాదిగ డిమాండ్




**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** దళిత క్రైస్తవుల పట్ల వివక్ష చూపుతున్న 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని లేదంటే వాటి నుంచి దళితులకు మినహాయింపునిచ్చి ఎస్సీ హోదా కల్పించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివిధ సంఘాల నాయకుల ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు.. మతం మారినంత మాత్రాన దళితుల సామాజిక హోదా ఎలా మారుతుంది? అని ప్రశ్నించారు. ఒసి, బిసి, ఎస్టిలకు లేని మతం ఆంక్షలు కేవలం ఎస్‌సిలకే వర్తింపజేయడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 25లను ఉల్లంఘించడమేనని మండిపడ్డారు. సిక్కు, బౌద్ధ మతాల్లోకి మారిన దళితులకు ఎస్సీ హోదా కొనసాగిస్తున్నపుడు, క్రైస్తవంలోకి మారిన వారికి ఎందుకు నిరాకరిస్తున్నారని నిలదీశారు. 1950లో అప్పటి పాలకుల కుట్రల వల్లే దళితులు తమ మత స్వేచ్ఛను కోల్పోయారని ఆరోపించారు. దళితులకు చదువు, వైద్యం అందని రోజుల్లో క్రైస్తవ మిషనరీలు అండగా నిలిచాయని నాయకులు గుర్తు చేశారు. 'ఒకనాడు గుడిలోకి రానివ్వలేదు, నేడు మరో దేవాలయానికి వెళ్లొద్దని దళితులను అవమానిస్తున్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన మహాత్మా గాంధీ, జ్యోతిరావు పూలే, అంబేద్కర్ వంటి మహనీయుల ఆశయాలకు విరుద్ధంగా బ్రాహ్మణవాద శక్తులు నేటికీ అడ్డంకులు సృష్టిస్తున్నాయని విమర్శించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ వంటి వీరులనే అవమానించిన చరిత్ర వారిదని గుర్తు చేశారు. అయోధ్యలో అన్ని కులాలకూ అర్చకత్వం ఉండాలని, సామాజిక సమానత్వం కేవలం మాటల్లో కాకుండా అమలులో ఉండాలని డిమాండ్ చేశారు. రామానుజాచార్యుల స్ఫూర్తితో అయోధ్య రామమందిర గర్భగుడిలో అన్ని వర్గాల (ఎస్‌సి, ఎస్‌టి, బిసి) వారు అర్చకులుగా ఉండాలని, కేవలం బ్రాహ్మణులకే ఆ అధికారం ఉండటం సమానత్వానికి విరుద్ధమని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చొరవ తీసుకుని 1950 ఉత్తర్వులను రద్దు చేసే వరకు ఈ ఉద్యమం ఆగదని నాయకులు స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ, ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్ మాదిగ, ఎంఎస్‌పి కోఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి మాదిగ, ఎంఎంఎస్ నాయకురాలు జెపి లత మాదిగ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కార్తీక్ మాదిగ, టీవీ నరసింహ మాదిగ, కొమ్ము శేఖర్, పల్లెర్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఐఎవిఐఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షులుగా సురేశ్,కార్యదర్శిగా అనిల్‌కుమార్




**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్:** అఖిల భారత ఆర్యవైశ్య పారిశ్రామికవేత్తల ఫోరం (ఎఐఎవిఐఎఫ్) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నట్టు ఫోరం పూర్వ అధ్యక్షులు పబ్బిశెట్టి రాంబాబు తెలిపారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఫోరం నూతన అధ్యక్షులుగా చారుగుండ్ల భవాని సురేశ్, ప్రధానకార్యదర్శిగా పడకంటి అనిల్ కుమార్, ఉపాధ్యక్షులుగా ఎర్రం బాలకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా వంశీ నెల్లంటి, కోశాధికారిగా బొగ్గారి శివకుమార్ జాతీయ సర్వసభ్య సమావేశంలో ఎన్నికైనట్టు తెలిపారు. వీరు రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతారని పేర్కొన్నారు. చారుగుండ్ల భవాని సురేశ్ మాట్లాడుతూ తెలంగాణ, ఎపి, తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు అనేక రాష్ట్రాల నుంచి ప్రస్తుతం 500 మంది వైశ్యపారిశ్రామికవేత్తలు ఫోరంలో సభ్యులుగా ఉన్నారని తెలిపారు. వీరి వ్యాపారాలతో ఏడాదికి రూ.50వేల కోట్ల టర్నోవర్ జరుగుతుందన్నారు. ఏడాదికి రూ.100 కోట్లతో సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. పారిశ్రామికరంగాన్ని బలోపేతం చేయడమే తమ ఫోరం లక్ష్యమని ఆయన తెలిపారు. సమావేశంలో ఫోరం సీనియర్ సభ్యులు విజయ్ కుమార్‌గుప్తా, బాలకృష్ణ, కిశోర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఆర్టిజన్ల నిరవధిక సమ్మె

**ప్రజాపక్షం/మలక్‌పేట్:** విద్యుత్ ఆర్టిజన్ల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ సౌత్ సర్కిల్ చైర్మన్ ఎం.రాము స్పష్టం చేశారు. సోషల్ మీడియా కన్వీనర్ సుధాగాని సురేష్ గౌడ్ కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ ఆస్మాన్‌ఘడ్ డివిజన్ ఆధ్వర్యంలో, విద్యుత్ ఆర్టిజన్, అన్మ్యాన్డ్, పీస్ రేటు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆస్మాన్గడ్ విద్యుత్ కార్యాలయం వద్ద ఆరవ రోజు నిరవధిక సమ్మెను పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సౌత్ సర్కిల్ ఆస్మాన్గడ్ డివిజన్లో సమ్మె 6వ రోజుకు చేరి విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు. ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం, మేనేజ్మెంట్ నిర్లక్ష్యంగా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సోమవారం లేబర్ కమిషన్తో రాష్ట్ర జేఏసీ చర్చలు జరిగినప్పటికీ, ఎలాంటి స్పష్టమైన నిర్ణయాలు రాలేదని, చర్చలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. అయినప్పటికీ సమ్మె యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. తిరిగి 17వ తేదీన చర్చలకు లేబర్ కమిషన్ ఆహ్వానం ఇచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సుభాష్, ఆంజనేయులు, ముజీబ్, షఫీ, సుజాత, అశోక్, శ్రీకాంత్, మహమూద్, హాలియా నాయక్ రమేష్ నాయక్ బాయి, ఫయిం బాయ్, లక్ష్మీ నారాయణ, గాబ్రియల్, మహ్మద్ తైసిన్, ప్రభాకర్, దాస్, సైయద్ షఫీ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## హరికిరణ్‌ను టార్గెట్ చేయడంపై స్పందించాలి

రాష్ట్ర ప్రభుత్వానికి రాచాల డిమాండ్



**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరికిరణ్‌ను టార్గెట్ చేస్తూ ఆయనపై తప్పుడు ప్రచారం, కుట్రల వ్యవహారంలో ప్రభుత్వం స్పందించి విచారణ చేపట్టాలని బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. హరికిరణ్‌పై ట్రోల్ చేస్తూ పెన్‌డౌన్ చేస్తామని అక్రమ పదోన్నతి పొందిన లచ్చిరెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదన్నారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విధులు నిర్వర్తించకుండా నాలుగేళ్లు కనపడకుండాపోయిన లచ్చిరెడ్డి అక్రమ వేతనం, అక్రమ ప్రమోషన్ పొందిన విషయంపై తాము గతంలోనే ఫిర్యాదు చేశామన్నారు. లచ్చిరెడ్డి అక్రమ పదోన్నతి వ్యవహారంలో ప్రభుత్వం స్పందించకపోతే హైకోర్టు రిట్ వేస్తామని తెలిపారు. కాగా, ఎనిమిదేళ్లకుపైగా నోచని ఎక్సైజ్ కానిస్టేబుళ్ల బదిలీల ప్రక్రియను తెలంగాణ ప్రజా ప్రభుత్వం చేపట్టడం హర్షణీయమని, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. జెఎసి నేతలు రవీందర్‌గౌడ్, వినోద్ సాగర్, దివాకర్ గౌడ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# సన్‌రైజర్స్‌కు రెండో విజయం..!



పంతొమ్మిదో సీజన్‌లో వరస ఓటములకు సన్‌రైజర్స్ హైదరాబాద్ గుడ్‌బై చెప్పేసింది. సొంత గడ్డపై అదరగొట్టిన ఆరెంజ్ ఆర్మీ టాపర్ రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తుగా ఓడించింది. ఇషాన్ కిషన్(91) బ్యాటుతో విధ్వంసం సృష్టిస్తే.. కుర్ర పేసర్లు ప్రఫుల్ హింగే(4–34), షకీబ్ హుస్సేన్(4–24)లు రాజస్థాన్ బ్యాటర్లను బెంబేలెత్తించారు. ప్రఫుల్ ఒకే ఓవర్లో మూడు వికెట్లతో టాప్‌ఆర్డర్‌ను కూల్చగా.. టెయిలెండర్లను హుస్సేన్ మడతపెట్టేశాడు. అంతే.. సన్‌రైజర్స్ జట్టు ఉప్పల్ మైదానంలో సగర్వంగా, సంబురంగా గెలుపు తోవ తొక్కింది. ఐపిఎల్‌లో బ్యాటర్లనే నమ్ముకొనే సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను ఈసారి బౌలర్లు గెలిపించారు. ఈసీజన్‌లో ఓడిన మూడు మ్యాచుల్లో బౌలర్లే విలన్లు.. కాగా ఉప్పల్‌స్టేడియంలో మాత్రం పోటీ పడి వికెట్లు తీసి రాజస్థాన్ రాయల్స్‌కు తొలి ఓటమి రుచి చూపించారు. 217 పరుగుల ఛేదనలో తొలి ఓవర్‌లోనే ప్రఫుల్ హింగే (4–34) మూడు వికెట్లతో చరిత్ర సృష్టించాడు. మొదటి బంతికే వైభవ్ సూర్యవంశీ(0)ని బోల్తా కొట్టించాడీ కుర్రాడు. పెద్ద షాట్ ఆడాలనుకున్న వైభవ్ బంతిని వికెట్ల వెనకాల గాల్లోకి లేపగా.. వికెట్ కీపర్ సలీల్ అరోరా ఒడుపుగా అందుకున్నాడు. ఆ షాక్ నుంచి తేరుకునేలోపే ధ్రువ్ జరెల్(0)ను బౌల్డ్ చేశాడీ పేసర్. అంతేనా.. అరంగేట్రం మ్యాచ్ ఆడుతున్న ప్రిటోరియస్(0)ను ఔట్ చేసి రాజస్థాన్‌ను గట్టి దెబ్బ కొట్టాడు ప్రఫుల్. ఆ తర్వాతి ఓవర్‌లో యశస్వీ జైస్వాల్(1)ను షకీబ్ హుస్సేన్ ఔట్ చేయడంతో 2 పరుగులకే రాజస్థాన్ నాలుగు కీలక వికెట్లు కోల్పోయింది. ఇక ఆ జట్టు చిత్తుగా ఓడడం ఖాయమనుకున్న వేళ రవీంద్ర జడేజా (48), డొనొవాన్ ఫెరీరా(69) క్రీజులో పాతుకుపోయారు. సన్‌రైజర్స్ బౌలర్లను విసిగిస్తూ.. సింగిల్స్, డబుల్స్ దొంగిలించారు. కుదురుకున్నాక గేర్ మార్చిన ఫెరీరా ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పిన ఈ జోడీని ఫెరీరాను బౌల్డ్ చేసి విడదీశాడు హుస్సేన్. కాసేపటికే మలింగ ఓవర్‌లో జడ్డూ వెనుదిరిగాడు. మరోసారి బంతి అందుకున్న హుస్సేన్ రెండు వికెట్లు తీసినా.. ఆఖర్లో తుషార్ దేశ్‌పాండే(25) సిక్సర్లతో హోరెత్తించాడు. కానీ, మలింగ ఓవర్లో షాట్ గురి తప్పగా ఇషాన్ చేతికి చిక్కాడు. దాంతో.. రాజస్థాన్ 159కి కుప్పకూలగా 57 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ గెలుపొందింది.

## మహిళల టి–20 వరల్డ్ కప్...
## రూ.82 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటించిన ఐసిసి




**దుబాయ్:** ఈ ఏడాది జూన్‌లో మహిళల టి20 వరల్డ్ కప్ జరగనున్నది. దీని కోసం సోమవారం ఎసిసి ప్రైజ్‌మనీ ప్రకటించింది. వరల్డ్ కప్ విజేతలకు అందజేసే ప్రైజ్‌మనీని రికార్డు స్థాయిలో పెంచేసింది. రెండు నెలల పాటు ఇంగ్లండ్, వేల్స్‌లో జరిగే వరల్డ్ కప్ కోసం సుమారు రూ.82 కోట్ల వరల్డ్ కప్ ప్రకటించింది ఐసిసి. గత ఎడిషన్‌తో పోలిస్తే సుమారు 10 శాతం ప్రైజ్‌మనీ పెంచారు. ఈసారి ఈ టోర్నీలో మొత్తం 12 జట్లు పాల్గొననున్నాయి. 2024లో కేవలం 10 జట్లు మాత్రమే పాల్గొన్నాయి. జూన్ 12 నుంచి జూలై 5వ తేదీ వరకు ఏడు వేదికల్లో టోర్నీ జరగనున్నది. లార్డ్స్ మైదానంలో ఫైనల్ మ్యాచ్ ఆడుతారు. గత వరల్డ్ కప్ ప్రైజ్‌మనీ రూ.74 కోట్లు కాగా, ఈసారి 82 కోట్లు ఇవ్వనున్నారు. వరల్డ్ కప్ విజేతలు ఈసారి రూ.21.8 కోట్ల ప్రైజ్మనీ గెలుచుకుంటారు. ఇక రన్నరప్‌కు రూ.10 కోట్లు ఇవ్వనున్నారు. సెమీఫైనల్లోకి ఎంటరైన జట్లకు రూ.6.29 కోట్లు ఇవ్వనున్నారు. ఇక గ్రూపు మ్యాచ్ ఆడిన ప్రతి జట్టుకు రూ.29 లక్షలు ఇవ్వనున్నారు. ప్రతి జట్టుకు కనీసం రూ.రెండు కోట్లు దక్కే అవకాశాలు ఉన్నట్లు ఐసిసి తన ప్రకటనలో పేర్కొన్నది. జూన్ 12న బర్మింగ్‌హోమ్‌లో శ్రీలంక, ఇంగ్లండ్ మధ్య ఫస్ట్ మ్యాచ్ జరుగుతుంది. ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇండియా, ఐర్లాండ్, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, పాకిస్థాన్, స్కాట్‌ల్యాండ్, దక్షిణాఫ్రికా, వెస్ట్ ఇండీస్ కూడా టోర్నీలో ఉన్నాయి. 24 రోజుల్లో మొత్తం 33 మ్యాచ్‌లు ఆడనున్నారు.





## రోయింగ్‌లో తెలంగాణ పతక జోరు

కటక్(ఒడిశా) వేదికగా జరిగిన ఆల్‌ఇండియా ఇండోర్ రోయింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ రోయర్లు పతక జోరు కనబరిచారు. నాలుగు రోజుల పాటు జరిగిన టోర్నీలో రెండు స్వర్ణాలు సహా మూడు రజతాలు, రెండు కాంస్య పతకాలతో మెరిశారు. అండర్–15 బాలికల పెయిర్లో వర్షిత, ధాత్రి, లావణ్య, దేవేంద్రమ్మతో కూడిన తెలంగాణ పసిడి సొంతం చేసుకుంది. అండర్–15 బాలుర పెయిర్లో యశ్వంత్, సాయితేజ రజతం దక్కించుకున్నారు. బాలుర రిలేలో యశ్వంత్, సాయితేజ వెండి పతకం దక్కించుకున్నారు.

యువతరంగం

## ఉపాధ్యాయ–విద్యార్థి సంబంధాన్ని
# పునర్నిర్వచిస్తున్న కృత్రిమ మేధ!



కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ – ఎఐ) విద్యారంగంలో ప్రవేశించడం కేవలం ఒక సాంకేతిక మార్పుగా మాత్రమే చూడలేం. ఇది విద్య యొక్క లక్ష్యాలు, బోధనా విధానాలు, మూల్యాంకన పద్ధతులు, ఉపాధ్యాయ–విద్యార్థి సంబంధాన్ని కూడా మౌలికంగా పునర్నిర్వచించే స్థాయిలో ఉంది. జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) 2020 ఊహించిన సాంకేతిక ఆధారిత విద్యా వ్యవస్థకు ఎఐ కీలక సాధనంగా మారింది. అయితే, ఎఐని కేవలం ఉపకరణంగా ఉపయోగించడమే సరిపోదు. దాన్ని సమర్థవంతంగా విద్యలో ఏకీకృతం చేయాలంటే మూడు 'ఎ'లుగా పేర్కొనే అడాప్షన్, అబ్జార్ప్షన్, అప్లికేషన్ (స్వీకరణ, అవగాహన, అనుసరణ) అనే దశలను పాఠ్యాంశాలలో భాగం చేయాల్సిన అవసరం ఉంది. ఈ విధానం విద్యను మేధోపరమైన, నైతికమైన, వాస్తవ ప్రపంచ సమస్యల పరిష్కార దిశగా మళ్లిస్తుంది. మూడు 'ఎ'లు విధానం అనేది సంప్రదాయంగా కంఠస్తం చేసే విద్య నుంచి ఎఐకు సిద్ధమైన బోధనా పద్ధతికి మారేందుకు రూపొందించిన ఒక నిర్మిత మార్గదర్శకం. మొదటి దశ అయిన 'స్వీకరణ' అంటే ఎఐ సాధనాలను అంగీకరించడం మరియు పరిచయం చేయడం. విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద భాషా నమూనాలు (ఎల్ఎల్ఎం), డిజిటల్ అసిస్టెంట్లు, చిత్ర సృష్టి సాధనాలు వంటి వాటితో సౌకర్యంగా పనిచేయగలగడం ఈ దశ లక్ష్యం. ఎఐ పట్ల ఉండే భయం లేదా అపోహలను తొలగించి, డిజిటల్ సాక్షరతను పెంపొందించడం ద్వారా సాంకేతికతను సహజమైన భాగంగా మార్చడం దీనిలో ప్రధాన ఉద్దేశ్యం. ఈ దశలో విద్యార్థులు ప్రశ్నలను సరైన విధంగా అడగడం, పనులను ఆటోమేషన్ ద్వారా వేగంగా చేయడం, కొత్త సాధనాలకు అనుకూలంగా మారడం వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేస్తారు.

రెండో దశ అయిన 'అవగాహన' మరింత లోతైనది. ఇది ఎఐ ఎలా పనిచేస్తుంది, దాని పరిమితులు ఏమిటి, అది ఇచ్చే సమాధానాలు ఎందుకు అలా ఉంటాయి అనే అంశాలను అర్థం చేసుకోవడంపై దృష్టి పెడుతుంది. ఎఐని ఒక బ్లాక్ బాక్స్‌గా కాకుండా, సంభావ్యతలు, డేటాపై ఆధారపడే వ్యవస్థగా గ్రహించడం ద్వారా విమర్శనాత్మక ఆలోచన పెరుగుతుంది. ఈ దశలో విద్యార్థులు ఎఐ ఇచ్చే సమాచారాన్ని నిర్ధారించుకోవడం, మూలాలను పరిశీలించడం, పక్షపాతం లేదా భ్రమాత్మక సమాధానాలను గుర్తించడం నేర్చుకుంటారు. అలాగే డేటా గోప్యత, అల్గోరిథమిక్ పక్షపాతం వంటి నైతిక అంశాలపై అవగాహన ఏర్పడుతుంది. ముఖ్యంగా, ఎప్పుడు ఎఐ సహాయం తీసుకోవాలి, ఎప్పుడు స్వంత మేధస్సును ఉపయోగించాలి అనే సమతుల్యతను ఈ దశ నేర్పుతుంది. మూడో దశ అయిన 'అనుసరణ' అనేది ఎఐని వాస్తవ ప్రపంచ సమస్యల పరిష్కారానికి ఉపయోగించే దశ. ఇది కేవలం వినియోగదారులుగా కాకుండా, విలువ సృష్టించగల ఆవిష్కర్తలుగా విద్యార్థులను తీర్చిదిద్దుతుంది. భూగోళశాస్త్రంలో వాతావరణ నమూనాల అంచనాలు, ఆర్థిక శాస్త్రంలో డేటా విశ్లేషణ, సామాజిక శాస్త్రాలలో విధాన ప్రభావాల అధ్యయనం వంటి రంగాలలో ఎఐని సహాయకుడిగా ఉపయోగించడం ఈ దశలో జరుగుతుంది. ఇక్కడ డిజైన్ థింకింగ్, డేటా విశ్లేషణ, ఆవిష్కరణ సామర్థ్యం వంటి నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి.

## పడిలేచిన కెరటం జాన్ డీర్



ఆర్థికంగా పూర్తిగా కూలిపోయిన ఒక కమ్మరి పనివాడు. తన జీవితాన్ని మళ్లీ నిర్మించుకోవాలనే నిర్ణయం తీసుకున్నాడు. అతని పేరు జాన్ డీర్. ఐదుగురు పిల్లల తండ్రి. 1837 సంవత్సరం నాటికి పూర్తిగా దివాలా తీశాడు. స్థిరమైన ఉపాధి లేదు. ఆదాయం లేదు. ఇలాంటి పరిస్థితి మరెవరికైనా ఎదురైతే, పూర్తిగా కుంగిపోయేవాళ్లేమో. కానీ, డీర్ అందరి కంటే భిన్నమైనవాడు. అందుకే, అతను తన పరిస్థితిని చివరి మజిలీగా భావించలేదు. అక్కడితో తన జీవితం ముగిసిపోయిందనే వాదనను అంగీకరించలేదు. కొత్త అవకాశాల కోసం అతను అమెరికా పశ్చిమ ప్రాంతాల వైపు ప్రయాణించాడు. ప్రెయిరీ ప్రాంతంలోని రైతులు ఒక తీవ్రమైన సమస్యతో పోరాడుతున్న విషయాన్ని డీర్ గుర్తించాడు. అక్కడ నేల చాలా గట్టిగా ఉండది. అంతేగాక, జిగట మట్టి కావడంతో, నాగలికి అతుక్కుపోయేది. నాగలి నేలలోకి దిగినా, మట్టి దానికే అంటుకుని ముందుకు కదిలేది కాదు. దీనితో, ఆ ప్రాంతంలో పంటలకంటే సమస్యలే ఎక్కువగా తాండవించేది. డీర్ ఈ సమస్యను ఒక వ్యాపార అవకాశంగా కాకుండా, పరిష్కరించాల్సిన సవాలుగా చూశాడు. ఒక విరిగిపోయిన ఉక్కు కత్తి ముక్కను ఉపయోగించి కొత్త రకమైన నాగలిని రూపొందించాడు. అది నేలలోకి సులభంగా చొచ్చుకుపోయి, మట్టిని అంటుకోనీయకుండా బయటకు విసరగలిగింది. రైతులు వెంటనే ఫలితాన్ని చూశారు. ఇది వ్యవసాయ విధానాన్ని మార్చేసిన తొలి స్టీల్ ప్లౌ. అదే సమయంలో 'జాన్ డీర్' అనే సంస్థకు పునాది పడింది. ఆ సమయంలోనే డీర్ ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నాడు. ప్రతి దున్నెపై తన పేరు ముద్రించాడు. అది కేవలం బ్రాండ్ గుర్తుకోసంగా కాకుండా, తాను స్వయంగా ఒక వాగ్దానాన్ని ఇస్తున్నట్టు రైతులు ధైర్యం ఉండాలన్న ఉద్దేశంతోనే పేరు ముద్రించేవాడు. 'నా పేరు ఉన్న ప్రతి పరికరం అత్యుత్తమ నాణ్యతను ప్రతిబింబించాలి' అని ప్రకటించేవాడు. తాత్కాలిక లాభాల కంటే దీర్ఘకాల విశ్వాసాన్ని అతను ఎంచుకున్నాడు. కాలక్రమేణా ఆ చిన్న వర్క్‌షాప్ ఒక విశాల పరిశ్రమగా మారింది. దివాలా తీసిన ఒక కమ్మరి ఆలోచన, శతాబ్దాల పాటు ప్రపంచ వ్యవసాయాన్ని ప్రభావితం చేయగలదని ఈ విజయ గాథ నిరూపిస్తుంది.

# దళితుల అభ్యున్నతిని విస్మరిస్తున్న ప్రభుత్వాలు

### డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం




**ప్రజాపక్షం/ఖమ్మం :** అనేక దశాబ్దాలుగా దళితుల అభ్యున్నతిని ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసురత్నం విమర్శించారు. డిహెచ్‌పిఎస్ ఖమ్మం జిల్లా రెండవ మహాసభ గిరిప్రసాద్ భవన్‌లో యమాల గోపాలరావు, దొసపాటి సృజన అధ్యక్షతన సోమవారం జరిగింది. మహాసభ ముఖ్య అతిథిగా ఏసురత్నం హాజమాట్లాడుతూ తరతరాలుగా అణిచివేత అంటరానితనం, వివక్షత, దోపిడీ, పీడనాల కింద నలిగిపోతున్న అట్టడుగు వర్గాలైన అశేష శ్రామిక కులాల అభ్యున్నతి లక్ష్యంగా దళిత హక్కుల పోరాట సమితి ఆవిర్భవించిదన్నారు. సమాజంలో తరతరాలుగా అంటరానితనం అనే అవమానీయ దురాచారానికి అత్యంత దారుణంగా బలైపోతున్న దళితులను సామాజిక, ఆర్థిక, రాజకీయ ఆధిపత్యాన్ని ప్రశ్నించి, అణిచివేతను ఎదిరించి, సామానత్వాన్ని సాధించేందుకు సంఘటితంగా చైతన్యవంతం చేసేందుకు ప్రధాన లక్ష్యంతో దళిత సామాజిక దృక్పథంతో తెలంగాణ రాష్ట్ర 2వ మహాసభలు 2026 ఏప్రిల్ 17, 18 తేదిల్లో వరంగల్ అబ్బాస్ ఫంక్షన్ జరగనున్నాయని తెలిపారు. సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో ప్రభుత్వరంగ సంస్థలు, ప్రభుత్వ సేవలు, ఉన్నత విద్యలో ప్రవేటీకరణ వేగవంతం కావాడానికి తోడు, ప్రవేట్ రంగంలో రిజర్వేషన్లు లేకపోవడంతో పాటు రిజర్వేషన్ల విషయంలో రాజ్యాంగ ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారన్నారు. ప్రవేట్ రంగాలలో రిజర్వేషన్ సాధన, పెరుగుతున్న జనాభా అనుగుణంగా రిజర్వేషన్లు, నిధులు కేటాయింపు, రక్షణశాఖలో, ప్రభుత్వ కాంట్రాక్టులో, ఇతర సంస్థల రిజ్వర్వేషన్ సాధన కోసం, సామాజిక న్యాయం, కులవివక్షణ నిర్మూలన, దళితుల సమగ్రాభివృద్ధి కోసం 2006 అక్టోబర్ 17న ఏర్పడిన దళిత హక్కుల పోరాట సమితి నాటి నుండి నేటి వరకు ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధుల కొరకు, దళితులపై జరగుతున్న దాడులకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. భూమిలేని దళితులకు భూపంపిణీ కోసం పోరాడిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, సంఘం జిల్లా నాయకులు యంగల ఆనందరావు, పగిడిపల్లి యేసు, తడికమల్ల యోబు, తోటపల్లి సీతారాములు, మామిడాల కిరణ్, వరద నరసింహరావు, నారపోగు వసంతరావు, కోట నాగేశ్వరావు, కొమ్ము ఫిలిఫ్స్, మాతంగి శ్రీనివాసరావు, జల్లా రామకృష్ణ, మేళ్లచెర్వు రవి, తుంగా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### నూతన కమిటీ ఎన్నిక

సభలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పగిడిపల్లి యేసు, యంగల ఆనందరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 31 మంది కౌన్సిల్ సభ్యులు, 18 మంది కార్యవర్గ




సభ్యులు, 11మంది ఆఫీస్ బేరర్లుగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా తడికమల్ల యోబు, ఉపాధ్యక్షుడిగా కోట నాగేశ్వరరావు, తోటపల్లి సీతారాములు, ఆర్గనైజింగ్ కార్యదర్శి యమాల గోపాలరావు, సహాయ కార్యదర్శులుగా మామిడాల కిరణ్, వరద నరసింహరావు, నారపోగు వసంతరావు, కోశాధికారిగా దొసపాటి సృజన ఎన్నికయ్యారు.

# పది నెలల అల్పాహారం పాత బిల్లులు విడుదల చేయాలి

### మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్ డిమాండ్

**ప్రజాపక్షం/ములుగు :** పది నెలల అల్పాహారం పాత బిల్లులు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో జరిగిన తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ములుగు జిల్లా ద్వితీయ మహాసభ సామల రమ అధ్యక్షతన జరిగింది. ఈసభలో జంపాల రవీందర్ మాట్లాడుతూ 2023 డిసెంబర్ నుండి 2024 వరకు మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులు విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించడం జరిగిందని, ఆ బిల్లులు ఇప్పటి వరకు చెల్లించలేదన్నారు, అవి అలా ఉండగానే వచ్చే జూన్ నుండి మరల అల్పాహారం అందిస్తామని ప్రభుత్వం చెప్పడం అంటే కార్మికులకు ఎలా సాధ్యమన్నారు. పథకం సాఫీగా సాగాలంటే ప్రభుత్వం పాత బిల్లులు వెంటనే విడుదల చేసి కార్మికులను కాపాడాలన్నారు. మహాసభలో సంఘం జిల్లా అధ్యక్షురాలు సామల రమ, ఉపాధ్యక్షురాలు పోరెడ్డి ప్రమీల, మల్లంపల్లి, ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాల అధ్యక్షులు అంకం పద్మ, మాలగాని కమలక్క, జనగాం శోభ, సరోజన, భవాని, గడ్డం భారతి, కుడుముల సమ్మయ్య, అమ్రుత, పి రాధ, సలువాల స్వరూప, భాగ్య, సంగు పోషమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా, కార్మిక సమస్యలపై పోరాటం చేస్తున్న సిపిఐని ఆదరించాలి

### సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నిత్యం ప్రజా, కార్మిక సమస్యలపై అలుపెగరని పోరాటం చేస్తున్న సిపిఐ పార్టీని ప్రజలు ఆదరించాలని పార్టీ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓమయ్య కోరారు. సోమవారం సిపిఐ నగర కమిటీ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని 32వ డివిజన్ గాంధీ గంజ్‌లో ఇంటింటికీ సిపిఐ పార్టీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కార్మిక సమస్యల పరిష్కారం కోసం పని చేసే సిపిఐ పార్టీని ప్రజలు ఆదరించాలని, ప్రజా సమస్యలపై పోరాడే కార్యక్రమాలకు తమ వంతు సహకారమందించాలని విరాళాలు సేకరించారు. ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపై సిపిఐ నిర్వహించే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు రఘురాంనాయక్, గోవర్ధన్, సాయిలు, సత్యనారాయణ, రాజు, స్వామి, సలీం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రజా కళాకారులకు గుర్తింపు కార్డులు



### ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి డిమాండ్
### కలెక్టరేట్ ఎదుట కళాకారుల భారీ ధర్నా

**ప్రజాపక్షం/భువనగిరి :** అర్హులైన ప్రజా కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజానాట్య మండలి కళాకారులు అనేక సంవత్సరాలుగా గుర్తింపు లేకుండా, సరైన పారితోషికం లేకుండా, సామాజిక భద్రత లేకుండా దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నారన్నారు. కళాకారుల కష్టాలను పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబించడం తగదన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో కళాకారులను ఉపయోగించుకుంటూ, వారికి కనీస గౌరవ వేతనం ఇవ్వకపోవడం అన్యాయం అన్నారు. ప్రతి కళాకారులకు గుర్తింపు కార్డు జారీ చేసి, కనీస పారితోషికాన్ని చట్టబద్ధం చేయాలని, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, పెన్షన్ వంటి భద్రతా పథకాలు తక్షణమే అమలు చేయాలని, జిల్లా కేంద్రంలో సాంస్కృతిక భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి భూషిపాక నర్సింహ్, చెక్క వెంకటేష్ మాట్లాడుతూ 50 సంవత్సరాలు నిండిన ప్రతి కళాకారుడికి రూ.6 వేలు పెన్షన్ ఇవ్వాలని, గుట్ట దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో స్థానిక వృత్తి కళాకారులకు ప్రదర్శన అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కళాకారులు చిరుర్ల లింగం, మూల పోచయ్య, పిట్టల శంకర్, కట్ల యాదగిరి, సోమనరసయ్య, ఇంజ హేమలత, శ్రీనివాస్, రాజప్ప, మల్లేశం, సరిత, దుప్పెల్లి చౌదరి, రేణుక, సుగుణమ్మ, కృష్ణమ్మ, కవిత, ఎలేంద్ర, రేణుక, సామి, శంకరయ్య, పద్మ, చంద్రారెడ్డి, తేజ, లక్ష్మయ్య, మల్లేశం, అన్నేమైన వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిజన్ కార్మికులతో చర్చలు జరపాలి

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** సమ్మె చేస్తున్న విద్యుత్ ఆర్టిజన్ కార్మికులతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని డిఇ కార్యాలయం వద్ద టివిఎసి జెఎసి ఆధ్వర్యంలో ఆర్టిజన్లు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపి దేవేందర్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్న ఆర్టిజన్లను ప్రభుత్వం చర్చలకు పిలవకపోవడం విచారకరమన్నారు. విద్యుత్ సంస్థలో గత 22 సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్నారని, వారి అర్హతను బట్టి కన్వర్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ల విద్యా అర్హతను బట్టి జూనియర్ లైన్‌మెన్లుగా, సబ్ ఇంజనీర్లుగా, ఆఫీసు సబార్డినేటర్లుగా, జూనియర్ అసిస్టెంట్లుగా ప్రభుత్వం గుర్తించాలని కోరారు. చాలీచాలని జీతాలతో వెట్టిచాకిరి చేస్తున్న ఆర్టిజన్లకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యుత్ జెఎసి నాయకులు హతీరాంనాయక్, రాంచంద్రు, దాసరి యాదయ్య, రమేష్‌రెడ్డి, కృష్ణ, రవి, జనార్ధన్‌గౌడ్, హరినాయక్, పాపయ్య, వెంకట్‌రెడ్డి, వెంకన్న, ఇంద్రారెడ్డి, యాదయ్య, సలీం తదితరులు పాల్గొన్నారు.



## ఆసరా పింఛన్లు వెంటనే మంజూరు చేయాలి : కృష్ణ



**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** ఆసరా పింఛన్లు వెంటనే మంజూరు చేయాలని సిపిఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి.కృష్ణ సోమవారం మూసాపేట్ జిహెచ్ఎంసి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జి. అంజనేయులును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ ఆధ్వర్యంలో ఈ నెల 1వ తేదీ నుండి 10వ తేదీ వరకు ఇంటింటి సిపిఐ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల సమస్యలను సేకరించామన్నారు. ఇంద్రానగర్‌లో 50సంవత్సరాలుగా నివసిస్తున్న వారికి ఇండ్ల పట్టాలు ఇవ్వాలని, రాజీవ్‌గాంధీ నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరారు. అదేవిధంగా ఏవీపురంలో నీటి బిల్లులు అధికంగా రావడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అలాగే అనేక మంది వికలాంగులు, మహిళలు, వితంతువులు ఆసరా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు మంజూరు కాలేదని, వెంటనే వారం దరికీ పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.మనోహరి, జి.గంగన్న, జి.రాములు తదితరులు పాల్గొన్నారు.

## వెనకబడిన వర్గాలకు గృహ వసతి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం

### ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** బడుగు బలహీన వర్గాలకు చెందిన వారి కుటుంబాలకు గృహ వసతి కల్పించడమే లక్ష్యంగా సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్ రెడ్డి అన్నారు. సోమవారం శామీర్‌పేట డివిజన్ దేవరయాంజాల్‌లో లబ్ధిదారు మామిడ్ల అశోక్ దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి న్యాయకత్వంలో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేదలకు సొంతింటి కల నెరవేరుతుందన్నారు. పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో ఇలాంటి సంక్షేమ పథకాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మధుసూదన్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తిరుపతి శంకర్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు అశోక్, దేవస్థాన మాజీ చైర్మన్ లక్ష్మినారాయణ, యూత్ కాంగ్రెస్ నాయకుడు నక్క సందీప్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని యువత అంబేద్కర్ అడుగు జాడల్లో నడవాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామ కూర మల్లారెడ్డి అన్నారు. మూడుచింతలపల్లి మున్సిపల్ అంతారంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ప్రధాన చౌరస్తాలో నూతనంగా అంబేద్కర్ విగ్రహాన్ని స్థానిక మున్సిపల్ చైర్మన్ జాం రవితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం రచించిన గొప్ప వ్యక్తి విగ్రహాన్ని ఆవిష్కరించడం నా అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. భారత రాజ్యాంగ నిర్మాత ప్రదాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంతో దళితులకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న కమ్యూనిటీ భవనాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జాతీయ కళా మండలి అధ్యక్షుడు ఎన్వీ అశోక్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన కళా ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. మున్సిపల్ చైర్మన్ జాం రవి మాట్లాడుతూ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాలకు సమ న్యాయం కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. దళితులకు పదవులు వస్తున్నాయంటే అంబేద్కర్ రచించిన రాజ్యాంగంతోనే అని చెప్పారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి విరాళాలు ఇచ్చిన దాతలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోనకాడు వెంకటేష్, కౌన్సిలర్లు, అంబేద్కర్ సంఘం సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

## మార్కులు తక్కువ వచ్చాయని మనస్థాపంతో యువకుడి అదృశ్యం



**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** ఇంటర్ పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఇంటి నుంచి బయటకు వెళ్ళి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్ఓ సైదులు తెలిపిన వివరాల ప్రకారం యాప్రాల్ లోని జైజవాన్ కాలనీలో చెల్లా సుబ్బ లక్ష్మి కుటుంబసభ్యులతో కలిసి నివసిస్తుంది. కుమారుడు చెల్లా బాలాజీ (17) ఇంటర్ చదువుతున్నాడు. ఇంటర్లో 400పైగా మార్కులు వస్తాయని ఆశించిన బాలాజీకి 300మార్కులు రావడంతో మనస్థాపం చెందాడు. ఈ నెల 13న ఇంట్లో ఎవరికి చెప్పకుండ బయటకు వెళ్ళి ఇంత వరకు తిరిగి రాలేదు. దీంతో అతని ఆచూకి కోసం చుట్టుప్రక్కల, బంధువుల వద్ద వెతికిన సమాచారం లభించలేదు. ఈ మేరకు కుటుంబసభ్యులు జవహర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకు న్నపోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# మహనీయుల విగ్రహాల ఏర్పాటు ఆలోచన గొప్పది

### అంబేద్కర్, పూలే, జగ్జీవన్ రామ్ విగ్రహాల ఆవిష్కరణలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ప్రజాపక్షం/నవాబుపేట్:** నవాబ్ పేటలో మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలనే ఆలోచన గొప్పదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం నవాబుపేట మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, తెలంగాణ శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, స్థానిక ఎమ్మెల్లే కాలే యాదయ్య తో కలిసి ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదరా రాజానర్సింహా మాట్లాడుతూ, అంబేద్కర్, పూలే, జగ్జీవన్ రామ్ వంటి మహానుభావులు సమాజ సమానత్వం, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. వారి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. ముఖ్యంగా అంబేద్కర్ చూపిన రాజ్యాంగ మార్గం దేశ ప్రజలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.అంబేద్కర్ మన రాజ్యాంగానికి ప్రాణం పోసిన మహానుభావుడు.ఆయన చూపిన మార్గం సామాజిక న్యాయం, సమానత్వానికి దారి చూపించింది. పూలే గారు విద్యా హక్కు కోసం పోరాడి సమాజాన్ని మేల్కొలిపారు. జగ్జీవన్ రామ్ అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేశారు అని అన్నారు. ఎమ్మెల్లే కాలే యాదయ్య మాట్లాడుతూ, ఈ మహనీయుల ఆలోచనలు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా ప్రతి ఒక్కరి జీవితంలో ప్రతిఫలించాలన్నారు. యువత ఈ మహనీయుల సిద్ధాంతాలను అనుసరించి సమా జ నిర్మాణంలో ముందుండాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ఈ మహనీయుల జయంతి ఉత్సవాలను రాష్ట్ర ఉత్సవాలుగా నిర్వహిస్తూ వారి సేవలను గుర్తుచేస్తోందని ఆయన పేర్కొన్నారు. సమానత్వం, విద్య, సామాజిక న్యాయం అనే విలువలు ప్రతి ఇంటికీ చేరాలి. అదే ఈ విగ్రహాల ఆవిష్కరణ లక్ష్యం అని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా గాయకులు ఏపూరి సోమన్న, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఆనందం, ఏఎంసి చేర్మెన్ రాథోడ్ గీతాసింగ్, పిఏసిఎస్ చేర్మెన్ పోలీస్ రాంరెడ్డి, స్థానిక సర్పంచ్ నర్సింహా రెడ్డి, కట్టెల మల్లేశం, మండల సర్పంచ్‌ల సంఘం అధ్య



క్షులు బల్వంత్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎమ్మార్వో జె.బుచ్చయ్య, ఎంపిడిఓ అనురాధ,మండల నాయకులు శివరాజ్, జాన్, తదితరులు పాల్గొన్నారు.

**పేదల ఆరోగ్య రక్షణ ప్రభుత్వ బాధ్యత**

పేదల ఆరోగ్య రక్షణ ప్రభుత్వ బాధ్యతని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు.సోమవారం నవాబుపేట మండలంలో మహనీయుల విగ్రహావిష్కరణలో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముందుగా మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి తనిఖీ చేశారు. ఆసుపత్రిలో గదులు, భవనాన్ని పరిశీలించారు. ఆసుపత్రిలో రోజు వచ్చే రోగుల ఒపి సేవలను, ల్యాబ్, సిబ్బంది గురించి మండల వైద్యాధికారి రోహిత్ ని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఉన్న రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న చికిత్సపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్లక్ష్యం చేయకుండా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు



అందించేందుకు బాధ్యతతో పని చేయాలని ఆదేశించారు. అలాగే ఆసుపత్రిలో శుభ్రతను కచ్చితంగా పాటించాలని, అవసరమైన ఔషధాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను మరింత మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఆసుపత్రి బిల్డింగ్ శిథిలావస్థకు చేరిందని, నూతన భవనా న్ని మంజూరు చేయాలని ఎమ్మెల్యే కాలే యాదయ్య, స్థానిక నాయకులు మంత్రిని కోరారు. నూతన ఆసుపత్రి భవన మంజూరుకోసం సిఎం దృష్టికి తీసుకెళ్లి మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## భూభారతి భూ సర్వేపై అవగాహన సదస్సు

### స్పీకర్ ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం /వికారాబాద్ :** మండల పరిధిలోని అత్వెల్లి గ్రామంలో భూ భారతి భూసర్వేపై అవగాహన సదుస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ నిజాం నవాబుల కాలంలో భూ సర్వే జరిగింది. ప్రజాప్రభుత్వం ఆధ్వర్యంలో ఇప్పుడు భూముల రీ సర్వే జరుగుతుందన్నారు. అప్పటికి ఇప్పటికి టెక్నాలజీ బాగా పెరిగింది. ఇప్పుడు ఆధునిక సాంకేతిక పద్ధతులను ఉపయోగించి భూములను సర్వే చేస్తారు. సరిహద్దు నిర్ణయిస్తారు. ప్రతి సర్వే నెంబర్‌కు మ్యాప్ ఇస్తారు. ఇదంతా మీముందే మీ అనుమతితో జరుగుతుందన్నారు. స్మార్ట్ ఫోన్ ద్వారా భూమి వివరాలను తెలుసుకోవచ్చాన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా యజమానుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని అధికారులు సక్రమంగా సర్వే చేయాలని గ్రామస్తులు అందరు సహకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్‌పి స్నేహమెహ్రా, గ్రామ సర్పంచు విజయలక్ష్మి మహేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ఉమశంకర్ ప్రసాద్, మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజు, మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





## 25 నుండి ధాన్యం సేకరణ కొనుగోళ్లు ప్రారంభం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** రబీ సీజన్ సంబంధించి ధాన్యం కొనుగోళ్లను ఈ నెల 25 నుండి ప్రారంభించాల్సిందిగా జిల్లా అదనపు కలెక్టర్ (పౌర సరఫరాలు) విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ ఎల్.సుగుణాబాయి, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి చంద్రకళ, జిల్లా కోపరేటివ్ అధికారి నాగలింగాచారి, జిల్లా మార్కెటింగ్ అధికారి రియాజ్, ధాన్యం సేకరణ కేంద్రాల ఇన్‌చార్జిలతో రబీ 2025–26 కాలానికి సంబంధించి ధాన్యం సేకరణ అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసిన 15 ధాన్యం సేకరణ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లకుగాను అవసరమైన మేరకు గన్నీ బ్యాగులను సిద్ధం చేసామని తెలిపారు. రైతులు తమ వడ్లను తడి, తాలు, దుమ్ము లేకుండా శుభ్రపరచి, బాగా ఆరబెట్టి సేకరణ కేంద్రాలకు తీసుకొని వచ్చే విధంగా అధికారులు సరైన అవగాహన కల్పించాలని అధికారులకు తెలిపారు. అదే విధంగా వరి కోత సమయంలో వరి మార్పిడి యంత్రాల యజమానుల తో సమన్వయం చేసుకొని ధాన్యాన్ని క్రమ పద్ధతిలో కొనుగోలు కేంద్రాలకు చేరే విధంగా ఏర్పా ట్లు చేసుకోవాలని సూచించారు. సేకరణ కేంద్రాల ఇన్‌చార్జి లు, వ్యవసాయ విస్తరణ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొని వచ్చి అమ్మిన 48 గంటల్లోగా దానికి సంబంధించి డబ్బును మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యే విధంగా చూడాలన్నారు.

**దళితరత్న అవార్డు గ్రహీతలకు అభినందన**



**శామీర్‌పేట :** దళిత రత్న అవార్డు గ్రహీతలను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సోమవారం అభినందించారు. మల్కాజ్‌గిరిలో ప్రభుత్వ పరంగా ఈనెల 5 న నిర్వహించిన బాబు జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలానికి చెందిన దళిత నాయకులకు దళిత రత్న అవార్డులు రావడం జరిగింది. అలాగే జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ దళిత సమైఖ్య రాష్ట్ర అధ్యక్షులు బిఎన్ రామ్మోహన్, జిల్లా ఎస్‌సి, ఎస్టి మెంబర్ ధన్‌రాజ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న ఫోన్‌లు అప్పగింత

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిదిలో గతరెండు నెలల్లో దొంగిలించిబడిన లేదా పోగోట్టుకున్న మొబైల్ ఫోన్‌లపై శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో 32 పిర్యాదులు వచ్చాయని శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాద్ సోమవారం తెలిపారు. వెంటనే సిఇఐఆర్ ఆన్‌లైన్ ఫోర్టల్ ద్వార పిర్యాదులు నమోదు చేశామని చెప్పారు. ఇందులో 20 ఫోన్‌లను రీకవరి చేసి బాధితులకు జవహార్‌నగర్ ఎసిపి చక్రపాణి సమక్షంలో బాధితులకు అప్పగించారు. తక్షణమే స్పందించి కేసులు నమోదు చేసి పిర్యాదుదారులకు ఫోన్‌లను అప్పగించినందుకు హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎస్‌ఐ సోమిరెడ్డి, బాధితులు పాల్గొన్నారు.

## పార్కు స్థలం కబ్జాపై చర్యలకు డిమాండ్

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట్ సింహపురి కాలనీలో ఏకంగా పార్కు స్థలం కబ్జా చేసి ఆపైన నిర్మాణాలు చేపడుతున్నారు. అది పార్కు స్థలమైన ప్రజాప్రయోజన స్థలమైన కనబడితే చాలు అక్రమ నిర్మాణదారులు వాలిపోరున్నారు. తప్పుడు పత్రాలు సృష్టించి ప్రజాప్రయోజన స్థలాలు కాజేస్తున్నా సర్కిల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు అధికారుల కనుసన్నల్లోనే అక్రమ నిర్మాణాలంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. సింహపురి కాలనీ సర్వే నంబర్.448 డి.బ్లాక్ లోని 500 గజాల పార్కు స్థలం తప్పుడు డాక్యుమెంట్స్ సృష్టించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి, పార్కు ప్రాంతంలో ఏర్పాటు చేసిన బోర్డును తొలగించి అదే స్థానంలో నిర్మాణ సంస్థ బోర్డు ఏర్పాటు చేసి దర్జాగా కబ్జాలకు పాల్పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. లేఅవుట్‌లో పార్కు స్థలమని చూపుతున్న సంబంధిత సర్కిల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.



## రోడ్డు ఆక్రమణలను తొలగించండి

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** చింతల్ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ సోమవారం డిప్యూటీ కమిషనర్‌ను కలిసి రోడ్డు ఆక్రమణలను తొలగించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగద్గిరిగుట్ట 280 డివిజన్‌లో జగద్గిరిగుట్ట మెయిన్‌రోడ్డు, అవుట్ పోస్టు నుండి హెచ్ఎంటి వెళ్లే దారిలో రోడ్డు విస్తరణ సందర్భంగా మిగిలిన భూమిలో షెడ్లు వెయ్యడం వల్ల వాహనాలను రోడ్డుపైన పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ ఏర్పడివ తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. గతంలో కొన్ని చోట్లు కూల్చివేతలు జరిగినప్పటికీ తిరిగి మళ్లీ వేసుకుంటున్నారని, వెంటనే వాటిని తొలగించి ఫుట్‌పాత్‌ను వేయాల్సిందిగా కోరారు. బీరప్పనగర్ నుండి మగ్దుమ్‌నగర్‌కు వేసిన రోడ్డువల్ల సుమారు 10ఫీట్ల వరకు స్థలం మిగిలిపోయిందని, ఆ స్థలం అక్కడివారికే కేటాయిస్తామని చెప్పి కొంతమంది డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం ఉందని వాటిపైకూడా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే సమస్యపై గతంలో సిపిఐ వినతిపత్రం ఇచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఇప్పటికైనా ఆ మిగిలిన స్థలంలో చెట్లను నాటి ప్రతి శుక్రవారం జరిగే మార్కెట్‌ను ఇక్కడ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి హరినాథ్‌రావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు నరసింహారెడ్డి, ప్రజానాట్యమండలి అధ్యక్షులు బాబు, సిపిఐ నాయకులు కృష్ణ, ఇమామ్, సామెల్, రవి, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



## సమస్యలు పరిష్కరించాలి

### మల్కాజ్‌గిరి ఎంపి ఈటలకు వినతి పత్రం అందజేసిన హైమారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మీ సమస్య మా పరిష్కారం కార్యక్రమంలో శామీర్‌పేట డివిజన్‌లో ప్రజల నుంచి అనేక సమస్యలపై వినతులు వచ్చాయని ఆ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని 'మహిళా శక్తి మై వాయిస్' వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎన్. హైమారెడ్డి అన్నారు. సోమవారం మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్‌ను ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శామీర్‌పేట గ్రామపంచాయతి ముందు రోడ్డును ఇష్టానుసారంగా తవ్వి వదిలేశారని దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అలాగే పలు వీధుల్లో స్పీడ్ బ్రేకర్లు వేయడం వలన తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. శామీరపేటలో వేసవికాలం సమీపిస్తున్నందున నీటి ఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. చెత్త సేకరణ సరిగా చేయడం లేదని దీంతో ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయని చెప్పారు. 2వ వార్డులో ఓల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందని విద్యుత్ సమస్యలు తీర్చాలని ఎంపిని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ రమేష్, గ్రామస్థులు బిక్షపతి, అండాలు, శేఖర్, రాము ముదిరాజ్, అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** నిరుపేదలకు ఇళ్లులేని ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు కట్టించి తీరుతామని పేద ప్రజల సంక్షేమంకోసం కాంగ్రెస్ పార్టీ అహర్నిశలు కృషి చేస్తుందని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్ అన్నారు.సోమవారం ఘట్‌కేసర్ సర్కిల్ 6వ డివిజన్ పరిధిలో ఇస్మాయిల్‌ఖాన్ గూడ గ్రామంలో మంజూరైన నూతన ఇందిరమ్మ ఇంటిని ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్ పాల్గొని గృహప్రవేశాన్ని



కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటిక్యాల కృష్ణారెడ్డి,పోచారం మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డిలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వేముల మహేష్ గౌడ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు పథకం ద్వారా పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ వారికి అండగా నిలవడమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని అన్నారు.ఇప్పటికే పేదలకు సన్నబియ్యం, ఉచితబస్సు,200యూనిట్ల కరెంటు,500జబ్సిడి గ్యాస్ వంటి అనేక పథకాలను అందుబాటులోని తీసుకువచ్చిందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో పోచారం ప్రధాన కార్యదర్శి మెట్టు గణేష్ యాదవ్,బద్రి హేమంత్,ఈగ శ్రీశైలం,మెరుగు నరేష్ గౌడ్,చంద్రకాంత్,ఇటిక్యాల రామకృష్ణ రెడ్డి,,తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన సభ్యులు పోర్ట్ ఫోలియో జడ్జి కె లక్ష్మ ణ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.

జవహర్ నగర్, అల్వాల్ పోలీస్ స్టేషన్లను కుషాయిగూడ కోర్టుకు మార్చాలని, కోర్టుకు సంబంధిత ప్రయోజనాల కోసం రెండు ఎకారాల స్థలంను మార్పిడి చేయాలని, కోర్టులో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టులు భర్తీ చేయాలని, నేరేడ్‌మెట్‌లో నిర్మిస్తున్న నూతన కోర్టు భవన పనులను వేగవంతం చేయాలని వినతి పత్రం కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష,



కార్యదర్శులు రత్తయ్య, దుర్గాప్రసాద్, లైబ్రరీ కార్యదర్శి సాయినాథ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల మధ్య జెప్టో గోదాం

* గుండాలను రప్పించి కాలనీవాసులపై దాడులు చేయించిన బిల్డర్
* రెసిడెన్షియల్ బిల్డింగ్ లో కమర్షియల్ దందా
* చర్యలు తీసుకోవాలని ఉప్పల్ జోనల్ కమీషనర్ ఫిర్యాదు

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్‌లో బండి గార్డెన్ ఎదురుగా నిర్మాణంలో ఉన్న అపార్ట్మెంట్‌లో జెప్టో గోదాం నిర్వహణ తీవ్ర వివాదానికి దారితీసింది. పూర్తిగా నివాస ప్రాంతంగా ఉన్న ఈ కాలనీలో కమర్షియల్ కార్యకలాపాలు నిర్వహించడం వల్ల స్థానికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజంతా డెలివరీ బాయ్స్ రాకపోకలు అధికంగా ఉండటం, తరచూ వాహనాల రద్దీ పెరగడం వల్ల కాలనీ ప్రశాంతత భంగమవుతోందని వాసులు చెబుతున్నారు. ముఖ్యంగా రోడ్డుపైనే బైక్‌ల పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తీవ్రరూపం దాల్చాయి. ఇరుకైన వీధుల్లో వాహనాలు నిలిపివేయడంతో అంబులెన్స్, ఫైర్ ఇంజిన్ వంటి అత్యవసర సేవల వాహనాలకు కూడా రాకపోకలు కష్టంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు నిర్వాహకులను ప్రశ్నించినప్పటికీ సరైన స్పందన రాలేదని, ఇటీవల ప్రశ్నించిన కొందరు కాలనీవాసు





లపై బిల్డర్ గుండాలను రప్పించి భౌతిక దాడులు చేపించడంతో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటనతో కాలనీలో భయాందోళన వాతావరణం నెలకొంది. మహిళలు, వృద్ధులు కూడా భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డి కాలనీవాసులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి ఘటనల వలన ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని అన్నా రు. ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా సపోర్టుగా ఉంటుందని కాలనీవాసులకు న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటామని భరోస కల్పించారు. అనంతరం దాడికి గురైన బాధితులతో కలిసి మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఘటనపై పోలీసులు విచారణ ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే ఈ అంశంపై ఉప్పల్ జోనల్ కమిషనర్‌కు కూడా కాలనీవాసులు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. రెసిడెన్షియల్ బిల్డింగ్‌లో కమర్షియల్ గోదాం నిర్వహణ చట్ట విరుద్ధమని పేర్కొంటూ తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇళ్ల మధ్య ఇలాంటి గోదాములు కొనసాగితే భవిష్యత్తులో మరిన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. సంబంధిత అధికారు లు వెంటనే జోక్యం చేసుకుని గోదాం నిర్వహణను నిలిపివేయడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని కాలనీ లో శాంతి భద్రతలను కాపాడాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, జలంధర్ రెడ్డి, పవన్, మోహన్, కర్ణాకర్ అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఎవరికి ఫిర్యాదు చేసుకుంటారో చేసుకోండి.... బిల్డర్ దురుసు వ్యాఖ్యలు**

రెసిడెన్షియల్ బిల్డింగ్‌లో కమర్షియల్ కార్యకలాపాలు నిర్వహించడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేయగా, బిల్డర్ చింతల ఉపేందర్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. ఇది నా బిల్డింగ్, నేను ఏదైనా చేసుకుంటాను ఎవరికి ఫిర్యాదు చేసుకుంటారో చేసుకోండి అంటూ దురుసుగా మాట్లాడినట్లు స్థానికులు తెలిపారు.

ఈ విషయంపై ప్రశ్నించిన కాలనీవాసులపై గుండాలను రప్పించి భౌతిక దాడులకు పాల్పడ్డారని బాధితులు ఆరోపిస్తున్నారు. నివాస ప్రాంతంలో కమర్షియల్ దందా కొనసాగించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు, భద్రతా సమస్యలు పెరుగుతున్నాయని, ఇలాంటి ఘటనలపై అధికారులు వెంటనే చర్య తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి

జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



**ప్రజాపక్షం/షాబాద్:** స్వయం ఉపాధి రంగాల్లో యువత రాణించేందుకు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం షాబాద్ మండలం హైతాబాద్‌లో సేరిగూడ గ్రామానికి చెందిన మహ్మద్ మెహమూద్ ఏర్పాటు చేసిన ఆన్ లైన్ షాపును మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, హైతాబాద్ సర్పంచ్ కర్రోళ్ల శాంతమ్మ యాదయ్య, సంకేపల్లిగూడ సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య, మాజీ సర్పంచులు మహ్మద్ ఖజామీయా పటేల్, జనార్ధన్‌రెడ్డి, నాయకులు శ్రీరాములు, బురాన్, దస్తగిరి, శ్రీకాంత్‌రెడ్డి, వార్డు సభ్యులు కావలి రవి, బుడిగారి సత్తయ్య పాల్గొన్నారు.

## అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ ఆశయాలను కొనసాగిద్దాం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను కొనసాగిద్దామని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హస్తినాపురం డివిజన్ నందనవనంలోని లక్కి హోటల్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన విగ్రహాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ విగ్రహాలు నెలకొల్పే పనుల్లో పలు రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హస్తినాపురం డివిజన్ పార్టీ అధ్యక్షులు ఆందోజు సత్యంచారి, శ్రీనివాస్ నాయక్, నాగిరెడ్డి, నర్సింహా, కింగ్ మధు, గోపి మధు, రాజు గౌడ్, అనిత, యాదగిరి, పర్వతాలు, కృష్ణ, రెడ్డిమాల కృష్ణ, శ్రీశైలం, శివ తదితరులు ఉన్నారు.

## విగ్రహాలకు శుద్ధి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** బిజెపి రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు సోమవారం సాహెబ్ నగర్ చౌరస్తాలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను బియన్‌రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, ఎల్‌బి నగర్ అసెంబ్లీ ఇంచార్జ్ సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో శుద్ధి చేసి చౌరస్తా ప్రాంగణం అంతటా శుభ్రపరిచారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు జగన్మోహన్, ఉపాధ్యక్షులు పారంద లక్ష్మయ్య, శేఖరానంద్, సహాయకార్యదర్శి నరేష్, పార్టీ అధికార ప్రతినిధి శ్రీధర్ రావు, గంగం ప్రేమ్‌నాథ్, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేష్ గౌడ్, శంకరయ్య గౌడ్, రవిశంకర్, నాగేష్, మురళి, విజయ్ పాల్గొన్నారు.

## విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** విద్యుత్ ఉద్యోగల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతుందని ఎస్పీడిసిఎల్ కంపెనీ యూనియన్ ట్రేజరర్ మాణిక్యరావు ఆరోపించారు. సోమవారం షాద్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిర్వహిస్తున్న సమ్మె ఆరవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మాణిక్యరావు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంతో ఆందోళనలు ఉధృతం చేయనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ సర్కిల్ జెఏసి చైర్మెన్ కె.రాజు, చైరన్ యాదగిరి, కన్వీనర్ స్వామి, జాయింట్ సెక్రటరీ రఘుపతి, షాద్‌నగర్ డివిజన్ జెఏసి చైర్మెన్ ఆంజనేయులు యాదవ్, కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల్లో పిల్లలను చేర్పి భవితకు బాటలు వేయండి



**ప్రజాపక్షం/కొత్తూరు:** అంగన్‌వాడీల్లో పిల్లలను చేర్పించి, భవితకు బాటలు వేయాలని మక్తగూడ సర్పంచ్ కోకుల శ్రీరాములు సూచించారు. సోమవారం మండల పరిధిలోని మక్తగూడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్ వైజర్ రేవతి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బోకుల శ్రీరాములు మాట్లాడుతూ మూడేళ్ళలోపు ఉన్న చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. విద్యపై పట్టు సాధించాలంటే అందుకు మూలం అంగన్‌వాడీ కేంద్రాలు అనే విషయాన్ని గుర్తించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాములు గౌడ్, కార్యదర్శి రవళి, వార్డు సభ్యులు బోకుల రాజు, బిటెక్ రాందాస్, చందర్, కృష్ణ, రజిత, లావణ్య, యశోద, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సత్యం, ఆశావర్కర్లు జయమ్మ, అంగన్‌వాడీ టీచర్ రెజినా, శ్రీదేవి, నాట్కో సూపర్‌వైజర్ జ్యోతి, టిచర్ అరుణ పాల్గొన్నారు.

# విధాన నిర్ణయాల్లో యువత భాగస్వామ్యం పెరగాలి

గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** యువత భవిష్యత్తు మాత్రమే కాకుండా వర్తమానంలో మార్పును తీసుకువచ్చే శక్తి అని, బలమైన, సమగ్ర భారతదేశ నిర్మాణానికి వారి ఆలోచనలు, భాగస్వామ్యం కీలకమని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా చేగూరులోని కన్హా శాంతి వనం వద్ద నిర్వహించిన "మై భారత్ బడ్జెట్ క్వెస్ట్ 2026 నేషనల్ యూత్ డైలాగ్ (తెలంగాణ, తమిళనాడు)" గ్రాండ్ ఫినాలే కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతుతూ దేశవ్యాప్తంగా యువత ఉత్సాహంగా పాల్గొనడం ఆనందదాయకమని చెప్పారు.యువతను విధాన నిర్ణయ ప్రక్రియతో అనుసంధానించే సమర్థవంతమైన వేదికగా మై భారత్ బడ్జెట్ క్వెస్ట్–2026 కార్యక్రమం నిలిచిందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు భాగస్వామ్య పరిపాలనను బలోపేతం చేసి ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రతిబింబిస్తాయని తెలిపారు. కేంద్రప్రభుత్వంలో ఆర్థికశాఖ సహాయమంత్రిగా పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ, బడ్జెట్, అభివృద్ధి ప్రాధాన్యాల్లో యువత అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వడం అవసరమని తెలిపారు. చర్చల్లో విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వంటి అంశాలపై యువత ఇచ్చిన సూచనలు దేశ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తాయని గవర్నర్ సూచించారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనలో యువత శక్తి, సృజనాత్మకత, నిబద్ధత కీలకమని గవర్నర్ స్పష్టం చేశారు. "నారీ శక్తి, వికసిత భారత్ వాయిస్" అంశం కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యతను తీసుకువచ్చిందని గవర్నర్ తెలిపారు. మహిళల భాగస్వామ్యం, నాయకత్వం సమగ్రాభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు.యువ పార్లమెంట్ వంటి కార్యక్రమాలు యువ మహిళలకు తమ అభిప్రాయాలను వ్యక్తపరచేందుకు, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు వేదికగా నిలుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో పార్లమెంటరీ విధానాన్ని అనుకరించి నిర్వహించిన చర్చలు పాల్గొన్న వారిలో ఆత్మవిశ్వాసం, సంభాషణ సామర్థ్యం, ప్రజా సమస్యలపై అవగాహనను పెంపొందిస్తాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలను చేర్చడం అభినందనీయమని గవర్నర్ పేర్కొన్నారు. సుస్థిరాభివృద్ధి ప్రతిఒక్కరి సామూహిక బాధ్యత అని,యువత దేశ నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా చెందిన కొట్ల రఘువీర్ రెడ్డికి వ్యవసాయ రంగంలో చేసిన వినూత్న ఆవిష్కరణకు గవర్నర్ అవార్డు అందజేశారు.ఆయన ఆవిష్కరణను ప్రధాని "మన్ కీ బాత్" కార్యక్రమంలో ప్రశంసించిన విషయం గవర్నర్ ప్రస్తావించారు. బడ్జెట్ క్వెస్ట్2026 గ్రాండ్ ఫినాలే కార్యక్రమంలో తమిళనాడు నుంచి 550 మంది, తెలంగాణ నుంచి 350మంది యువత పాల్గొన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, మై భారత్ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ అన్వేష్ చింతల్, జాతీయ సేవా పథకం ప్రాంతీయ డైరెక్టర్ (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) రామకృష్ణారావు, మై భారత్ తమిళనాడు రాష్ట్ర డైరెక్టర్ సెంథిల్ కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఖైదీలకు మెరుగైన సదుపాయాలు

జైళ్ల శాఖ డిజి సౌమ్యమిశ్ర



**ప్రజాపక్షం/హైదరాబాద్:** చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో ఖైదీలకు మెరుగైన వసతి కల్పించేందుకు కొత్తగా నిర్మించిన బ్యారక్‌ను జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్రా ప్రారంభించారు. ఈ కొత్త బ్యారక్‌తో జైలులో అదనంగా 84 మంది ఖైదీలకు వసతి కల్పించే అవకాశం ఏర్పడింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ నిర్మాణాన్ని కేవలం ఆరు నెలల్లో పూర్తి చేయడం శాఖ కృషికి నిదర్శనమని తెలిపారు. జైళ్లలో అధిక రద్దీ సమస్యను తగ్గిస్తూ, ఖైదీల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జైలు ఆసుపత్రి, పాథాలజీ, రక్త పరీక్ష ల్యాబ్‌లను పరిశీలించిన ఆమె, వైద్యసిబ్బందితో మాట్లాడి చికిత్స విధానాలపై సమీక్షించారు. గడువు ముగిసిన ఔషధాల నిర్వాహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఖైదీలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఇటీవల నిర్వహించిన మెడికల్ క్యాంప్‌లో గుర్తించిన వ్యాధులపై సమయానుకూల చికిత్స అందించాలని, బాధిత ఖైదీలను నిరంతరం పర్యవేక్షించాలని వైద్య బృందానికి ఆదేశించారు. జైళ్ల మౌలిక వసతుల అభివృద్ధి, రద్దీ తగ్గింపు, ఖైదీల సంక్షేమం, పునరావాసం లక్ష్యంగా జైళ్ల శాఖ చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఐజి ప్రిజన్స్ ఎన్.మురళి బాబు, డిఐజి డాక్టర్ డి.శ్రీనివాస్, చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ ఎన్.శివకుమార్ గౌడ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## జస్టిస్ యశ్వంత్‌వర్మ రాజీనామాను తిరస్కరించి అరెస్టు చేయాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** చట్టం ముందు అందరూ సమానమే అనే నీతి వ్యాఖ్యలు ప్రచారం చేసే ప్రధాని మోదీ జస్టిస్ యశ్వంత్‌వర్మను రాజీనామాను తిరస్కరించి ఆయనను తక్షణమే అరెస్టు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై ఆర్థిక వ్యవహారాల్లో నిష్ణాతులైన వ్యక్తులతో హైపవర్ కమిటీ ఏర్పాటు చేసి విచారణ జరిపించాలన్నారు. చట్టం ముందు న్యాయమూర్తి అయినా, సామాన్యుడు ఎవరైనా ఒకటేనని నిరూపించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. జస్టిస్ యశ్వంత్‌వర్మ అధికారిక నివాసంలో కోట్ల రూపాయలు అగ్నికి ఆహుతై బయటి ప్రపంచానికి తెలిసినప్పటికీ ఆడబ్బుతో ఎలాంటి సంబంధం లేదని బుకాయించటం న్యాయశాస్త్రంలో ఉన్న లొసుగులకు నిదర్శనమన్నారు. న్యాయమూర్తి అధికార నివాసంలో ప్రహరీగోడ లోపల ఉన్న గదిలో ఆ డబ్బు కాలిపోవటం, తనకు సంబంధం లేదని చెప్పడం, కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకోకపోవటం పాలకపక్షాల పక్షపాత దోరణి స్పష్టమవుతుందన్నారు. న్యాయమూర్తి చేసిన తప్పును, ద్రోహన్ని కప్పిపుచ్చుకోవటానికి న్యాయస్థానాలను ఆశ్రయించినప్పటికీ అక్కడ ఎలాంటి వెసులుబాటు లభించకపోవడంతో తన పదవికి రాజీనామా చేస్తాననటం అవకాశవాదమని బోస్ అభిప్రాయం వ్యక్తంచేశారు. ప్రగల్భాలు పలికే ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా ఈ విషయంపై స్పందించకపోవటం విచారకరమన్నారు. యశ్వంత్‌వర్మ రాజీనామాను ఆమోదిస్తే ఆ డబ్బుకు కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలకు సంబంధాలు ఉన్నాయనే అనుమానం బలపడుతుందన్నారు.

## ప్రతి పౌరుడు క్షేమంగా ఇంటికి చేరుకోవడమే మొదటి ప్రాధాన్యత

సైబరాబాద్ సిపి డాక్టర్ ఎం.రమేష్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రతి పౌరుడు క్షేమంగా తమ ఇంటికి చేరుకోవడమే తమ మొదటి ప్రాధాన్యతని సైబరాబాద్ సిపి డాక్టర్ ఎం.రమేష్ అన్నారు. సోమవారం రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రతి వాహనదారుడు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలనే లక్ష్యంతో సైబరాబాద్ పోలీసులు అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని గచ్చిబౌలిలో చేపట్టారు. కార్యక్రమంలో సైబరాబాద్ సిపి మాట్లాడుతూ పాల్గొని ద్విచక్ర వాహనదారులు, పాదచారులతో మాట్లాడారు. హెల్మెట్ ధరించడం నిబంధన మాత్రమే కాదని, అది ప్రాణ రక్షణ కవచమని గుర్తుచేశారు. కేవలం హెల్మెట్ పెట్టుకుంటే సరిపోదని, దాని స్ట్రాప్ (బెల్ట్) తప్పనిసరిగా బిగించాలని హెచ్చరించారు. కార్లలో ప్రయాణించే వారందరూ, డ్రైవర్‌తో సహా సీటు బెల్టు ధరించడం వల్ల ప్రమాద తీవ్రతను తగ్గించవచ్చని వివరించారు. అతి వేగం, మద్యం సేవించి వాహనం నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిపి హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్1 డిసిపి రంజన్ రతన్ కుమార్,ట్రాఫిక్1 అదనపు డిసిపి హనుమంతరావు, మాధాపూర్ ట్రాఫిక్ డివిజన్ ఎసిపి చంద్రశేఖర్ రెడ్డి, గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సురేష్, రాయదుర్గం ట్రాఫిక్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ హనిమిరెడ్డి, ఇతర పోలీస్ సిబ్బంది, పాదచారులు, ద్విచక్ర వాహనదారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/కేశంపేట:** ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సర్పంచ్ బీసా కవిత కరుణాకర్‌రెడ్డిలు ఆర్థిక సహాయం చేశారు. సోమవారం మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో లబ్ధిదారురాలు ఇరుకుల వరలక్ష్మీ రాజు దంపతులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇంటి స్లాబ్‌కు 40సిమెంట్ బస్తాలకు సరిపడ నగదు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవినాయక్, వార్డు సభ్యులు గుత్తి చంద్రయ్య, పోగుల నర్సింలు, నాగిళ్ల ప్రేమలత యాదయ్య, మాజీ సర్పంచ్ పోగుల భీమయ్య, చిట్టిరెడ్డి, నరసింహారెడ్డి, గుత్తి శేఖర్ పాల్గొన్నారు.



## రైతుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్



**ప్రజాపక్షం/యాచారం :** రైతుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని రైతు సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దుబ్బాక రాంచందర్ విమర్శించారు. సోమవారం మండల పరిధిలోని మేడిపల్లి నక్కర్త గ్రామంలో రైతు సంఘం నాల్గవ మండల మహాసభ జరిగింది. ఈ సభకు అయన ముఖ్యఅతిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో మండల నూతన కమిటీని 15 మందితో ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా మండల బాల్‌రాజు, తావునాయక్,ఉపాధ్యక్షులుగా బి.శ్రీశైలం, మండల బాషయ్య, సహాయ కార్యదర్శులుగా ఎం.ఐలయ్య, గడ్డం యాదగిరి, కమిటీ సభ్యులుగా అచ్చన నర్సింహ్మా, శ్రీను, శ్రీరామ్‌రెడ్డి, సత్యనారాయణ, అంజనేయులు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముసలయ్య, వెంకటయ్య, జగన్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో తాగునీరు, టాయిలెట్స్ వసతి కల్పించాలి

ఎంపికి టిజిఒ సంఘం మహిళ నాయకుల వినతి



**ప్రజాపక్షం/రంగారెడ్డి :** చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఉన్న ప్రభుత్వం కార్యాలయాల్లో మరుగుదొడ్ల నిర్వహణ చేపడతామని స్థానిక ఎంపి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం రంగారెడ్డి జిల్లా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో కొండ విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసి వివిధ అంశాలపై వినతిపత్రం అందజేశారు. శంషాబాద్ మండలానికి ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎంపి కొండ విశ్వేశ్వర్‌రెడ్డికి పలు అంశాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. మహిళలు పని చేసే చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని కార్యాలయాలలో మరుగుదొడ్ల నిర్మాణం కొరకు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్ఒ వాటర్ ప్లాంట్ల ఏర్పాటు కొరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్ల నిర్వహణ చేపడతామని ఎంపి హామీ ఇచ్చారు. అదేవిధంగా ఎంపి సూచనలతో వెటర్నరీ క్లినిక్ కి కావాల్సిన మౌలిక సదుపాయాలు, తాగునీరు వంటి సౌకర్యాలు చేపడతామని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధులు సూరజ్ కుమార్ పట్నాయక్, చీఫ్ జనరల్ మేనేజర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ పి.కైలాష్ కాంత్‌తెలిపారు. అనంతరం జిల్లా గెజిటెడ్ అధికారుల రంగారెడ్డి డైరీని ఎంపికి అందజేశారు. కార్యక్రమంలో సెంట్రల్ ఉమెన్స్ వింగ్ ట్రెజరర్ జి.శాంతి, జిల్లా సంక్షేమ అధికారి ఎల్.శ్రీలత, తదితర అధికారులు పాల్గొన్నారు.

# లక్ష్యాలు ఎంచుకొని విద్యనభ్యసిస్తే మంచి భవిష్యత్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్





**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని విద్యను అభ్యసిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఇంటర్ విద్యార్థులకు అభినంధించి స్వీట్లు తినిపించి శాలువాలతో సన్మానించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గురుకుల పాఠశాలలో రాష్ట్ర స్థాయిలో రెండల ర్యాంకు సాధించిన ఇంటర్ విద్యార్థినిని సన్మానించారు.

### విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చడంలో గురుకులాలు కీలకం

గ్రామీణ పేద విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చడంలో గురుకుల పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు వివరించారు. కమ్మదనం గురుకుల పాఠశాలలోని ఇంటర్మీడియట్‌లో ఎంపిసి విభాగంలో శ్రావణి 990, అఖిల 988, బైపిసి విభాగంలో లోఖిత 990, ఆశ్రిత 986, ఎంపిసి ఫస్ట్ విభాగంలో రిశ్విక 465, ఐశ్వర్య 465, శృతి 464, బైపిసి విభాగంలో భాగ్యశ్రీ 434, భవన 431, వరుని 430 మార్కులు సాధించిన విద్యార్థులను అభినంధించి శాలువాలతో సన్మానించారు. ఇందుకు సహకరించిన కళాశాల ప్రిన్సిపల్ శారదను ప్రత్యేకంగా అభినంధించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ అప్ప, మార్కెట్ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, పురుషోత్తంరెడ్డి, కొత్తూరు మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, అన్వర్, జిటి సంతోష్, జెనిగె జగన్‌లు పాల్గొన్నారు.

### ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్ ప్రారంభించిన ఎమ్మెల్యే

**కొందుర్గు:** ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్, టిప్పర్ లారీ అసోసియేషన్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సర్పంచ్ ప్రభాకర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ సాధిక్, నాయకులు కెకెకృష్ణ, కావలి యాదయ్య, భీమారం మాణెయ్య, జిల్లెల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వక్‌సేన్ హీరోగా కొత్త సినిమాఎన్‌టిఆర్ దేవరతో సెన్సేషనల్ క్రియేట్ చేసిన యువ సుధ ఆరట్స్ బ్యానర్ మరో భారీ సినిమాను రూపొందించటానికి సిద్ధమైంది. విశ్వక్‌సేన్ హీరోగా నిర్మాత సుధాకర్ మిక్కిలినేని ఈ క్రేజీ ప్రాజెక్ట్ స్టార్ట్ చేశారు.

రీల్

## చిరు అనే యువకుడి కథ ‘చిరంజీవి’




కికు యనమల, కశిష్ ఖాన్ జంటగా నటిస్తున్న సినిమా ‘చిరంజీవి‘. ఈ చిత్రంలో తనికెళ్ల భరణి, ఈశ్వరీ రావు, గోపరాజు రమణ, శ్రీకాంత్ భరత్, వైవా రాఘవ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను, కికు ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై దీప్తి నడిమింటి నిర్మిస్తున్నారు. సాయి వెంకట్ దర్శకత్వం వహిస్తున్నారు.‘చిరంజీవి’ సినిమా వేసవి విడుదలకు సిద్ధమవుతోంది. తాజాగా ఈ చిత్ర టైటిల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నాగబాబు చేతుల మీదుగా లాంచ్ చేశారు.ఈ సందర్భంగా నాగబాబుకు చిత్ర బృందం కృతజ్ఞతలు తెలిపారు. డెక్స్ట్రోకార్డియా (కుడివైపు గుండె ఉండే అరుదైన పరిస్థితి)తో ఉండే చిరు అనే యువకుడు తన జీవితంలో ఎదురైన సంఘర్షణలను, సవాళ్లను, అరుదైన పరిస్థితిని ఎలా తట్టుకుని నిలబడ్డాడు , తను అనుకొన్నవి ఎలా సాధించాడు అనేది ఈ చిత్రంలో ఆద్యంతం ఇంట్రెస్టింగ్‌గా, ఇన్స్ పైరింగ్‌గా తెరకెక్కిస్తున్నారు దర్శకుడు సాయివెంకట్. ప్రేక్షకులను ఎంగేజ్ చేసే అన్ని ఎలిమెంట్స్‌తో సమ్మర్ రిలీజ్‌కు రాబోతోంది చిత్రం. త్వరలోనే ‘చిరంజీవి’ సినిమా రిలీజ్ డేట్ ను మేకర్స్ అనౌన్స్ చేయబోతున్నారు. ఈ చిత్రానికి డిఒపి రామకృష్ణ, మ్యూజిక్ శేఖర్ చంద్ర ,ఎడిటింగ్ ఛోటా కె.ప్రసాద్, ప్రొడ్యూసర్ దీప్తి నడిమింటి స్క్రిప్ట్, డైరెక్షన్ శుభ సాయి వెంకట్.

## సెన్సార్ పనుల్లో ఆర్‌కె దీక్ష




ఆర్ కె ఫిలిమ్స్, సిద్ధ క్రియేషన్స్ బ్యానర్‌లో డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శక నిర్మాతగా డి ఎస్ రెడ్డి సమర్పణలో ఢీ, జోడి ఫేమ్ అక్సఖాన్, అలేఖ్య రెడ్డి హీరోయిన్స్‌గా, కిరణ్ హీరోగా నటిస్తున్న చిత్రం ‘ఆర్ కే దీక్ష’. ఈ చిత్రంలో తులసి, అనూష,కీర్తన, ప్రవల్లిక, రోహిత్ శర్మ ఇతర కీలక పాత్రలు పోషించారు. ‘ఆర్ కే దీక్ష’ సినిమా ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఈ చిత్రాన్ని త్వరలోనే థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తామని దర్శక నిర్మాత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో హీరోయిన్ అక్సాఖాన్ మాట్లాడుతూ ఆర్‌కె దీక్ష మూవీ తరువాత ఈ మూవీ తర్వాత వీరి కాంబినేషన్‌లోనే మహిళా కబడ్డీ మూవీ చేస్తున్నాను. ఆర్ కే దీక్ష సినిమాలో నంది అనే సాంగ్ చేశాను.ఈ పాట నంది అవార్డ్స్ నేపథ్యంగా సాగుతుందని అన్నారు. నటి తులసి మాట్లాడుతూ నేను ఈ చిత్రంలో హీరోయిన్ ఫ్రెండ్ క్యారెక్టర్‌లో నటించాను. ఈ మూవీలో అక్సాఖాన్, అలేఖ్య రెడ్డి కాంబినేషన్ లో నా సీన్స్ ఉంటాయి. ‘ఆర్ కె దీక్ష‘ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా అన్నారు. సెన్సార్ పనులు జరుగుతున్నాయి.సెన్సార్ కార్యక్రమాలు పూర్తి కాకుండా రిలీజ్ డేట్ అనౌన్స్ చేయలేం కాబట్టి ఆగాం. త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తాం. నిర్మాతగా నాకు ఇది 44వ సినిమా, దర్శకుడిగా 9వ సినిమా. ఫైట్స్ రవి మాస్టర్ అద్భుతంగా కొరియోగ్రాఫ్ చేశారు. అలాగే సాంగ్స్ లో ఒక పాట స్పెషల్‌గా మన జవాన్ల ధైర్యసాహసాలను త్యాగాన్ని చెబుతూ రూపొందించాం. ఆ పాటను మధుప్రియ పాడింది. ఈ సినిమా నిర్మాణంలో డిఎస్ రెడ్డి మాకు సపోర్ట్‌గా నిలిచారు. విలన్‌గా జమ్మూ కాశ్మీర్‌కు చెందిన రోహిత్ శర్మ నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం : రాజ్ కిరణ్, ఎడిటర్ : మేఘన శ్రీను, ఫైట్స్ : రవి డాన్స్ : ఆనంద్.

## జూ.ఎన్‌టిఆర్ కొత్త మేకోవర్



జూనియర్ ఎన్‌టిఆర్, కన్నడ దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కోసం ఎన్‌టిఆర్ కొత్తగా మేకోవర్ అవుతున్నాడు. యాక్షన్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు ఇంకా పేరు నిర్ణయించలేదు. అయితే డ్రాగన్ అనే పేరును వర్కింగ్ టైటిల్‌గా పెట్టుకున్నారు. యాక్షన్, పొలిటికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం ఎన్టీఆర్ ప్రతి రోజూ వ్యాయామం చేసి కొత్తగా మేకోవర్ అవుతున్నారు. ఈ సినిమా దాదాపుగా యాభై శాతం షూటింగ్ అయింది. కెజిఎఫ్, సలార్ వంటి సినిమాలను రూపొందించిన ప్రశాంత్ నీల్ కావడంతో సినిమా పై క్రేజ్ పెరిగింది. ఎన్‌టిఆర్ సరసన రుక్మిణీ వసంత్ హీరోయిన్ గా నటిస్తోంది. నందమూరి కళ్యాణ్ రామ్, వై. రవి శంకర్, నవీన్ యేర్నేని నిర్మిస్తున్నారు.

## ‘భరతవర్ష’గా గోపీచంద్



హీరో రో టి. గోపీచంద్, సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా కు పేరు ఖరారు చేశారు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ నిర్మాత శ్రీనివాస చిట్టూరి నిర్మాణంలో, పవన్ కుమార్ సమర్పణలో రూపొందుతున్న చిత్రానికి భరతవర్ష అని నామకరణం చేశారు. ఈ చిత్ర నిర్మాతలు పవర్ ఫుల్ గ్లింప్స్ ద్వారా సినిమా టైటిల్‌ను ఆవిష్కరించారు. క్రీ.శ. 642 నేపథ్యంలో సాగే ఈ గ్లింప్స్, శూల భూమిలో ప్రారంభమై, అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలతో కట్టిపడేసింది. భారీ యుద్ధ సన్నివేశాలు, యుద్ధంలో ఆరితేరిన యోధుల క్లోజప్‌లు, కత్తులు, గొడ్డళ్లు, అగ్నిజ్వాలల మధ్య జరిగే పోరాటాలు కనువిందు చేసే విజువల్ ఫీస్ట్‌ని అందించాయి. భరత భూమికి (భారతదేశానికి) ప్రతీకగా నిలిచే ‘భరత వర్ష’ టైటిల్ పెట్టినట్టు నిర్మాత చెప్పారు. యాక్షన్ సన్నివేశాలతో ఈ చిత్రం ఆకట్టుకునేలా రూపుదిద్దుకుంటోంది. హీరో గోపీచంద్ ఈ చిత్రంలో యోధుడి పాత్ర కోసం కంప్లీట్ ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. ఆయన ఫిజిక్, నటన, స్క్రీన్ ప్రెజెన్స్అన్నీ కలిసి పాత్రను ఎంతో నిజాయితీగా కనిపించేలా చేశాయి. ఇది ఆయన గత చిత్రాల నుండి పూర్తిగా భిన్నమైన పాత్రగా నిలుస్తోంది. హీరోయిన్‌గా రీతూ వర్మ నటిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్ సౌందర్ రాజన్ , అనుదీప్ దేవ్ అందించిన బ్యాగ్రౌండ్ స్కోర్ అందించారు. భారీ స్థాయి, నిజాయితీతో కూడిన కథనం, ఎమోషన్స్ అన్నీ కలిసిన భరత వర్ష ఒక గొప్ప చారిత్రక చిత్రంగా రూపుదిద్దుకుంటోంది. షూటింగ్ దాదాపుచివరి దశకు చేరుకోగా, పోస్ట్ ప్రొడక్షన్ వేగంగా కొనసాగుతోంది.

## మే 8న ‘గోదారి గట్టుపైన’ రిలీజ్



హీరో సుమంత్ ప్రభాస్ రూరల్ లవ్, ఫ్యామిలీ డ్రామా ‘గోదారి గట్టుపైన’తో అలరించబోతున్నారు. సుభాష్ చంద్ర దర్శకత్వంలో రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మించింది. నిధి ప్రదీప్ ఈ చిత్రంలో కథానాయికగా నటించగా, జగపతి బాబు కీలక పాత్రలో కనిపించనున్నారు. ‘గోదారి గట్టుపైన’ రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. మే 8న ఈ చిత్రం వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. ఒక వైపు సుమంత్ ప్రభాస్, మరో వైపు జగపతి బాబు.. మధ్యలో నిధి ప్రదీప్ నిల్చున్న రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ కథపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రానికి నాగ వంశీ కృష్ణ మ్యూజిక్, సినిమాటోగ్రఫీని సాయి సంతోష్, ప్రొడక్షన్ డిజైన్‌ను ప్రవాల్య, ఎడిటింగ్‌ను అనిల్ కుమార్ పి, సౌండ్ డిజైన్‌ను నాగార్జున తల్లపల్లి నిర్వహిస్తున్నారు. సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్, జగపతి బాబు, రాజీవ్ కనకాల, లైలా, దేవి ప్రసాద్, సుదర్శన్, రాజ్ కుమార్ కసిరెడ్డి, వైవా రాఘవ్, రోహిత్ కృష్ణ వర్మ తదితరులు నటించారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మధులిక సంచన లంక, డిఓపి సాయి సంతోష్ , సంగీతం నాగ వంశీ కృష్ణ, , ఎడిటర్ అనిల్ కుమార్ పి సౌండ్ డిజైనర్ నాగార్జున తాళ్లపల్లి.

## తిమ్మరాజుపల్లి టీవీలో ‘గోపాల గోపాల’ పాట ఆవిష్కరణ



హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్‌తో కలిసి తన కెఎ ప్రొడక్షన్స్‌పై నిర్మిస్తున్న సినిమా ‘తిమ్మరాజుపల్లి టీవీ’. తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్స్‌గా పరిచయమవుతున్నారు. ‘తిమ్మరాజుపల్లి టీవీ’ చిత్రంతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా ఈ నెల 17న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ‘తిమ్మరాజుపల్లి టీవీ’ సినిమా నుంచి ‘గోపాల గోపాల..’ సాంగ్ రిలీజ్ చేశారు. ఈ పాటకు సనరే సాహిత్యాన్ని అందించగా, వంశీకాంత్ రేఖన కంపోజ్ చేశారు, మేఘనాయు డు పాడారు. ఈ పాట ఎలా ఉందో చూస్తే ‘గోకుల గోపాలక, మాధవ నారాయణ, కానగా సాధ్యమా, కలియుగ మాయ, గోకుల గోపాలక, మాధవ నారాయణ, కాలమే సాక్షిగా అలమిన మాయ, నీదు మాయే నీల వర్ణా , హాసమైనా శోకమైనా కాంతులే నిలుపవా కనుతడిన..’ అంటూ కలియుగంలో జరుగుతున్న వింత ఘటనల్ని ఆ గోవిందుడికి విన్నవిస్తూ పాట ఆకట్టుకునేలా ఉంది. సాయి తేజ్, వేద జలంధర్, ప్రదీప్ కొట్టె, స్వాతి కరిమిరెడ్డి, అమ్మ రమేష్, సత్యనారాయణ, లతీష్, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్ సుధీర్ మాచర్ల, క్రియేటివ్ ప్రొడ్యూసర్ రితికేష్ గోరక్ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కెఎల్ మదన్డీ, ఒపి అక్షయ్ రామ్ పొదిశెట్టి, మ్యూజిక్ వంశీకాంత్ రేఖన,.

## వేతనాలు అమలు చేయాలి


(మొదటి పేజీ తరువాయి)

వేతనాల సవరణ డిమాండ్‌ను నెరవేర్చాలని కోరుతూ ఉదయం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నినాదాలు చేశారు. సెక్టార్ 62, సెక్టార్ 84లలో, మదర్‌సన్ కంపెనీ యూనిట్‌తో సహా ఇలాంటి నిరసనలు జరిగినట్లు నివేదికలు వచ్చాయి. నిరసనకారులు జాతీయ రహదారి 9ని కూడా దిగ్బంధించారు. కొంతమంది నిరసనకారులు ఆస్తులను ధ్వంసం చేయడం, రాళ్లు విసరడం, వాహనాలకు నిప్పు పెట్టడంతో ఈ నిరసనలు త్వరలోనే హింసాత్మకంగా మారాయి. గౌతమ్ బుద్ధ నగర్ కమిషనరేట్ పరిధిలోని పారిశ్రామిక జోన్‌ల అంతటా తగినంత పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పరిస్థితిని పర్యవేక్షించడానికి సీనియర్ పోలీసు, పరిపాలనా అధికారులు క్షేత్రస్థాయిలో నిమగ్నమై ఉన్నారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ప్రభావిత ప్రాంతాలకు భారీ పోలీసు బలగాలను పంపినట్లు వారు తెలిపారు. పరిస్థితి అదుపులో ఉందని, నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, కార్మికులకు నచ్చజెప్పి, శాంతిని కాపాడటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, శాంతిభద్రతలను కాపాడటానికి అవసరమైన చోటల్లా కనీస బలప్రయోగం చేస్తున్నామని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.



వదంతులను నమ్మవద్దని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితిని పునరుద్ధరిస్తున్నామని హామీ ఇచ్చారు. గౌతమ్ బుద్ధ నగర్‌లోని కార్మికులకు తప్పనిసరిగా డబుల్ ఓవర్‌టైమ్ చెల్లింపు, సకాలంలో వేతనాలు సహా కార్మిక సంక్షేమాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం పలు చర్యలను ప్రకటించిన ఒక రోజు తర్వాత ఈ హింస చెలరేగింది. జిల్లా మేజిస్ట్రేట్ మేధా రూపమ్ ఆదివారం పారిశ్రామిక యూనిట్ల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, కార్మికుల హక్కులను పరిరక్షించడానికి కీలక ఆదేశాలు జారీ చేశారు. తమ ఉద్యోగాలను కొనసాగించాలనుకుంటున్న కార్మికులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని ఆమె ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా యాజమాన్యాలు ఉద్యోగులతో సంప్రదింపులు జరపాలని కోరారు. కార్మికులకు ఎలాంటి కోతలు లేకుండా ప్రామాణిక రేటుకు రెట్టింపు ఓవర్‌టైమ్ చెల్లిస్తారని, అలాగే వారికి వారానికి ఒక సెలవు ఉంటుందని ఆమె ప్రకటించారు. ఆదివారాల్లో పని చేస్తే రెట్టింపు వేతనం చెల్లిస్తారని, నిబంధనల ప్రకారం బోనస్‌లు అందజేస్తారని కూడా ఆమె తెలిపారు. ఫ్యాక్టరీ గేట్ల వద్ద ఉన్న సిసిటివి కెమెరాలు పనిచేసేలా చూడాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి, శాంతిభద్రతలను కాపాడటానికి ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని కూడా పరిపాలన యంత్రాంగం పారిశ్రామిక యూనిట్లను ఆదేశించింది. కాగా, సోమవారం ఢిల్లీలోని కీలక ప్రవేశ మార్గాల వెంబడి భద్రతను కట్టుదిట్టం చేశారు. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, అశాంతి వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి, నోయిడాను ఢిల్లీలోని వివిధ ప్రాంతాలకు కలిపే అన్ని మోటారు వాహనాలు వెళ్లే రహదారులపై, ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌తో ఉన్న ప్రధాన సరిహద్దు పాయింట్ల వద్ద అనేక బృందాలను మోహరించారు. నిరసనల ముసుగులో ఎలాంటి సంఘ విద్రోహ శక్తులు నగరంలోకి ప్రవేశించకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన నిఘా ఉంచుతున్నామని, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని సీనియర్ అధికారులు తెలిపారు. కీలక సరిహద్దు పాయింట్ల వద్ద బారికేడింగ్‌ను ముమ్మరం చేశారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే తక్షణమే స్పందించేందుకు, ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు, పారామిలిటరీ బలగాలతో సహా అదనపు సిబ్బందిని మోహరించారు. తాము పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని, ఉత్తరప్రదేశ్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని పోలీసు అధికారులు తెలిపారు.




## కెసిఆర్ సభ


(మొదటి పేజీ తరువాయి)

కోరుతూ కాంగ్రెస్ నాయకులతో జీవన్ రెడ్డి సమవేశం నిర్వహించి మాట్లాడారు. నాలుగు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పనిచేశామని విధిలేని పరిస్థితిలో పార్టీ నీ వీడాల్సి వచ్చిందన్నారు. జాతీయ స్థాయిలో బిజెపి,రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్ పాలనకు ప్రజలు విసిగిపోయి కెసిఆర్ పాలనే బాగుండే అనే చర్చ వచ్చిందన్నారు. రేవంత్ రెడ్డి పోవాలి.. కెసిఆర్ రావాలి అనే నినాదం ప్రజల్లో నుండి వచ్చిందని నేను అంటున్నది కాదన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు రాష్ట్ర ప్రభు త్వం వేతనాలు ఇవ్వకపోవడంతో కేంద్రం నిధులతో గ్రామ పంచాయతీలు చెల్లిస్తున్నాయన్నారు. నాలుగు దశాబ్దాల అనుబంధాన్ని వీడాలని ఎవరు కోరుకోరని, జీవితం మొత్తం కాంగ్రెస్ పార్టీ కోసం త్యాగం చేసినట్లు గుర్తు చేశారు. అధికార పార్టీని కాదని ఆత్మ గౌరవం కోసం పార్టీని వీడుతున్నట్లు వివరించా రు. డిజిటల్‌కీ సర్పంచులకు ఇచ్చి పారిశుద్ధ్య కార్మికులకు తక్షణమే వేతనాలు ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారులు చట్టాన్ని అతిక్రమించి ఏకపక్షంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. కెసిఆర్‌తో కలిసి నడవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సహజంగా ప్రతి పక్షంలోనున్నవారు అధికార పార్టీకి వెళ్తారు.కానీ నేను అధికార పార్టీని వీడి ప్రతిపక్షంలోకి వెళ్తున్నట్లు వివరించారు.

## లీగల్ నోటీసు

(మొదటి పేజీ తరువాయి)

కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు రాష్ట్ర పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి,మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క లీగల్ నోటీసు పంపించారు. బిఆర్ఎస్ అధికారిక సోషల్ మీడియా వేదికల్లో జరుగుతున్న దుష్ప్రచారానికి ఆ పార్టీ అధినేతగా కెసిఆర్ బాధ్యత వహిస్తూ, ఈ మేరకు 48 గంటల్లో సోషల్ మీడియా పోస్టులను తొలగించి, బిఆర్ఎస్ , కెసిఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆ లీగల్ నోటీసులో మంత్రి సీతక్క హెచ్చరించారు. మంత్రి తరఫున అడ్వకేట్ నాగులూరి కృష్ణ కుమార్ రిజిస్టర్డ్ పోస్టు ద్వారా ఈ నోటీసును పంపించినట్టు మంత్రి సీతక్క సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్వాడి మొబైల్ ఫోన్ల కొనుగోలు ప్రక్రియను తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ (టిజిటి) నిర్వహించిందని, టెండర్ ఎవాల్యుయేషన్ కమిటీ నిర్ణయాల ప్రకారం కాంట్రాక్ట్ కేటాయించారని, ఇందులో తమ ప్రమేయం లేదని ఆ నోటీసులో మంత్రి స్పష్టం చేశారు. తన ప్రతిష్టను దెబ్బతీసే విధంగా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మొత్తం టెండర్ విలువ రూ. 44.42 కోట్లు అయినప్పటికీ అందులో రూ.30 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించడం అసంబద్ధమని, ఇది పూర్తిగా ఆధారాలు లేని ఆరోపణ అని వివరించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఒక్కో మొబైల్ ఫోన్‌ను రూ.11,650కే కొనుగోలు చేశామని, ఇతర రాష్ట్రాల కంటే తక్కువ ధరకు టిజిటిఎస్ ద్వారా కొనుగోలు చేశామని మంత్రి వివరించారు. అంగన్వాడి మొబైల్ ఫోన్ల కొనుగోలుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎక్స్‌పర్ట్ కమిటీ సూచనల మేరకే టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని మంత్రి సీతక్క తెలిపారు.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com